RNI.No. APTEL/2014/57702 ESTD: 1999
www.voodayam.com




# వుదయం

నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
కపిల్ చిట్స్
46 Years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

గుంటూరు | 01-07-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 109 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on



## రైతు భరోసా నిధులు విడుదల

30 నెలల ప్రజాపాలనలో రైతు

తలెత్తుకునేలా పాలన అందిస్తున్నాం

ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి

నెట్టిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

ఏర్పడే సమయానికి రాష్ట్ర అప్పు రూ.69

వేల కోట్లు ఉండగా, 2023 నాటికి

అది రూ.8.11 లక్షల కోట్లకు చేరింది

కల్వకుంట్ల కుటుంబం చేసిన అప్పులు,

తప్పుల భారం తమ ప్రభుత్వం భరిస్తోంది

'బకాయిలు పెట్టింది

బకాసురుడు కట్టే పాపం మాకా?

ఢిల్లీ నుంచి గల్లీ వరకు తెలంగాణ

పరువు తీశారు : సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 30 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణలో రైతు భరోసా నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. తొలి విడతలో రెండు ఎకరాల లోపు భూమి కలిగిన 41.37 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,482 కోట్లను నేరుగా జమ చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. రైతుల పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 30 నెలల ప్రజా పాలనలో రైతు తలెత్తుకునేలా పాలన అందిస్తున్నామని అన్నారు. వ్యవసాయం దండగ కాదని, పండుగగా భావించే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడే సమయానికి రాష్ట్ర అప్పు రూ.69 వేల కోట్లు ఉండగా, 2023 నాటికి అది రూ.8.11 లక్షల కోట్లకు చేరిందని అన్నారు. గత పదేళ్లలో దాదాపు రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి ధనిక రాష్ట్రాన్ని

మిగతా 2లో

## భూ యాజమాన్య హక్కులు

# ఆలయాలవే

### ఆ హక్కులు దేవాలయాలకే ఉండాలి



హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు భూమి కేటాయింపులో

ల్యాండ్‌ను ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారమే కేటాయించాలి

మతాలకు స్థలాలు ఇచ్చే అంశంపై పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలి

భూ కేటాయింపుల ప్రక్రియలో దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలలో

అనుసరిస్తున్న నిబంధనలు, విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి

కొండపై కాటేజీలు, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి చూపే

దాతలు, సంస్థల వివరాలతో కూడిన జాబితాను తక్షణమే రూపొందించాలి

ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్షా సమావేశం

యాదగిరిగుట్టపై భక్తుల వసతి కోసం నిర్మించతలపెట్టిన అతిథిగృహాల నిర్మాణంలోనూ తిరుమల మోడల్‌నే అనుసరించాలి. కొండపై కాటేజీలు, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి చూపే దాతలు, సంస్థల వివరాలతో కూడిన జాబితాను తక్షణమే రూపొందించాలని, వీరికి విడతలవారీగా నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలి. ఆలయ పరిసరాల్లో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలి. యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో ఒక ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలి. సిఎం రేవంత్



**యాదగిరిగుట్ట, జూన్ 30 (వుదయం ప్రతినిధి) :** స్థలాలు ఎవరికి కేటాయించినప్పటికీ, ఆయా భూములపై పూర్తి యాజమాన్య హక్కులు మాత్రం ఆలయాలకే ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి, భూ కేటాయింపులపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ భూముల పరిరక్షణ, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన నిర్మాణాలపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. యాదగిరిగుట్టలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు భూమి కేటాయింపు విషయమై స్పందిస్తూ, సదరు ల్యాండ్‌ను ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారమే కేటాయించాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే, ఆలయ పరిధిలో వివిధ మతాలకు స్థలాలు ఇచ్చే అంశంపై స్పష్టమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో

## కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల రాజకీయాన్ని నడుపుతోంది

### తెలంగాణలో కౌంట్‌డౌన్ ప్రారంభమైంది

ఆరు గ్యారంటీల్లో ఒక్క హామీని అమలు చేయలేకపోయారు

స్థానిక సమస్యలను పట్టించుకోకుండా

ఢిల్లీ దర్బార్‌ను సంతోషపెట్టడానికే ఎక్కువ ప్రాధాన్యం

మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు బిజెపి పూర్తిగా వ్యతిరేకిస్తుంది

బిజెపి నాయకత్వంకు తెలంగాణ ప్రత్యేక మిషన్

2028లో తెలంగాణలో విజయం బిజెపిదే

బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్



**హైదరాబాద్, జూన్ 30 (ఎఎంఎస్) :** తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం కౌంట్‌డౌన్ నేటి నుంచే ప్రారంభమైందని బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ప్రకటించారు. మూడు రోజుల రాష్ట్ర పర్యటనలో చివరగా ఘటకేశ్వర్ వద్ద పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ పార్టీ జాతీయ నాయకత్వం తెలంగాణను ప్రత్యేక మిషన్‌గా స్వీకరించిందని ప్రకటించారు."మన పోరాట దిశను మేము ఇప్పటికే నిర్ణయించుకున్నాం. వీధి నుంచి శాసనసభ వరకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం. ఈ ప్రభుత్వ కౌంట్‌డౌన్ నేటి నుంచే ప్రారంభమైందని నేను విశ్వసిస్తున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రతి రూపాయి ఖర్చుకు, ప్రతి నిర్ణయానికి, ప్రతి అవినీతి వ్యవహారానికి బిజెపి కార్యకర్తలు ప్రజల తరఫున పూర్తి లెక్క అడుగుతారు. అందుకు మీరందరూ సిద్ధంగా ఉండాలి" అని పిలుపిచ్చారు. గత రెండు రోజులుగా తెలంగాణలో పర్యటించిన సందర్భంగా తాను చూసిన దృశ్యాలు, కార్యకర్తల్లో కనిపించిన ఉత్సాహం, ప్రజల్లో నెలకొన్న విశ్వాసం రాష్ట్రంలో పార్టీ భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉండబోతోందని, రానున్న కాలం తెలంగాణలో బీజేపీదేననే విశ్వాసం మరింత బలపడిందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఆకాంక్షించిన అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించాలనే సంకల్పాన్ని ఈ కార్యవర్గ సమావేశం ద్వారా మనమంతా చేయాలని ఆయన పిలుపిచ్చారు. నేడు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల రాజకీయాన్ని నడుపుతోందని చెబుతూ ప్రతి గ్రామపంచాయతీ, ప్రతి బూత్ స్థాయికి వెళ్లి ఆ అబద్ధాలను ప్రజల ముందు బట్టబయలు చేయాల్సిన బాధ్యత మనపై ఉందని సూచించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో దాదాపు 35 శాతం ఓట్లను సాధించి బిజెపి తన బలమైన ఉనికిని నమోదు చేసిందని చెబుతూ ఇది తెలంగాణ ప్రజల్లో పార్టీపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనం అని తెలిపారు. తెలంగాణలో ప్రజాసమస్యలపై, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతికి వ్యతిరేకంగా మనమంతా ప్రజల కోసం

మిగతా 2లో

## రూ.30 వేల కోట్ల రైతు భరోసా నిధులు ఎగ్గొట్టారు

ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు

70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే ఆశీర్వాద సభలా?

చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారు

కేసీఆర్ రైతు బాంధవుడు.. మీరు ఎప్పటికీ రైతు ద్రోహే : సీఎంపై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్, జూన్ 30 (వుదయం ప్రతినిధి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మరోసారి విమర్శలు గుప్పించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. మంగళవారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రైతు భరోసా నిధులను విడుదల చేయనున్ఈ క్రమంలో ప్రభుత్వంపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా కెటిఆర్ విరుచుకు పడ్డారు. 30 నెలల పాలలో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధులను ఎగ్గొటారని, పైగా సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఏకంగా నాలుగు సార్లు రైతు భరోసా నిధులను ఎగ్గొట్టారని ఆరోపించారు. 30 నెలల ముదనష్టపు పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా? గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా? కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే.. నీ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా



ఎగ్గొట్టిన మీ ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం మీ అవివేకమే. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీ చేసి, చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలి. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న మీ పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయం. ఇప్పటికే రూ.50 వేల కోట్లతో చేయాల్సిన రెండులక్షల రుణమాఫీని, చారాణా కూడా చేయకుండా

మిగతా 2లో

## సర్పంచ్ పదవికే రాజీనామా చేయాలంటేనే ఎవరైనా ఆలోచిస్తారు

# మళ్లీ కనిపిస్తరా..?

నాకు ఏ ఆఫర్లు వద్దు.. తెలంగాణ ముద్దు అని

రాజీనామా చేసిన నాయకుడు లక్ష్మారెడ్డి : హరీశ్ రావు



**జడ్చర్ల, జూన్ 30 (ఎఎంఎస్) :** కేసీఆర్‌కు, మా అందరికి ఇష్టమైన నాయకుడు డా.సి.లక్ష్మారెడ్డి అని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. జడ్చర్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ తొలినాళ్లలో ఆయన బీఆర్ఎస్‌లో చేరిండు. నేను లక్ష్మారెడ్డి చాలా దగ్గరగా పనిచేసినమన్నారు. మా అందరికీ ఇష్టమైన నాయకుడు అని ఎందుకున్నానంటే.. ఈ రోజుల్లో సర్పంచ్ పదవికే రాజీనామా చేయాలంటేనే ఎవరైనా ఆలోచిస్తారు..మళ్లీ కనిపిస్తరా..? లేకపోత ఎంపీటీసీ పదవికి రాజీనామా చేయి అంటే తెల్లవారే సరికే పార్టీ మారుతడు. రేవంత్ లాంటోడు రాజీనామా చేయమంటే జిరాక్స్ కాగితం ఇస్తడు. తెలంగాణ కోసం రాజీనామా చేయమంటే జిరాక్స్ కాగితం ఇచ్చిండు రేవంత్ రెడ్డి. కానీ ఇక్కడ ఉద్యమం బలంగా లేదు. మహబూబ్‌నగర్ జిల్లాలో గెలిచిన ఒకే ఒక్క ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అని హరీశ్ రావు అన్నారు. మేం అసెంబ్లీలో కూర్చున్నం. మా దగ్గరైతే కొంచెం కష్టమేనే.. మీ ఉత్తర తెలంగాణలో వచ్చినంత ఊపు అప్పుడింకా మహబూబ్ నగర్‌లో రాలేదు. నేను గెలుస్తనో.. గెలువనో నాకు డౌటే ఉన్నది కానీ మన నాయకుడు కేసీఆర్ చెప్పిండు నిజాయితీగా రాజీనామా చేస్తా అన్నరు. అప్పుడు నాకు తెలుసు 26 మంది

మిగతా 2లో

## ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా

# తెలంగాణ

హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్తుకు దిశానిర్దేశం

గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానం

వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పనులు త్వరలో ప్రారంభం

కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో గ్రీన్ సిగ్నల్

'మేడ్ ఇన్ తెలంగాణ' ఇప్పుడు ప్రపంచ అత్యాధునిక యుద్ధ

విమానాల్లో ఎగురుతోంది : మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 30 (వుదయం ప్రతినిధి)** ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన ఏరో మార్ట్ హైదరాబాద్-2026 అంతర్జాతీయ ఏరోస్పేస్, డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ, "ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. పెట్టుబడులు,

మిగతా 2లో

## తెలంగాణను ఇబ్బంది పెట్టాలన్నదే కేంద్రం ఆలోచన

ఎరువుల తయారీ, సరఫరా

కేంద్రం పరిధిలోని అంశం

ఎరువుల సరఫరా భారతీయ

జనతా పార్టీ బాధ్యత

తెలంగాణలో ఉన్న ఎరువుల

ఫర్టిలైజర్ ఫ్యాక్టరీని తెలంగాణ రాష్ట్రానికి

అప్పగించాలి : పొన్నం ప్రభాకర్



**సిద్దిపేట, జూన్ 30:** జిల్లాలోని హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 17, 18 వార్డుల్లో కొనసాగుతున్న సర్ ఓటర్ సవరణ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎరువుల తయారీ, సరఫరా కేంద్రం పరిధిలోని అంశమన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఎరువులు తయారు చేసుకోరని తెలిపారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం లేదు కాబట్టి ఉద్దేశపూర్వకంగా సరఫరాలను తగ్గించి ఇబ్బందులు సృష్టిస్తోందని ఆరోపించారు. ఎరువుల సరఫరా భారతీయ జనతా పార్టీ బాధ్యత అని చెప్పుకొచ్చారు. ద్ర ప్రభుత్వం తయారు చేసే ఎరువులతో పాటుగా తెలంగాణలో ఉన్న ఎరువుల ఫర్టిలైజర్ ఫ్యాక్టరీని తెలంగాణ రాష్ట్రానికి అప్పగించాలని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎరువుల కొరత ఏర్పడితే భారతీయ జనతా పార్టీ నాయకుల ఇళ్ల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఎరువుల కొరత విషయంలో రాష్ట్ర బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు జాగ్రత్తగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



## అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా చొరబాట్లు?

ఎలాంటి వాస్తవం లేదు : తోసిపుచ్చిన భారత సైన్యం

**ఈటానగర్, జూన్ 30 :** చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం అవుతున్నాయి. వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది.

మిగతా 2లో

## విద్యార్థుల ఫీజువసూళ్లపై హైకోర్టు స్టే కొనసాగింపు



**హైదరాబాద్, జూన్ 30 (ఎఎంఎస్) :** ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే జులై 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో గత విచారణ సందర్భంగా జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అప్పటివరకు

మిగతా 2లో

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు

**హైదరాబాద్, జూన్ 30 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు, ఐఏఎస్ మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

మిగతా 2లో



# కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల రాజకీయాన్ని నడుపుతోంది

మొదటి పేజీ తరువాయి



వీధుల్లోకి వచ్చి పోరాడేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపిచ్చారు. తెలంగాణలో మార్పు తీసుకురావాలంటే, తెలంగాణ ప్రజల గొంతుకగా నిలవాలంటే వారి సమస్యలతో మమేకం కావాలని, ప్రజల సమస్యలపై పూర్తి శక్తితో ఉద్యమించాలని ఆయన సూచించారు. పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై ఐక్యంగా, అంకితభావంతో పోరాటం చేస్తే 2028లో తెలంగాణలో విజయం బిజెపిదే కాగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలనే మన ఎన్నికల అజెండాగా చేసుకోమని, గత 12 సంవత్సరాల్లో మా ప్రభుత్వం దేశంలో తీసుకొచ్చిన అభివృద్ధి, మార్పు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలనే ప్రజల ముందుకు తీసుకెళ్లాని పేర్కొంటూ మన పనితీరే మన అజెండా అని తెలిపారు. దేశంలో ఏయే రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయో అక్కడ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేకపోయిందని విమర్శించారు. ఈ ప్రజావ్యతిరేక, నిద్రాణ ప్రభుత్వాన్ని ప్రజల ఆశీర్వాదంతో గద్దెదించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇచ్చారా? మహిళలకు ప్రకటించిన ఆర్థిక సహాయం అందించారా? అని ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద సమాధానం ఉండదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు ప్రజల సమస్యలను పట్టించుకోవడం కన్నా ఢిల్లీ దర్బార్‌ను సంతోషపెట్టడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. తెలంగాణను ఏటీఎంలా ఉపయోగించి ఢిల్లీలో తమ రాజకీయాలను నడిపిస్తున్నారని ఆయన ఆరోపించారు. నిజంగా తెలంగాణ ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే, ఇచ్చిన హామీలన్నీ ఇప్పటికే ప్రజలకు చేరేవని చెప్పారు. "నేడు గ్యారంటీల పోస్టర్లు మాత్రం కనిపిస్తున్నాయి. కానీ ఆ గ్యారంటీల ప్రయోజనాలు మాత్రం ప్రజలకు అందలేదు. ఈ వాస్తవాన్ని ప్రతి ఇంటికీ, ప్రతి ప్రజానీకానికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని తెలిపారు. తెలంగాణ ప్రజల శ్రమతో సంపాదించిన ఒక్క రూపాయి కూడా అక్రమ వసూళ్లకు బలికాకూడదని చెబుతూ ప్రజలను దోచుకునే ఇటువంటి ప్రభుత్వాన్ని ప్రజల ఆశీర్వాదంతో గద్దె దించేందుకు బిజెపి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తోందని పేర్కొంటూ అవినీతి అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే అవినీతి అనే స్థాయికి ఆ పార్టీ చేరుకుందని ధ్వజమెత్తారు. నేడు రాజకీయాల నేరీకరణకు కూడా కాంగ్రెస్ పార్టీ ప్రతీకగా మారుతోందని చెబుతూ దేశ వ్యతిరేక శక్తులకు, దేశాన్ని విభజించే ఆలోచనలకు మద్దతు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ తన నిజ స్వరూపాన్ని మరోసారి బయటపెడుతోందని మండిపడ్డారు. అందుకే అవినీతి, రాజకీయాల నేరీకరణ అనే రెండు మచ్చలతో కాంగ్రెస్ గుర్తింపు పొందుతోందని చెప్పారు. ఇటీవల మూసీ రివర్‌ఫ్రంట్ పేరుతో చేపట్టిన ప్రాజెక్టులో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తన పాత అవినీతి సంప్రదాయాన్నే కొనసాగిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. ప్రజా ధనాన్ని దోచుకునే మరో అవకాశంగా దానిని మలుస్తున్న పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. తెలంగాణ ప్రజల కష్టార్జిత ధనాన్ని ప్రజల సంక్షేమానికి కాకుండా ఇతర రాజకీయ అవసరాలకు వినియోగిస్తే బిజెపి కార్యకర్తలు ప్రతి రూపాయికి లెక్క అడుగుతారని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు కూడా ఆ జవాబుదారీతనాన్ని తప్పకుండా కోరుతారని స్పష్టం చేశారు. తెలంగాణలో మజ్లిస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ కుమ్మక్కు కొనసాగుతోందని ప్రజలు గమనిస్తున్నారని ఆయన తెలిపారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించే ఏ ప్రయత్నాన్నైనా బిజెపి పూర్తిగా వ్యతిరేకిస్తుందని తేల్చి చెప్పారు. భవిష్యత్తులో తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పడితే మత ప్రాతిపదికన ఇచ్చే రిజర్వేషన్లను రద్దు చేసి, ఆ ప్రయోజనాలను ఎస్సీ, బీసీ, ఎస్టీ వర్గాలకు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. సమాజంలో ఇంకా అభివృద్ధి ఫలాలు పూర్తిగా అందని వర్గాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడమే బిజెపి లక్ష్యం అని ప్రకటించారు. తెలంగాణలో హిందూ దేవాలయాలు, దేవతల పట్ల అవమానకర ఘటనలు చోటుచేసుకున్నాయని నితిన్ నబిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయ్యప్ప స్వామి ఆలయంపై జరిగిన దాడి వంటి ఘటనలను తీవ్రంగా ఖండిస్తూ అలాంటి ఘటనలకు బాధ్యులైన వారిని ప్రజాస్వామ్యబద్ధంగా నిలదీస్తామని స్పష్టంచేశారు. రానున్న రోజుల్లో ప్రజల ఆకాంక్షలను మరింత బలంగా ముందుకు తీసుకెళ్తూ తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా భారతీయ జనతా పార్టీ ఎదుగుతుందని భరోసా వ్యక్తం చేశారు. కుటుంబ పాలన, అవినీతి, హామీల అమలులో వైఫల్యం వంటి రాజకీయాలకు ముగింపు పలకాలంటే మనమంతా మరింత శక్తివంతంగా పోరాటానికి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల రాజకీయాల్లో ఉమ్మడి లక్షణాలు మూడు—అవినీతి, కుటుంబ పాలన, హామీల అమలులో వైఫల్యం అని విమర్శించారు. అదే సమయంలో వారి రాజకీయాలు బుజ్జగింపు రాజకీయాలపై ఆధారపడితే బిజెపి రాజకీయాలు ప్రతి పౌరుడిని సంతృప్తిపరిచే సమగ్ర అభివృద్ధిపై ఆధారపడి ఉంటాయని తెలిపారు.

## రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధులను ఎగ్గొట్టారు

మొదటి పేజీ తరువాయి

అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశావు. 72 సార్లు నీ ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకో. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారు. కేసీఆర్ టంచన్‌గా 11 సార్లు, రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిచి ఉంటే.. మీరు ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని గుర్తుపెట్టుకోండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు

మొదటి పేజీ తరువాయి

ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించిన కే. రామకృష్ణా రావు, ఐఏఎస్ ఈ రోజు పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం జూన్ 26న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు సంజయ్ జాజు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధిపతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది సంజయ్ జాజుతో పాటు కే. రామకృష్ణా రావును పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

## ఫీజువసూళ్లపై హైకోర్టు స్టే కొనసాగింపు

మొదటి పేజీ తరువాయి

కొనసాగుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. గత విచారణలో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని పేర్కొంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్-9లోని నాలుగు నిబంధనల అమలుపై తాత్కాలికంగా స్టే విధించింది. హైకోర్టు జారీ చేసిన ఈ మధ్యంతర ఉత్తర్వులు జులై 6వ తేదీ జరిగే తదుపరి విచారణ వరకు అమల్లో ఉంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో సంబంధిత విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న అనిశ్చితికి తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి సంబంధించిన వివిధ అంశాలపై పిటిషనర్లు కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలోని కొన్ని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. జులై 6వ తేదీ జరగనున్న తదుపరి విచారణలో ప్రభుత్వం, పిటిషనర్ల వాదనలను పరిశీలించనుంది. అనంతరం హైకోర్టు మరిన్ని ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. ఈ కేసు తీర్పు రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు, విద్యాసంస్థలపై ప్రభావం చూపే అవకాశముండటంతో ఆసక్తి నెలకొంది.

## అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా చొరబాట్లు?

మొదటి పేజీ తరువాయి

''అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారం'' అని వెల్లడించింది. అరుణాచల్ ప్రదేశ్ లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి పత్రాన్ని సమర్పించింది. భారత్-చైనా సరిహద్దు సమీపంలో పీఎల్ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10-15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం స్థానికులు ఉపయోగించే ప్రదేశాల్లో రోడ్లు, వంతెనలు, సైనిక శిబిరాలను నిర్మించారని ఆరోపించింది. ఆ ప్రాంతాల పేర్లను ప్రస్తావించింది. భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి.

## తెలంగాణ పోలీస్ అకాడమీలో పదవీ విరమణ

**హైదరాబాద్, జూన్ 30 (వుదయం ప్రతినిధి) :** ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఈ రోజు పదవీ విరమణ పొందిన ఇద్దరు ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ లో సబ్ ఇన్‌స్పెక్టర్ (డ్రైవర్)గా సేవలందించిన జి. బాలరాజు, అకాడమీ రీప్రోగ్రఫీ (ప్రింటింగ్ ప్రెస్) విభాగంలో ఆఫ్సెట్ మెషీన్ ఆపరేటర్‌గా సేవలందించిన టి. ఎల్లయ్యలకు అకాడమీ ఘనంగా సన్మానం చేసింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ, జి. బాలరాజు సుమారు 43 సంవత్సరాలపాటు పోలీస్ శాఖలో అత్యంత నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వహించారని కొనియాడారు. సబ్ ఇన్‌స్పెక్టర్ (డ్రైవర్)గా ఉన్నతాధికారులను ప్రతిరోజూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆయన చూపిన బాధ్యతాయుత సేవలు ఆదర్శప్రాయమని ప్రశంసించారు. అలాగే టి. ఎల్లయ్య రీప్రోగ్రఫీ విభాగంలో సుమారు 33 సంవత్సరాలపాటు అత్యంత క్రమశిక్షణతో సేవలందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అకాడమీ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో డైరెక్టర్ అభిలాష్ బిస్త్, ఐపీఎస్‌తో పాటు ఉన్నతాధికారులు జి. బాలరాజు, టి. ఎల్లయ్యలను శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు మరియు కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, కె.ఆర్.కె. ప్రసాద్, శ్రీరామమూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ వేముల శ్రీనివాసరావు, డీఎస్పీలు జ్ఞానేశ్వర్ రెడ్డి, రామారావు, తోట శ్రీనివాసులు ఇండోర్, ఔట్‌డోర్ ఫ్యాకల్టీ సభ్యులు, అకాడమీ సిబ్బంది, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





ఈఎన్టీ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఆనందాచార్య పదవీ విరమణ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ బెంజ్ మెన్, రాజేందర్ కుమార్, రవి శంకర్ ప్రజాపతి, ఆసుపత్రి అధ్యక్షులు తూముకుంట రాజు, ఉపాధ్యక్షులు శ్రీహరి, కోశాధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

## భూ యాజమాన్య హక్కులు ఆలయాలవే

మొదటి పేజీ తరువాయి

కుల సంఘాలకు స్థలాల కేటాయింపులపై కూడా నిర్దిష్ట నిబంధనలతో కూడిన ఒక పాలసీని సిద్ధం చేయాలని చెప్పారు. భూ కేటాయింపుల ప్రక్రియలో దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలలో అనుసరిస్తున్న నిబంధనలు, విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. యాదగిరిగుట్టపై భక్తుల వసతి కోసం నిర్మించతలపెట్టిన అతిథిగృహాల నిర్మాణంలోనూ తిరుమల మోడల్‌నే అనుసరించాలని పేర్కొన్నారు. కొండపై కాటేజీలు, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి చూపే దాతలు, సంస్థల వివరాలతో కూడిన జాబితాను తక్షణమే రూపొందించాలని, వీరికి విడతలవారీగా నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో ఒక ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణ పనులు, నాణ్యతపై గతంలో నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, దానిపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను తనకు అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు డెడ్‌లైన్ విధించారు.

## రైతు భరోసా నిధులు విడుదల

మొదటి పేజీ తరువాయి

అప్పుల ఊబిలోకి నెట్టారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కల్వకుంట్ల కుటుంబం చేసిన అప్పులు, తప్పుల భారం ఇప్పుడు తమ ప్రభుత్వం భరిస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. 'బకాయిలు పెట్టింది బకాసురుడు... కట్టే పాపం మాకా?' అంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో జీతాలు చెల్లించే పరిస్థితి నెలకొందని, ధనిక రాష్ట్రాన్ని ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకెళ్లారని విమర్శించారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు తెలంగాణ పరువు తీశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రజాపాలనలో ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రైతు భరోసా పథకం కింద రూ.36 వేల కోట్లు రైతులకు అందించినట్లు సీఎం వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ నిలిపివేస్తారనే దుష్ప్రచారం చేశారని, కానీ 2004లో రైతులకు ఉచిత విద్యుత్‌ను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. రైతుల కోసం ప్రతి నెల సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు, రైతు బీమా కోసం రూ.4 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం రూ.80 వేల కోట్లు వ్యయం చేసినట్లు సీఎం రేవంత్ వివరించారు.

## మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలి



**హైదరాబాద్, జూన్ 30 (వుదయం ప్రతినిధి) :** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తన కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ సమకూర్చిన రెండు అంబులెన్స్‌లకు ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఎంఆర్ఐ స్కానర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల నుంచి రుణాల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయని పేర్కొంటూ మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలతో లాజిస్టిక్ పార్కులు, గోడౌన్లు, రైస్ మిల్లులు ఏర్పాటు చేస్తున్నామని, అందుకోసం పెద్ద ఎత్తున రుణాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సర్పంచ్ పదవికే రాజీనామా చేయాలంటేనే ఎవరైనా ఆలోచిస్తారు.. మళ్లీ కనిపిస్తరా..?

మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యేల్లో 10 మంది ఆఫర్లు ఇస్తే అమ్ముడుపోయిర్రు. ఇదే లక్ష్మారెడ్డన్నకు కూడా చాలా ఆఫర్లు వచ్చినయ్. కానీ నాకు ఏ ఆఫర్లు వద్దు. తెలంగాణ ముద్దు అని చెప్పి రాజీనామా చేసిన నాయకుడు మీ లక్ష్మారెడ్డి. పాపం దాని ఎఫెక్ట్ ఏందో తెలుసా..?2009లో మనం పొత్తు పెట్టుకున్నం. రాజకీయ ప్రక్రియలో అన్నీ పార్టీలను ఒప్పించి మెప్పించి తెలంగాణ తేవాలనేది కేసీఆర్ ఆలోచన. అప్పుడు తెలుగు దేశంతోనే జై తెలంగాణ అనిపించి.. వాళ్ల మెడలో కూడా గులాబీ కండువా వేయించి మనం టీడీపీతో పొత్తు పెట్టుకున్నం. ఆ పొత్తుల్లో పాపం లక్ష్మారెడ్డికి టికెట్ రాలే. ఇంకొకరైతే వేరే పార్టీలోకి వెళ్లి టికెట్ తెచ్చుకుంటడు. టికెట్ రాకపోయినా నాకు తెలంగాణ ముఖ్యం.. కేసీఆర్ ముఖ్యం అని చెప్పి పార్టీలో ఎంపీగా కేసీఆర్ గెలుపు కోసం కృషి చేసిన వ్యక్తి, నిజాయితీ కలిగిన ఉద్యమకారుడు, ఒక నాయకుడు మీ డాక్టర్ లక్ష్మారెడ్డి.. అందుకే ఆయనంటే మాకందరికీ ఎంతో ఇష్టమని చెప్పుకొచ్చారు హరీశ్ రావు.

## ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణే కొత్త చిరునామా" అని స్పష్టం చేశారు. భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత, ఖచ్చితత్వం ఎంత కీలకమో తనకు ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు."ఒక్క చిన్న విడిభాగం లోపం కూడా మిషన్ విజయాన్ని ప్రభావితం చేస్తుంది. అలాంటి అత్యున్నత ప్రమాణాలను తెలంగాణ పరిశ్రమలు నేడు విజయవంతంగా అందిస్తున్నాయి" అని చెప్పారు. అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్-16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్ఓ వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని మంత్రి తెలిపారు. "'మేడ్ ఇన్ తెలంగాణ' అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోంది" అని పేర్కొన్నారు. స్పెయిన్‌కు చెందిన ఐటిపి ఎఈఆర్వో, కెనడాకు చెందిన ఎఫ్ టిజి ఎయిరోస్పేస్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు. డీఆర్‌డీఓ, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించిందన్నారు.

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుతున్న ఐటీఐలు ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం గత కొన్నేళ్లుగా దాదాపు 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, గత ఏడాది ఎగుమతులు 103 శాతం పెరిగి, రాష్ట్రానికి ఎన్నో దశాబ్దాలుగా అగ్రగామిగా ఉన్న ఔషధ రంగాన్నే అధిగమించడం తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో ఒక స్వర్ణ అధ్యాయమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగ విస్తరణకు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని మంత్రి వెల్లడించారు. వరంగల్ విమానాశ్రయానికి వచ్చే నెలలో శంకుస్థాపన, ఆదిలాబాద్‌లో పౌర-సైనిక అవసరాలకు అనువైన ఎయిర్‌ఫీల్డ్, కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో కేంద్ర ఆమోదం లభించనున్నాయని తెలిపారు. ఈ మూడు కేంద్రాలు భవిష్యత్తులో విమాన మరమ్మత్తు, విమాన తయారీ, రక్షణ పరిశ్రమలకు భారీ అవకాశాలను తెరవనున్నాయని చెప్పారు. ప్రపంచ ఏరోస్పేస్ దిగ్గజాలను ఉద్దేశించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "మీ తదుపరి తయారీ కేంద్రం తెలంగాణ కావాలి. మీ తదుపరి పెట్టుబడి హైదరాబాద్‌లో ఉండాలి. తెలంగాణ ప్రభుత్వం మీకు అనుమతులు ఇచ్చే ప్రభుత్వం మాత్రమే కాదు... మీ విజయానికి భాగస్వామిగా నిలిచే ప్రభుత్వం" అని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల నుంచి అధికార యంత్రాంగం వరకు పెట్టుబడిదారులకు 24 గంటలూ అందుబాటులో ఉంటామని, పరిశ్రమల స్థాపన, విస్తరణలో ప్రతి అడుగులోనూ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు."ఏరోమార్ట్ హైదరాబాద్-2026 కేవలం ఒక పారిశ్రామిక సదస్సు కాదు... ప్రపంచ ఏరోస్పేస్ పటంలో తెలంగాణ శాశ్వత స్థానాన్ని ఖరారు చేసే చారిత్రక వేదిక" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## సిబ్బంది సంక్షేమం, శిక్షణ, పారదర్శక పరిపాలనకు ప్రాధాన్యం

**డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, మానసిక ఒత్తిడి వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**షల్ బెటాలియన్ల ప్రధాన కార్యాలయంలో డీజీపీ సి.వి. ఆనంద్ సమీక్ష సమావేశం**



**హైదరాబాద్, జూన్ 30 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల నిర్వహణ, విపత్తు నిర్వహణ, వీఐపీ బందోబస్తు, ప్రత్యేక ఆపరేషన్లలో కీలక భూమిక పోషిస్తున్న తెలంగాణ స్పెషల్ బెటాలియన్లను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరింత ఆధునికంగా, సాంకేతికంగా బలోపేతం చేయాలని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ అధికారులకు సూచించారు. జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ స్పెషల్ బెటాలియన్ల ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని వివిధ పరిపాలనా, సాంకేతిక, సంక్షేమ అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశానికి ముందు డీజీపీ ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాలు, పరిపాలనా సెక్షన్లు, కమ్యూనికేషన్ వ్యవస్థ, ఆయుధాల నిర్వహణ, సాంకేతిక విభాగాలు, నిర్మాణ పనులు, కార్యాలయ నిర్వహణ, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం అధికారులు సమర్పించిన ప్రజెంటేషన్‌ను పరిశీలించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. బెటాలియన్లలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరితగతిన భర్తీ చేయడం, అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం, వాహనాల సంఖ్యను పెంచడం, సిబ్బందికి మెరుగైన నివాస క్వార్టర్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ బెటాలియన్లు నక్సల్స్ ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో సివిల్ పోలీసులకు వెన్నుదన్నుగా నిలిచి ఎన్నో కీలక ఆపరేషన్లలో విశేష సేవలు అందించాయని గుర్తు చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి పోలీస్ స్టేషన్‌కు ప్రత్యేక బలగాలను అనుసంధానం చేయడం ద్వారా పోలీసు వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసిందన్నారు. తాను నిజామాబాద్, వరంగల్ వంటి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో జిల్లాల ఎస్పీగా పనిచేసిన సమయంలో ప్రత్యేక బలగాల సేవలను ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. ఆ సమయంలో పోలీస్ స్టేషన్లపై తరచూ నక్సల్స్ దాడులు జరిగేవని, అలాంటి పరిస్థితుల్లో స్పెషల్ పోలీస్ బెటాలియన్లు అత్యంత ధైర్యసాహసాలతో విధులు నిర్వహించి నక్సల్స్ నిర్మూలనలో కీలక పాత్ర పోషించాయని ప్రశంసించారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ ప్రభుత్వం 13 స్పెషల్ బెటాలియన్లను ఏర్పాటు చేసి రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వాటిని అభివృద్ధి చేసిందని తెలిపారు. ప్రస్తుతం ఈ బెటాలియన్లు ఎన్నికల సమయంలో భారీ బందోబస్తు, శాంతిభద్రతల నిర్వహణ, ముఖ్యమైన ఉత్సవాలు, మతపరమైన వేడుకలు, ప్రజాసమావేశాలు, వీఐపీ భద్రత, విపత్తు నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల రక్షణలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నాయని కొనియాడారు. ఇటీవల నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కురిసిన భారీ వర్షాల సమయంలో తెలంగాణ స్పెషల్ బెటాలియన్ సిబ్బంది వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యల్లో పాల్గొనడం, ప్రాణాలు, ఆస్తులను కాపాడడంలో అంకితభావంతో పనిచేశారని అభినందించారు. బెటాలియన్ల కమాండెంట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, పరిపాలనలో క్రమశిక్షణతో పాటు మానవతా దృక్పథం కూడా ఉండాలని సూచించారు. సిబ్బంది కుటుంబ పరిస్థితులు, ఆరోగ్యం, పిల్లల విద్య, వ్యక్తిగత సమస్యలను తెలుసుకుంటూ వారికి అండగా నిలవాలని చెప్పారు. దూర ప్రాంతాల్లో నెలల తరబడి విధులు నిర్వహించే సిబ్బందికి కుటుంబ సభ్యుల నుంచి దూరంగా ఉండటం వల్ల మానసిక ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో అధికారులు వారికి అవసరమైన మానసిక బలం అందించాలని సూచించారు.

## టీపీఎస్‌లకు టాప్ గేర్!

**మూడు నెలల్లో మూడు పబ్లిక్ స్కూళ్లు టార్గెట్**

**తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌పై సర్కార్ ఫోకస్**

**ఆరుట్ల టీపీఎస్‌తో సర్కార్ జోష్**

**టీపీఎస్‌ల కోసం రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్**

**హైదరాబాద్, జూన్ 30 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణలో ప్రభుత్వ విద్యను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (టీపీఎస్) ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా ఈ నెల 17న ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి మంచి మైలేజీ వచ్చింది. దీంతో రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో కూడా ఇలాంటి పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు, ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీంతో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. వీటిలో ఆరుట్ల టీపీఎస్ మినహా మంచాల, వంగూరు, పోల్కంపల్లి టీపీఎస్‌లపై ఫోకస్ చేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన పాఠశాలల నిర్మాణ పనులను వచ్చే మూడు నెలల్లో పూర్తి చేయాలని విద్యా కమిషన్‌కు సూచించారు. దీంతో తెలంగాణ విద్యా కమిషన్ మూడు నెలల టైమ్‌బౌండ్ ప్రణాళికతో యుద్ధ ప్రాతిపదికన పనులను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా వంగూరు, పోల్కంపల్లి, మంచాల టీపీఎస్‌లలో ఆధునిక తరగతి గదులు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు, పరిశుభ్రమైన క్యాంపస్ వాతావరణం వంటి అన్ని మౌలిక సదుపాయాలతో ఈ పాఠశాలలను తీర్చిదిద్దే దిశగా అధికారులు వేగంగా పని చేస్తున్నారు.

**విద్యా కమిషన్ ప్రత్యక్ష పర్యవేక్షణ..**

తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ప్రత్యేక పర్యవేక్షణలో ఇప్పటికే ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ పూర్తైన సంగతి తెలిసిందే. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో పైలెట్ ప్రాజెక్టులోని మిగిలిన మూడు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రాజెక్టుల పనుల్లో విద్యా కమిషన్ వేగం పెంచింది. వంగూరు, మంచాల, పోల్కంపల్లి టీపీఎస్‌లలో నిర్మాణ పనులు, నాణ్యత, టైమ్‌లైన్ అమలును నిరంతరం పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా ముగ్గురు కమిషన్ సభ్యులు పూర్తి పర్యవేక్షణ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. వంగూరు టీపీఎస్ పర్యవేక్షణ బాధ్యతలను డాక్టర్ చారకొండ వెంకటేష్, మంచాల టీపీఎస్ పనులను జోష్నా శివారెడ్డి, పోల్కంపల్లి టీపీఎస్ నిర్మాణాలను ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు నేరుగా పర్యవేక్షిస్తున్నారు.

**ఎస్ఎంసీ సభ్యులకు ప్రత్యేక బాధ్యతలు..** మూడు నెలల్లో ఈ మూడు పాఠశాలలను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్న నేపథ్యంలో విద్యా కమిషన్ ఆయా ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తయ్యేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. దీని కోసం అక్కడ సాగుతున్న నిర్మాణ పనులను విభజించి, స్కూల్ ప్రిన్సిపల్ నేతృత్వంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) సభ్యులకు పనుల విభజన చేస్తోంది. ప్రతి పనికి ముగ్గురు చొప్పున ఎస్ఎంసీ సభ్యులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిర్మాణాల పురోగతి, నాణ్యత, అవసరమైన సదుపాయాల కల్పనను ఎప్పటికప్పుడు సమీక్షించేలా నిర్ణయం తీసుకుంది. ప్రతి బుధవారం, శనివారం ఎస్ఎంసీ సభ్యులు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ పనుల పురోగతిని విశ్లేషిస్తున్నారు. ఎక్కడా జాప్యం లేకుండా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రతి నిర్మాణ దశకు ప్రత్యేక లక్ష్యాలను నిర్దేశించి ఎస్ఎంసీ సభ్యులను మానిటరింగ్ చేస్తోంది విద్యా కమిషన్. ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను విస్తరించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యా వాతావరణం కల్పించడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఇప్పటికే ఆరుట్ల టీపీఎస్‌కు లభిస్తున్న ఆదరణ, ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న డిమాండ్లు, ముఖ్యమంత్రి విధించిన మూడు నెలల గడువు—ఈ మూడు అంశాలు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రాజెక్టుకు మరింత వేగాన్ని తీసుకొస్తున్నాయి. ఈ మూడు పైలెట్ ప్రాజెక్టులు అనుకున్న సమయానికి పూర్తైతే రాష్ట్రంలో ప్రభుత్వ విద్య నాణ్యత పెంపునకు ఈ ప్రాజెక్టు కీలక మలుపు కానుంది.

# విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ఎన్ఎస్‌యూఐ ముందుంటుంది: ఎండీ సమీరుద్దీన్



చేవెళ్ల, జూన్ 30(వుదయం)

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎన్ఎస్‌యూఐ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఎన్ఎస్‌యూఐ చేవెళ్ల మండల కమిటీ సభ్యుడు ఎండీ సమీరుద్దీన్ అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని బీజేఆర్ పారామెడికల్ కళాశాలలో విద్యార్థులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) భారత జాతీయ కాంగ్రెస్ విద్యార్థి విభాగంగా 1971 ఏప్రిల్ 9న స్థాపించబడిందని తెలిపారు.ప్రగతిశీల ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, అందరికీ నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఎన్ఎస్‌యూఐ దేశవ్యాప్తంగా దాదాపు 55 సంవత్సరాలుగా విద్యార్థుల హక్కుల కోసం పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా సమస్యల పరిష్కారానికి ఎన్ఎస్‌యూఐ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ చేవెళ్ల మండల కమిటీ సభ్యులు ఎండీ ఇర్ఫాన్, జావీద్, అజర్, సాయి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టపడి చదివి ఉన్నతు లవ్వాలి!

- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: సాత ప్రవీణ్ కుమార్
- ప్రభుత్వ పాఠశాలల్లో చేరితేనే నాణ్యమైన విద్య: చైర్‌పర్సన్
- అయ్యప్పరెడ్డిగూడెం పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్కుల పంపిణీ



శంకర్‌పల్లి, జూన్ 30 (వుదయం)

విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత ప్రవీణ్ కుమార్ అన్నారు.మంగళవారం మున్సిపల్ పరిధిలోని అయ్యప్పరెడ్డిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమై వారి విద్యాభ్యాసంపై పలు సూచనలు చేశారు.చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, ఉదయం అల్పాహారం, ఉచిత ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు వంటి అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రభుత్వ విద్యను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోందని తెలిపారు.ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన సౌకర్యాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, నాణ్యమైన బోధన అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు జూలకంటి పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.విద్యార్థులకు నోటుబుక్కులు అందజేసి వారి విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు.

# సాహెబ్‌నగర్‌లో సైన్స్ ల్యాబ్స్ ప్రారంభం!



రంగారెడ్డి జిల్లా

తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డా. ఈ. నవీన్ నికోలస్, ఐఏఎస్., నేడు రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్‌పీహెచ్ఎస్), సాహెబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఆదర్శ ప్రయోగశాలల సముదాయాన్ని ప్రారంభించారు. ఇందులో భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, అపారెల్ (దుస్తుల తయారీ) ల్యాబ్, ఫుడ్ అండ్ బెవరేజెస్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనుభవాత్మక, నైపుణ్యాధారిత విద్యను మరింత బలోపేతం చేశారు. ఈ ఆదర్శ ప్రయోగశాలల సముదాయాన్ని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం ఆధ్వర్యంలో డైరెక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో అభివృద్ధి చేశారు. భౌతిక శాస్త్ర ప్రయోగశాలను నార్డ్ అభయ (NORD Abhaya) సంస్థ భాగస్వామ్యంతో ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవం అనంతరం డైరెక్టర్ ప్రయోగశాలలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వారు నిర్వహిస్తున్న ప్రయోగాలను పరిశీలించి వారి ఆసక్తి, ప్రతిభను అభినందించారు. ఈ పనులను ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) శ్రీ ఎస్. ప్రదీప్ కుమార్ పర్యవేక్షణలో నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా పనుల నాణ్యతను ప్రత్యేకంగా అభినందించిన డైరెక్టర్, రాష్ట్రంలోని ఇతర పాఠశాలలకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం పనితీరును ప్రశంసించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యా వాతావరణం అత్యుత్తమంగా ఉన్నాయని అన్నారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రయోగశాలలు, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు కలిసివస్తే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, నైపుణ్యాధారిత అభ్యాసం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక మౌలిక వసతుల కల్పనతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ నిరంతరం కృషి చేస్తుందని డైరెక్టర్ పునరుద్ఘాటించారు.

# ఉపాధ్యాయ వృత్తికి గౌరవప్రదంగా వీడ్కోలు.. సుకన్య టీచర్‌కు ఘన సన్మానం

- ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమే: మాజీ సర్పంచ్ బి. సోల్ల శ్రీధర్
- విద్యార్థులకు ఆదర్శ బోధన అందించిన సుకన్య సేవలు చిరస్మరణీయం

శంకర్‌పల్లి, జూన్ 30 (వుదయం)



మున్సిపల్ పరిధిలోని గణేష్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా సుదీర్ఘకాలం సేవలందించిన సుకన్య మంగళవారం పదవీ విరమణ పొందారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రముఖులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు.సేవా కాలంలో ఆమె అందించిన విద్యా సేవలను పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శంకర్‌పల్లి మాజీ సర్పంచ్ బి. సోల్ల శ్రీధర్ మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ అనేది తప్పనిసరి ఘట్టమని అన్నారు.ఉద్యోగ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించి మంచి పేరు సంపాదించుకోవడమే నిజమైన విజయం అని పేర్కొన్నారు.సుకన్య తన విధులను అంకితభావంతో నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా మంచి ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందారని ప్రశంసించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బి. సోల్ల శ్రీధర్ సుకన్యను శాలువాతో ఘనంగా సత్కరించి పూలబొకే అందజేసి ఆమె సేవలను అభినందించారు.పాఠశాల ఉపాధ్యాయులు, సహచరులు సుకన్యతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆమె విద్యార్థుల పట్ల చూపిన ప్రేమ, క్రమశిక్షణ, బోధనా విధానాన్ని ప్రశంసించారు.పదవీ విరమణ అనంతరం కూడా ఆమె సమాజానికి తన అనుభవంతో సేవలందించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రాములుతో పాటు ఇతర ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొని సుకన్యకు ఘనంగా వీడ్కోలు పలికారు.ఆమె శేష జీవితాన్ని ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రతను వెంటనే పునరుద్ధరించాలి

వెల్దండ జూన్ 30 (వు దయం)



మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించిన భద్రతను వెంటనే పునరుద్ధరించాలని బీఆర్ఎస్ నాయకులు జంగిలి నిరంజన్, ముక్తాల శేఖర్ ముదిరాజ్ జంగిలి యాదగిరి గార్లు డిమాండ్ చేశారు. మంగళవారం వెల్దండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్ష నాయకుల పట్ల వివక్షతో వ్యవహరిస్తోందని ఆరోపించారు.ప్రజా జీవితంలో చురుకైన పాత్ర పోషిస్తున్న నాయకులకు భద్రత కల్పించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని వారు పేర్కొన్నారు. ఎలాంటి స్పష్టమైన కారణాలు వెల్లడించకుండా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు కల్పించిన భద్రతను తొలగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.రాష్ట్రంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకులను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు గతంలో ఉన్న భద్రతను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జంగిలి ప్రసాద్,అన్వర్,మహేష్ యాదవ్ లు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఆరు డీఏలు ...!

వికారాబాద్

జూన్ 30 (వుదయం బ్యూరో)



ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన కరువుభత్యం(డీఏ) కథ మొదటికొచ్చింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సర్కార్ బాకీపడ్డ పెండింగ్ డీఏల సంఖ్య ఆరుకు చేరనున్నది. ఈ ఏడాది జూలై 1న ఇవ్వాల్సిన డీఏను కలుపుకొంటే మొత్తంగా ఆరు డీఏలు సర్కార్ బాకీ పడింది. ప్రభుత్వం విధిగా ప్రతి ఆరు నెలలకోసారి డీఏ ఇవ్వాలి. కానీ డీఏల విషయంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా చేతులెత్తేసింది. తెలంగాణ, ఏపీ రాష్ట్ర చరిత్రలో ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటం ఇదే తొలిసారి. పైగా ఇన్ని డీఏలు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ పెండింగ్‌లో లేవు. ఆఖరుకు దివాలా.. పేదరికంతో బాధపడుతున్న రాష్ట్రాల్లోనూ ఒకటి రెండుకు మించి డీఏలు పెండింగ్‌లో లేవు. అత్యధిక డీఏల పెండింగ్‌తో తెలంగాణ రికార్డుకెక్కిందని ఉద్యోగ సంఘాల నేతలు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.జూలై 1న ఇవ్వాల్సిన డీఏ ఆ తేదీ రానే వచ్చింది. డీఏ ఇవ్వాలంటే క్యాబినెట్ ఆమోదం తెలుపాలి. ఆ తర్వాత సర్కార్ జీవో జారీచేయాలి. ఇప్పట్లో ఇవేవీ జరిగే పరిస్థితి కనిపించడంలేదు. కనుక పెండింగ్ డీఏల లిస్టు చాంతాడంత అన్నట్టు ఆరుకు చేరిందని సంఘాల నేతలు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. కరువు భత్యం(డీఏ) ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తగ్గించేందుకు ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం చెల్లించే ఉపశమనం. అధిక ధరలు, ధరల సూచీ ప్రకారం ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకూ ఒకటి చొప్పున విధిగా డీఏను విడుదల చేయాలి. కేంద్రం ప్రతి ఆరు నెలలకూ టంచన్‌గా డీఏలు మంజూరుచేస్తున్నది. అనేక రాష్ట్రా లు ఇదే పద్ధతిని అనుసరిస్తున్నాయి.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మూడు డీఏలు మాత్రమే ఇచ్చింది. ఆరు డీఏలు పెండింగ్‌లో పెట్టింది. కాంగ్రెస్ పాలనను చూస్తుంటే ఆరు నెలలకు డీఏ కాకుండా.. ఏడాదికో డీఏ అన్నట్టుగా పరిస్థితి ఉన్నది. ఈ రెండున్నరేండ్లలో మూడు డీఏలను మాత్రమే ఇవ్వడాన్ని బట్టి చూస్తుంటే ఇదే నిజమనిపిస్తున్నది. ఇచ్చిన మూడు డీఏ బకాయిలను సమాన వాయిదాల్లో చెల్లిస్తామని చెప్పింది. 2.5లక్షలకు పైగా సీపీఎస్ ఉద్యోగులకు డీఏ ఏరియర్స్ రూపాయి కూడా చెల్లించలేదు. ఒక్క రెగ్యులర్ ఉద్యోగులకు మాత్రమే అంతో ఇంతో జమవుతున్నాయి.15శాతం పెండింగ్..రాష్ట్ర ప్రభుత్వం బాకీపడ్డ ఆరు పెండింగ్ డీఏల మొత్తం 15శాతం ఉంటుందని ఉద్యోగ సంఘాల నేతలంటున్నారు. ఒకశాతం డీఏ ఇస్తే ఏడాదికి రూ. 400 500కోట్లు అవుతుంది. 15శాతం డీఏ, డీఏ బకాయిలు కలిపితే మొత్తం రూ. 10వేల కోట్లు దాటుతాయని అంటున్నారు. ప్రతి నెలా జీతం ఇస్తున్నామన్న నెపంతో సర్కార్ డీఏలు, పెండింగ్ బిల్లులు, పీఆర్సీ వంటి వాటి నుంచి తప్పించుకోజూస్తున్నదని మండిపడుతున్నారు.

# ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లు అడిగితే అక్రమ అరెస్టుల



- వట్టపల్లి మండల్ ఏబీవీపీ నాయకుడు గోల్కొండ సాయికృష్ణ అరెస్ట్

వట్టిపల్లి

జూన్ 30 (వుదయం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్న విద్యార్థుల పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గత కొంతకాలంగా విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించాలని, పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, ఈరోజు ABVP ఆధ్వర్యంలో ఉన్నత విద్యా మండలి ముందు భారీ ధర్నా చేపడుతుంటే ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ, ప్రభుత్వం వట్టిపల్లి ABVP నాయకులను ముందస్తుగా అరెస్టు చేసింది.
ప్రభుత్వం ఎన్ని అక్రమ అరెస్టులతో అణచివేయాలని చూసినా, విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ABVP పోరాటం ఆపేది లేదు. తక్షణమే పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాము. లేని పక్షంలో రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఘనంగా పోతుల శంకర్ దంపతుల ఆత్మీయ వీడ్కోలు

- సిద్దిపేట మున్సిపాలిటీలో 38 ఏళ్ల విశిష్ట సేవలు కొనియాడదగినవి: అధికారులు

సిద్దిపేట,

జూన్ 29 (వుదయం ప్రతినిధి)



సిద్దిపేట పురపాలక సంఘం కార్యాలయంలో సుదీర్ఘ కాలంగా సేవలందించిన ప్రజారోగ్య కార్యకర్త (పబ్లిక్ హెల్త్ వర్కర్) పోతుల శంకర్ నేడు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం కార్యాలయంలో ఆయనకు సహోద్యోగులు, అధికారులు అత్యంత ఘనంగా వీడ్కోలు పలికారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ గారి ఆదేశాల మేరకు.. పురపాలక సంఘ అధికారులు పోతుల శంకర్, ఆయన ధర్మపత్నిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, సత్కరించారు. 38 సంవత్సరాల పాటు సిద్దిపేట ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యం కోసం శంకర్ అందించిన నిరంతర సేవలను ఈ సందర్భంగా అధికారులు ప్రత్యేకంగా కొనియాడారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ ఆత్మీయ వీడ్కోలు మరియు సన్మాన కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, డీఈ ప్రేరణ, ఆర్వో శ్రీకాంత్ రెడ్డి, టిపివో ప్రవీణ్, ఏఈ జమిల్ అహ్మద్‌లతో పాటు ఇతర మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది మరియు శంకర్ గారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు శేష జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యంగా సాగాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

# రోడ్డుకు అడ్డంగా మద్యం లోడ్ బండి.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

సంగారెడ్డి: వుదయం



సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని న్యూ బస్టాండ్ ఎదురుగా ఉన్న గణేష్ వైన్స్ వద్ద మద్యం సరుకుతో వచ్చిన లారీని రోడ్డుకు అడ్డంగా నిలిపి అన్‌లోడింగ్ నిర్వహించడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.స్థానికుల కథనం ప్రకారం, ప్రధాన రహదారిపైనే మద్యం లోడ్‌ను ఖాళీ చేయడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రద్దీ సమయాల్లో లారీని రోడ్డుకు అడ్డంగా నిలిపివేయడం వల్ల తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని వారు తెలిపారు.గణేష్ వైన్స్ నిర్వహణ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోందని, ఈ విషయంపై పలుమార్లు ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ప్రజావాణి కార్యక్రమంలో కూడా గణేష్ వైన్స్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా, ప్రమాదాలు జరగకుండా వెంటనే స్పందించి గణేష్ వైన్స్ వద్ద రోడ్డుపై జరుగుతున్న లోడింగ్, అన్‌లోడింగ్‌ను నిలిపివేయడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# పౌర హక్కులకు భంగం కలిగించొద్దు

- గద్వాల నాయబ్ తహసిల్దార్ అజిత్ కుమార్

గద్వాల

జూన్ 30 (వుదయం కరస్పాండెంట్)

గద్వాల మండలం జిల్లెడబండ గ్రామంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కుల వివక్ష, అంటరాని తనాన్ని నిర్మూలించాలని, గ్రామీణ ప్రజల్లో పౌర హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గద్వాల నాయబ్ తాసిల్దార్ అజిత్ కుమార్ వెల్లడించారు.
సమాజంలో ఎవరి హక్కులకు భంగం కల్గించొద్దని గద్వాల నాయబ్ తహసీల్దార్ అజిత్ కుమార్ అన్నారు. పౌర హక్కుల దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశాలను, దాని ప్రాముఖ్యతను వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానత్వంతో మెలిగేలా, పౌర హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. రాజ్యాంగ విలువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నగేష్, జిల్లెడబండ పాఠశాల హెచ్ఎం వెంకటన్న, పంచాయతీ కార్యదర్శి, జీపీఓ, స్థానిక పోలీస్ కానిస్టేబుల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద బైక్ దొంగ అరెస్ట్

- 5 ద్విచక్ర వాహనాల స్వాధీనం

జిన్నారం

జూన్ 30(వుదయం ప్రతినిధి)

గుమ్మడిదల పోలీసులు మోటార్‌సైకిల్ చోరీల కేసులను ఛేదించి ఓ నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గుమ్మడిదల ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, నర్సాపూర్ వైపు (38), రుస్తుంపేట గ్రామం, నర్సాపూ స్వాధీనం చేసుకున్న వాహనాల్లో గుమ్మడిదల పీఎస్‌కు సంబంధించిన గ్లామర్ బైక్ (టీఎస్15 ఈ ఏ3013), నర్సాపూర్ పీఎస్ పరిధిలో చోరీకి గురైన స్ప్లెండర్ ప్లస్ (టీఎస్35జీ7316), గ్లామర్ (టీఎస్ 35డి0272), పల్సర్ ఎన్ఎస్ 160 (టీఎస్ 32ఎ9240), అలాగే పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద చోరీకి గురైన నంబర్ లేని నీలిరంగు స్ప్లెండర్ బైక్ ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రజలు ఇళ్లు, ద్విచక్ర వాహనాల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఇళ్లకు పటిష్టమైన తాళాలు, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, బైక్‌లకు హ్యాండిల్ లాక్‌తో పాటు అదనపు లాక్‌లు ఉపయోగించడం, భద్రత కలిగిన ప్రదేశాల్లోనే వాహనాలను పార్క్ చేయడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు.


**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: SECUNDERABAD**
**O.S.No. 379 of 2026**

Between:
**Satish BukkapatanTirumala Chary,** S/o.LateB.T.Venkata Chary @ BukkapatanTirumala Venkata Chary, ged about 60 years, Occ: Private Service, R/o. Plot No.3, Radhika Colony, West Maredpally, Secunderabad ... Plaintiff

**AND**

**1) The Tahasildar/Mandal Revenue Officer,** Marredpally Mandal, at Tukaramgate, Secunderabad.
**2) All Concerned** ...Defendants

To,
**All Concerned** **...Defendant No.2**

Please take notice that the above named Plaintiff have filed the above suit for Declaration, declaring the Plaintiff as legal heirof Late **B.T.Venkata Chary @ BukapatanTirumalaVenkata Chary @ S/o. B.T.Narasimha Chary and Smt. Shakunthala Devi, W/o. B.T.Venkata Chary @ BukapatanTirumalaVenkata Chary**and the case is posted on **17-07-2026**. If anybody having any objections, they are hereby directed to appear before the above mentioned court on the above said date at 10.30.A.M. either in person or through an Advocate, if failed to appear before the court, the matter will be decided as per law.

**//By the Order of the Court//**
**M/s.R.SUDHAKAR, Advocate,**
Office at Flat No.101, Vijaya Mani Sai Arcade, H.No.8-1-369/370/346, Shivaji Nagar, Secunderabad-03.

**IN THE COURT OF THE HON'BLE MOTOR ACCIDENT CLAIMS TRIBUNALCUM- II ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT :HYDERABAD**
**O.P. No. 1951 OF 2025**

*Between:*
Suneeta **...Plaintiffs**

**AND**

Nagamani Arukula and Others. **... Respondents**

To,
1.Nagamani Arukula,W/o.Venkatesh,Occ:Owner of the Crime Vehicle,R/o.New Batchpur,Peddamungal,, Miryalaguda,Nalgonda.. **....R1**

**NOTICE**

Please take notice that the above O.P. is filed against you and others for grant of compensation and the above case is posted for your appearance on 2-7- 2026. at 10:30 a.m. in person or by an Advocate, failing which the case will be decided on merits in your absence.

***(BY ORDER OF THE COURT)***
Sd/-
**Ravi Krishna kumar.Advocate Malakpet, Hyderabad..Hyderabad**

**IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE COURT CITY CIVIL COURT HYDERABAD AT:HYDERABAD**
**O.S.No: 726 OF 2026**

*Between:*
Ksheera Sagar Geetha Rani and another **...Plaintiffs**

Versus

1. Mandal Revenue Office Golconda, 13-6-823/6/A, Fort Rd, Mehdi Colony, Langar Houz, Hyderabad, Telangana 500008
2. All concerned

**............Defendents.**

Please take notice that the Plaintiff`s herein has filed the above suit to declare the Plaintiff`s as the legal heir`s of Late Ksheera Sagar Ajay who died intestate on Dated: 05.11.2024
The above said suit is posted on Dated:14.07.2026 at 10:30 A.M, for your (Defendant No.2) i.e all concern appearance, either in person or through, your learned counsel duly instructed to answer the claim, failing which the above matter will be decided in your absence as per law.

***(BY ORDER OF THE COURT)***
Sd/-
**M/s. Aditya Law Firm**
**Laxmikantham T Vukkalkar**
**Pawan T Vukkalkar**
**Manoj T Vukkalkar**
**Vinay T Vukkalkar**
**Karthik T Vukkalkar**
**Advocates**
**9704829022, 9010268633**




“ రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట కాంగ్రెస్ నేతలు నాటకాలు ఆడుతున్నారు. ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగసభా?.. కాంగ్రెస్ ప్రభుత్వ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారు. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీ చేసి చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలి. ఇప్పటికే రూ.50 వేల కోట్లతో చేయాల్సిన రూ.2లక్షల రుణమాఫీని చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశారు. దిల్లీ టూర్లు, పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న రూ.కోట్ల ఖర్చును ఆదా చేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి దృష్టి మళ్లించేందుకు చేపట్టే చర్యలు ఏమాత్రం పనిచేయవు. కేసీఆర్ ఠంచనుగా 11 సార్లు రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. ”

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

## వేమన పద్యం

మృగమదంబుజూడ మీద నల్లగనుండు
బరిఢవిల్లు దాని పరిమళంబు
గురువులైనవారి గుణములీలాగురా
విశ్వదాభిరామ! వినురవేమ



## కలం కదలనంటోంది

మహిళా సాధికారత గురించి
గొప్పగా రాయాలని కూర్చున్నా
కానీ... కలం కదలనంటుంది.

ఎన్నో ఆటుపోట్లను దాటి ...
తొలి ఉపాధ్యాయిని అయిన సావిత్రి,
వలసవాదులతో పోరాడిన లక్ష్మీబాయి,
పాలనా దక్షత చూపిన రుద్రమ, రజియాలు,
ఆకాశమే హద్దంటూ అంతరిక్షానికేగిన సునీతల
మహిళా సాధికారతను రాద్దామంటే ఎందుకో
కలం కదలనంటుంది.

ఎంతసేపు వేళ్లమీద లెక్కించగలిగే నలుగురిని చూసి
ఇంతి ఎంతో సాధించిందని మురిసిపోయే
మన అమాయకత్వానికి జాలిపడుతూ
కలం కదలనంటుంది.



మార్చి ఎనిమిది నాడు...
సభలు, సమావేశాలు నిర్వహించి...
గొప్ప గొప్ప ఉపన్యాసాలిస్తూ ఆకాశానికెత్తి
మరునాడే కింద పడేస్తున్న సంగతి మరిచామని
కలం కదలనంటుంది.

బాల్య వివాహాలు, వరకట్నపు చావులు,
గృహ హింసలు, హత్యలు, అత్యాచారాలు,
భ్రూణ హత్యలు, వ్యభిచారం, ఆడపిల్లల అమ్మకం,
ఇలా ఏదీ... ఏదీ ఆగలేదని గుండె పగిలి
కలం కదలనంటుంది.

స్త్రీ ఏం చెయ్యాలన్నా రణరంగంలో సైనికుడిలా
క్షణ క్షణం యుద్ధం చెయ్యాలి
బతుకంతా నిప్పుల మీద నడకలా మారి
తన ఉనికే ప్రశ్నార్థకమైందని కన్నీటితో
కలం కదలనంటుంది.

ప్రతి నిత్యం జీవన సంఘర్షణ పోయి
స్వేచ్ఛగా...
మనం మనలా బతుకుతూ....
మన ఉనికిని నిలబెట్టుకునేదాకా
కలం కదలనంటుంది.



డా. ఆవుల రేణుక
9398268976

# డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ఉద్యమిద్దాం

డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం ప్రపంచానికి సామాజిక సమస్యగా పరిణమించింది. దేశ అభివృద్ధిలో చోదక శక్తిగా నిలిచిన యువత డ్రగ్స్ ఆల్కహాల్ మాదక ద్రవ్యాల మత్తులో చిక్కుకొని తమ శక్తి సామర్థ్యాలు నిర్వీర్యం చేసుకుంటున్నారు. డ్రగ్స్ మాదక ద్రవ్యాల దుర్వినియోగం యువత వినాశన కరంగ మారింది ఆశలు ఆకాంక్షలు కన్న కలలు విచ్ఛిన్నమై కుటుంబాలలో ఆనందకరమైన జీవితానికి అవరోధం కావడం శోచనీయం. ఐ'రా'స జూన్26 న ప్రపంచ డ్రగ్స్ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపాలని 1987 నుండి ప్రపంచ వ్యాప్తంగా డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం అరికట్టేందుకు సభ్య దేశాల ప్రభుత్వాలకు హెచ్చరికలు జారీచేస్తూ మాదక ద్రవ్యాల మహమ్మారికి వ్యతిరేకంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంది. . డ్రగ్స్ మత్తు పదార్థాలు మాదక ద్రవ్యాల వినియోగం రావాణా వల్ల ఏర్పడే దుష్ఫలితాల పట్ల ప్రజలకు పౌరసమాజానికి అవగాహన చైతన్యం కలిగించడం ముఖ్య ఉద్దేశం పత్రికల్లో మీడియాలో డ్రగ్స్. మాదక ద్రవ్యాల వినియోగం వార్తలు సమాజాన్ని కలవర పెడుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా డ్రగ్స్ మాఫియా రాజ్యమేలుతుంది. చిన్న పట్టణాల నుంచి మెట్రోపాలిటన్ నగరాలకు డ్రగ్స్ వ్యాపారం మూడు పువ్వులు అరవై కాయలుగా కొనసాగుతుంది స్కూల్ కాలేజీ యూనివర్సిటీలు డ్రగ్స్.విక్రయ కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వ్యాపారం మాఫియా యువతను నిర్వీర్యం చేస్తూ లక్షల కోట్ల చీకటి వ్యాపారం చేస్తున్నాయి. యువత మత్తు కు ఆకర్షితులై మత్తు నుండి బయట పడలేక తమ జీవితాలను బలిచేసుకుంటున్నారు. కొంత మంది ఆత్మహత్యలకు పాల్పదుతున్నరు. పెరిగిన డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం★ ప్రపంచవ్యాప్తంగా దాదాపు 269 మిలియన్ల మంది మాదక ద్రవ్యాలకు బానిస అయ్యారని నివేదికలు వెల్లడించాయి. వీరే కాకుండా ఎప్పుడైన ఒకసారి వినియోగించేవారు 5.5% మంది ఉన్నారు. దేశంలో మద్యం వినియోగించే వారు16 కోట్ల మంది గంజాయి 3.1 కోట్లు హీరోయిన్ 2.8 కోట్లు కోకైన్ ఇతర మత్తు పదార్థాలు 1.18 కోట్ల మంది వాడుతున్నారని నివేదికలు వెల్లడిస్తున్నాయి. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం ప్రపంచ వ్యాప్తంగా 2004లో 21 శాతం వాడుతుంటే నేడు 29.5% పెరిగిందని యు'ఎన్'ఓ'డి'సి విడుదల చేసిన నివేదిక తెలిపింది .ఈ నివేదిక ప్రకారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ప్రపంచ వ్యాప్తంగా అర మిలియను మంది 2019లో మరణిస్తే ఇండియాలో జరిగిన ఆత్మహత్యల్లో ఎక్కువ శాతం ఈ కోవకు చెందినవేనని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రమాదకరమైన మాదకద్రవ్యాలు ఉపయోగించే వారు 0.71 శాతం ఉంటే ప్రపంచ సగటు కంటే ఎక్కువగా మన దేశంలో 2.65% ఈ ప్రమాదకరమైన డ్రగ్స్ వాడుతున్నారని నివేదిక పేర్కొంది 1985లో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ సబ్ స్టాన్సెస్ చట్టం ప్రకారం మాదద్రవ్యాలు కలిగి ఉండటం సరఫరా ఉత్పత్తి చట్టరీత్యా నేరం అయినప్పటికీ ఈరోజు మనదేశంలో విచ్చల విడిగా డ్రగ్స్ దొరుకుతూనే ఉన్నాయి. వాడకం పెరుగుతుంది ఇంతటి ప్రమాదకరమైన సమస్య రోజురోజు కు తీవ్రమవుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయి. దీని కోసం తక్షణ పరిష్కారం కోసం ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. డ్రగ్స్ మాదక ద్రవ్యాల దుర్వినియోగం డ్రగ్స్ అక్రమ రవాణా కు వ్యతిరేకంగా జరిగే కార్యక్రమాలు ఒక రోజు కాకుండా నిరంతరం జరగాలి. వీటివల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలి. ఈ సమస్య పరిష్కరించడానికి సమర్థవంతమైన పాలన చట్టబద్ధమైన విధానాలను రూపొందించాలి. ప్రభుత్వాలు స్థానిక సంస్థలు మహిళా సంఘాలు పౌర సమాజం స్వచ్ఛంధ సంస్థలు మాదక ద్రవ్యాలకు సంబంధించిన చట్టాలు కార్యక్రమాలు పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలి .డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక సమాచారాన్ని పంచుకోవాలి మాదకద్రవ్యాలు సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడానికి ప్రభుత్వాలు రాజ్యాంగ వ్యవస్థలు ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు విద్యావేత్తలు సమిష్టిగా కృషి చేయాలి. ఒక్కరోజు మాత్రమే దీని గురించి ఆలోచించి మర్చిపోకూడదు. అక్రమ రవాణా ఎదుర్కోవడానికి అంతర్జాతీయంగా దేశాల మధ్యన సహకారం అవసరం. వ్యక్తులు కుటుంబాలు సమాజాలపై మాదకద్రవ్యాల దుర్వినియోగం గురించి అవగాహన చైతన్యం కలిగించాలి .నివారణ చికిత్స పునరావా స కార్యక్రమాలను ప్రోత్సహించాలి . మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జరిగే కార్యక్రమాల్లో ప్రజలందరూ సంపూర్ణ భాగస్వాములై డ్రగ్స్ రహిత సమాజం యొక్క ప్రాముఖ్యతను ప్రచారం చేయాలి . వర్క్ షాపలు సదస్సులు చర్చలు ఏర్పాటు చేయాలి. మత్తు పదార్థాలు కు వ్యతిరేకంగా ప్రచారం చేసే వ్యక్తులను సంస్థలను అవార్డులుఇచ్చి ప్రోత్సహించాలి. పాఠశాలలు కళాశాలలో డ్రగ్స్ ప్రభావాలు గురించి సదస్సులు నిర్వహించాలి. నైతిక విద్యను పాఠ్యాంశంలో ప్రవేశపెట్టి డ్రగ్స్ రహిత ఆరోగ్య కరమైన జీవనశైలి పెంపొందించే విద్య బోధన పాఠ్య ప్రణాళికలు అమలు చేయాలి. కాశ్మీర్ ప్రాంతములో డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగానికి యువత బానిసలుగా మారిపోతున్నారు. జమ్ము కాశ్మీర్లో దాదాపు 10 లక్షల జనాభా వుంటే 8 శాతం ప్రజలు గంజాయి ఓపియాయిడ్లు వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డారు ఈ సమాచారాన్ని కేంద్ర మంత్రి పార్లమెంట్లో వెల్లడించారు. రేహబి లేషన్ కొరకు వచ్చే రోగుల సంఖ్య ఓ 10 ఏళ్లకు ముందు రోజుకు 10_12 డ్రగ్స్ అడ్డిక్షన్ కేసులు వచ్చేవి ఇప్పుడు 150_200 కేసులు వస్తున్నాయి ఇది ఆందోళన కలిగించే విషయం అని సైక్రటిస్ట్ డాక్టర్ ప్రొఫెసర్ యాసిర్ రాధార్ ప్రకటించారు. దేశంలో చాలా చోట్ల డ్రగ్స్ మాదక ద్రవ్యాల వ్యసారం విస్త్రరించి వుంది. ఐక్య రాజ్య సమితి నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 157 దేశాల్లో గంజాయి సాగు అవుతుంది. దేశంలో అనేక రాష్ట్రాలలో ఈ సమస్య తీవ్రంగా వుంది ఈశాన్య రాష్ట్రాలు అంతర్జాతీయ పోర్టులు ప్రైవేట్ పోర్టులు ద్వారా ఎక్కవ సప్లయ్ అవుతుంది కృష్ణా పట్నం పోర్టు శంషాబాద్ ఎయిర్ పోర్టులో డ్రగ్స్ మాదక ద్రవ్యాలు పట్టుబడుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న పేద దేశాలలో ఈ వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది. ప్రపంచీకరణ కార్పొరేటీకరణ ప్రభావం వల్ల డ్రాగ్స్ వ్యాపారం విస్తరిస్తుంది. 20 30 నాటికి మాదకద్రవ్యాల వ్యాపారం 11% పెరిగిపోతుందని ఐ'రా'స నివేదిక పేర్కొంది. ఆకలి 'దారిద్రం 'పేదరికం నిరుద్యోగం' వైద్యం అందకపోవడం లాంటి అనేక సమస్యలతో సతమవుతున్న ప్రజలను కార్పొరేట్ సంస్థలు మాదకద్రవ్యాల వ్యాపారంతో దేశాన్ని దోచుకోవడంతో పాటు యువతను నిర్వీర్యం చేస్తున్నారు. మత్తుకు బానిస లైన యువత డాగ్స్ ను పొందడం కోసం అనేక ఘాతకాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. యువత హింసకు దోపిడీకి పాలుపడుతున్నారు. హింస పెరిగిపోతుంది. కార్పోరేట్ సంస్థల ప్రభుత్వాలు అండగా నిలవడం కరోన మహమ్మారి ప్రపంచాన్ని వనణికించిన సమయంలోను కార్పొరేట్ల దందాను ప్రభుత్వాలు అరికట్టలేకపోయాయి. ఉచిత వాక్సిన్ అందించి ప్రపంచాన్ని కాపాడుకోవాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ప్రవర్తించి కాసులు దండుకునేందుకు దారులు వేసింది. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం యువతను శారీరకంగా మానసికంగా కుంగ తీస్తుంది.తీవ్రమైన భావోద్వేగాలకు గురిచేస్తుంది. యువ శక్తే దేశ శక్తి అంటున్న ప్రభుత్వాలు యువ శక్తి సామర్థ్యాలను నిర్వీర్యం చేసే బలహీన పరిచే మత్తు పదార్థాల మాదక ద్రవ్యాల వైపు పయనిస్తున్న యువతను కట్టడి చేయలేక పోవడం పాలకుల నిలక్ష్యానికి ప్రతీక డ్రగ్స్ వినియోగం వల్ల దేశాభి వృదికి వెన్నెముకగా వుండ వలసిన యువత నిర్వీర్త్యంఅవుతుంది. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే భౌతిక మానసిక సామాజిక ఆర్థిక నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కలిగించాలి. నషా ముక్త్ భారత్ అభియాన్ పథకం ద్వారా272 జిల్లాలో 13000 మంది వలంటర్లను పెట్టీ డ్రగ్స్ అరికట్టాలన్న కార్యాచరణ అమలుకు నోచుకోలేదు. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పబ్బులు 'క్లబ్బులు సినీ పరిశ్రమలో పాటశాల కళాశాల స్థాయిలో డ్రగ్స్ వ్యతిరేక ప్రచారాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించాలి. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం అక్రమ రవాణా కేసులను విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి దోషులకు కటిన శిక్షలు అమలు చెయ్యాలి. ఐటి పరిశ్రమలో డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం వ్యాపారాన్ని అరికట్టాలి. డ్రగ్స్ అడిక్ట్ గా మారిన యువతకు సమగ్ర వైద్య ఆరోగ్య పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి. కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యల మీద అవగాహన కలిగించాలి. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడటానికి విధ్య నివారణ చికిత్స చట్టాల అమలుతో కూడిన ఏకీకృత విధానం అమలు చెయ్యాలి. మాదక ద్రవ్యాల దుర్వినియోగం సమాజం ఉమ్మడి సమస్య డ్రగ్స్ రహిత సమాజ స్థాపన ప్రతి పౌరుని సామాజిక బాధ్యత. భవిష్యత్తు తరాలకు డ్రగ్స్ మాదక ద్రవ్యాల బారిన పడకుండా సమగ్ర మాదక ద్రవ్యాల వ్యతిరేఖ వ్యూహాన్ని ప్రభుత్వాలు అనుసరించాలి. ప్రతి పౌరుడు ఆరోగ్యకరమైన సురక్షితమైన ప్రపంచం వైపుకు ప్రోత్సహించిన నాడే డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం రవాణా వ్యతిరేక దినానికి సార్థకత. డ్రగ్స్ మాదక ద్రవ్యాల మహమ్మారి నుండి యువతను రక్షించే చర్యలు ప్రభుత్వం చేపట్టాలి. యువతే దేశ భవిత డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం దీక్ష బూనాలి. అందరికీ ఆరోగ్యం లక్ష్య సాధనకు సమగ్ర వైద్య ఆరోగ్య సంరక్షణ సంగ్ర వ్యాహాలను రూపొందించి డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం ప్రభుత్వాలు సమాజం ఉద్యమించాలి.



* 20 30 నాటికి మాదకద్రవ్యాల వ్యాపారం 11% పెరిగిపోతుందని ఐ'రా'స నివేదిక పేర్కొంది. ఆకలి 'దారిద్రం 'పేదరికం నిరుద్యోగం' వైద్యం అందకపోవడం లాంటి అనేక సమస్యలతో సతమవుతున్న ప్రజలను కార్పొరేట్ సంస్థలు మాదకద్రవ్యాల వ్యాపారంతో దేశాన్ని దోచుకోవడంతో పాటు యువతను నిర్వీర్యం చేస్తున్నారు. మత్తుకు బానిస లైన యువత డాగ్స్ ను పొందడం కోసం అనేక ఘాతకాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. యువత హింసకు దోపిడీకి పాలుపడుతున్నారు. హింస పెరిగిపోతుంది. కార్పోరేట్ సంస్థల ప్రభుత్వాలు అండగా నిలవడం కరోన మహమ్మారి ప్రపంచాన్ని వనణికించిన సమయంలోను కార్పొరేట్ల దందాను ప్రభుత్వాలు అరికట్టలేకపోయాయి.




నేదునూరి కనకయ్య
9440245771

# విద్య హక్కు నుండి సరుకుగా భారత విద్యా వ్యవస్థ?

విద్యారంగంలో వర్గ ఆధిపత్యం యొక్క కొత్త రూపం ప్రభుత్వ విద్య బలహీనత- ప్రైవేట్ రంగం బలోపేతం, గత కొన్ని శతాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో విద్య నాణ్యత ప్రమాణాలు తగిన స్థాయిలో పెరగలేదు. దీని ఫలితంగా మధ్య తరగతి కుటుంబాలు ప్రైవేటు విద్యా వైపు మగ్గాయి,ప్రభుత్వ విద్య పేదల విద్యగా ముద్రపడింది. ప్రైవేట్ రంగానికి విస్తృత మార్కెట్ ఏర్పడింది దీనిని యాదృచ్ఛిక పరిణామంగా కాకుండా సంక్షేమరంగంపై ప్రభుత్వ బాధ్యత తగ్గింది. విద్య , ఉపాధి మార్కెట్, ప్రస్తుత విద్యా విధానం విద్యార్థులను విమర్శనాత్మక పౌరులుగా కాకుండా ఉద్యోగ మార్కెట్ కు అవసరమైన మానవ వనరులుగా తయారు చేస్తుందని విమర్శ ఉంది.

విద్యా విముక్తికి సాధనమా లేక మార్కెట్ సేవలను తయారు చేసే యంత్రమా? అనే ప్రశ్న నేడు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతదేశంలో విద్యారంగం గత మూడు శతాబ్దాలుగా వేగంగా వ్యాపారి కరణ చెందుతుంది. పాఠశాలలు నుంచి విశ్వ విద్యాలయాల వరకు, కోచింగ్ సెంటర్ లు విద్య ఒక భారీ మార్కెట్ గా మారింది. ఈ పరిణామాల్ని కేవలం విద్యా సమస్యగా కాకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభావంతో ముడిపడి ఉన్న సామాజిక ఆర్థిక సమస్యగా చూడాలి. సమాజంలోని అన్ని సంస్థలు ఉత్పత్తి సంబంధాలతో అనుసంధానమై ఉంటాయని మార్క్స్ అంటాడు ఆంటోనియోగ్రాంసి, వంటి మార్క్సిస్టు సిద్ధాంతకర్తలు విద్యాసంస్థలు పాలకవర్గాల భావజాలానికి పునరుత్పత్తి చేసే సాధనాలుగా అని అంటారు విద్య ప్రజల హక్కు, విద్య సామాజిక సమానత్వాన్ని పెంచి పోషించాలి, విద్య మార్కెట్ అవసరాలకు మాత్రమే పరిమితం కాకూడదు, విద్య విమర్శనాత్మక ఆలోచన, శాస్త్రీయ దృక్పథం, సామాజిక చైతన్యాన్ని పెంచాలి. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థలోని విద్య క్రమంగా మానవ అభివృద్ధి లక్ష్యం నుండి మార్కెట్ అవసరాలకు, అవసరమైన “శ్రమశక్తి ”తయారీ లక్ష్యానికి పరిమితమవుతుంది. భారతదేశంలో విద్య వ్యాపారికరణ భారత దేశం లో విద్యా వ్యాపారం ఎటా సుమారు 117 బిలియన్ డాలర్స్ నుండి 125 బిలియన్ డాలర్లు ఆదాయం పెరిగింది. ఇది 2030. నాటికీ 313 బిలియన్ డాలర్ల నుండి 330 బిలియన్ డాలర్స్ వరకు చేరుకుంటుందని విశ్లేషకుల అంచనా (భారత కరెన్సిలో 25 లక్షల కోట్లు ) 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత ప్రవేటికన్నా వేగంగా పెరిగింది ఉన్నత విద్యలో ముఖ్యంగా ఇంజనీరింగ్ మెడిసిన్ మేనేజ్మెంట్ లాంటి రంగాల్లో ప్రవేట్ సంస్థలు



ఆధిపత్యం పెరిగింది నేడు లక్షల రూపాయల ఫీజులు సాధారణమయ్యాయి NEET,JEE, CLAT,UPSC లాంటి పరీక్షల కోసం కోచింగ్ పరిశ్రమలు వేలకోట్ల రూపాయల మార్కెట్ గా మారింది విద్యార్థులు విద్యార్థుల కంటే కస్టమర్లుగా పరిగణించబడుతున్నారు విద్యార్థులు కార్పొరేట్ సంస్థల మాదిరిగా నడుస్తున్నాయి ఈ పరిస్థితిని “విద్య సరుకీకరణ” గా మారింది భారత రాజ్యాంగం సమాన అవకాశాలను హామీ ఇస్తున్నప్పటికీ వాస్తవ పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ఒక ధనిక కుటుంబానికి చెందిన విద్యార్థి అంతర్జాతీయ ప్రమాణాల పాఠశాల ఖరీదైన కోచింగ్ డిజిటల్ సదుపాయాలు ఇంగ్లీష్ మధ్యమం అందుబాటులో ఉంటుంది. అదే సమయంలో పేద గ్రామీణ దళిత, గిరిజన ఆదివాసి ,కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయుల కొరత మౌలిక సదుపాయాల లేని పాఠశాలలు ఆర్థిక ఇబ్బందులు వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు విద్య సమానత్వాన్ని పెంచవలసిన చోట ఇప్పటికే ఉన్న వర్గాల అసమానతలను తిరిగి ఉత్పత్తి చేస్తుంది. కోచింగ్ పరిశ్రమ – అసమానతలకు కొత్త రూపం. కోట, హైదరాబాద్, ఢిల్లీ వంటి నగరాల్లో కోచింగ్ పరిశ్రమ ఒక పెద్ద వ్యాపారంగా మారింది నీట్ ,జెఈఈ, యుపిఎస్సి, క్లాట్ ల పేర్లతో ఒకొక్క విద్యార్థి పై సంవత్సరానికి లక్షల రూపాయలు ఖర్చు చేయగలిగితేనే పోటీలో ముందుండే అవకాశాలు పెరుగుతుంది. దీంతో ప్రతిభ కంటే ఆర్థిక సామర్థ్యానికి ప్రాధాన్యత పెరుగుతుంది. విద్యా హక్కు నుండి పెట్టుబడిగా మారుతుంది. పేద విద్యార్థులు వెనుకబడుతున్నారు ఇది క్రమంగా పథకం ప్రకారం ఇది విద్యారంగంలో వర్గ ఆధిపత్యం యొక్క కొత్త రూపం ప్రభుత్వ విద్య బలహీనత- ప్రైవేట్ రంగం బలోపేతం, గత కొన్ని శతాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో విద్య నాణ్యత ప్రమాణాలు తగిన స్థాయిలో పెరగలేదు. దీని ఫలితంగా మధ్యతరగతి కుటుంబాలు ప్రైవేటు విద్యా వైపు మగ్గాయి,ప్రభుత్వ విద్య పేదల విద్యగా ముద్రపడింది. ప్రైవేట్ రంగానికి విస్తృత మార్కెట్ ఏర్పడింది దీనిని యాదృచ్ఛిక పరిణామంగా కాకుండా సంక్షేమ రంగంపై ప్రభుత్వ బాధ్యత తగ్గింది. విద్య , ఉపాధి మార్కెట్, ప్రస్తుత విద్యా విధానం విద్యార్థులను విమర్శనాత్మక పౌరులుగా కాకుండా ఉద్యోగ మార్కెట్ కు అవసరమైన మానవ వనరులుగా తయారు చేస్తుందని విమర్శఉంది. నేడు సాహిత్యం, చరిత్ర, సామాజిక శాస్త్రాలకు ప్రాధాన్యత తగ్గుతుంది ప్రవేట్ రంగానికి అవసరమైన నాణ్యతకు ప్రాధాన్యత పెరుగుతుంది విద్య యొక్క మానవీయ ప్రజాస్వామ్య లక్ష్యాలు బలహీన పడుతున్నాయి ఇది శ్రామిక శక్తి పునరుత్పత్తి భావనతో అనుసందమై ఉంటుంది

**ప్రత్యామ్నాయం ఏమిటి?**

ఈ సమస్య కు పరిష్కరమార్గాలు,ప్రాత్యామ్నాయం శాస్త్రీయంగా పరిశీలించాలి 1. ఉచిత, నాణ్యమైన విద్య ప్రాథమిక స్థాయి నుండి విశ్వవిద్యాల యాల స్థాయి వరకు నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలి 2.ప్రభుత్వ పెట్టుబడుల పెంపు విద్యపై ప్రభుత్వ వ్యయం గణనీయంగా పెరగాలి. 3.ప్రైవేటు విద్యా నియంత్రణ అధిక ఫీజులు లాభాపేక్ష వాణిజ్యకరణపై కఠిన నియంత్రణలో అవసరం 4.సామాజిక న్యాయం దళితులు గిరిజనులు ఆదివాసులు మహిళలు మైనార్టీలు వెనుకబడిన తరగతుల వర్గాలకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలి . 5.శాస్త్రీయ మరియు ప్రజాస్వామ్య విద్య,విద్య ఉద్యోగానికే పరిమితం కాకుండా విమర్శనాత్మక ఆలోచన మానవ విలువలు సామాజిక బాధ్యతలు పెంపొందించాలి విద్య పై జరుగుతున్న పోరాటం కేవలం ఫీజులపై పోరాటం కాదు, ఇది సమాజం ఏ దశలో సాగాలనే ప్రశ్నతో ముడిపడి ఉంటుంది. విద్యను మార్కెట్ సరుకుగా చూస్తే, ధనికులకు అవకాశాలు, పేదలకు అడ్డంకులు పెరుగుతాయి.విద్యను హక్కుగా చూస్తే సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం బలపడుతుంది. దీని ప్రకారం విద్య మనషులను మార్కెట్ అనుకూలంగా మార్చే సాధనం కాకుండా సమాజాన్ని మార్చగల విముక్తి శక్తిగా ఉండాలి. అందువల్ల విద్యాహక్కు వ్యాపారం కాదు....అనే నినాదం కేవలం రాజకీయ నినాదం కాదు...ఇది సమానత్వ సమాజ నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక హక్కు.



మాలోతు సాగర్
7013805411

# జూలై 1 బ్రిటిష్ సైన్యం ఢిల్లీ ఆక్రమణకు నడుం బిగించారు

ఆధునిక భారత దేశ చరిత్రలో 1857 సంవత్సరానికి ప్రత్యేక స్థానం ఉంది. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వలస పాలనకు వ్యతిరేకంగా భారతీయులు గళమెత్తిన తొలి సమిష్టి ప్రయత్నం ఇదే. చరిత్ర కారులు దీనిని "సిపాయిల తిరుగుబాటు", "సిపాయిల పితూరి", "ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం", "విప్లవోద్యమం" వంటి పేర్లతో పేర్కొంటారు. ప్రముఖ రచయిత వీరసావర్కర్ తన రచన ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ (1909) లో దీన్ని తొలి స్వాతంత్ర్య యుద్ధంగా ప్రకటించారు. ఈ తిరుగుబాటు దాదాపు వంద సంవత్సరాల బ్రిటిషు పాలన అహంకారానికి ప్రతిఘటనగా మేల్కొంది. 1757లో ప్లాసీ యుద్ధం తర్వాత బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ తన ఆధిపత్యాన్ని గట్టిగా చొప్పించుకున్న కొద్ది కాలానికే భారతీయులలో వ్యతిరేకత మొదలైంది. అయితే 1856 డిసెంబర్‌లో కంపెనీ ప్రవేశ పెట్టిన రాయల్ ఎన్ఫీల్డ్ P/53 రైఫిల్ వాడకానికి సంబంధించిన అంశమే తిరుగుబాటుకు ఆశాజనకంగా మారింది. ఈ తుపాకులకు ఉపయోగించే తూటాలను నోటితో కొరికి లోపల పెట్టాల్సి ఉండేది. అయితే అవి ఆవు, పంది కొవ్వుతో పూత పూసినవని ప్రచారం జరిగింది. దీనివల్ల హిందూ ముస్లిం సైనికుల మత భావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తూ బ్రిటిషు పాలకులు వారి మతాలను మార్చాలని కుట్ర పన్నుతున్నారన్న అభిప్రాయం బలపడింది. దీంతో నమ్మకాలు కల్లోలానికి గురై, విద్రోహం చెలరేగింది. 1857 మార్చిలో మంగళ్ పాండే అనే సైనికుడు బ్రిటిష్ అధికారి పై దాడి చేసి అరెస్ట్ చేయ బడ్డాడు. ఏప్రిల్ 8న అతనికి ఉరిశిక్ష విధించ బడింది. అతని ధైర్యం పలువురిలో చైతన్యం నింపింది. మే 10న మీరట్‌లో 11వ, 20వ అశ్వ దళాలు తిరుగుబాటుకు తెరలేపాయి. అధికారులు నిర్లక్ష్యం చేయగా... తిరుగుబాటు సుడిగాలిలా విస్తరించి పోయింది. మే 11న తిరుగుబాటు సిపాయిలు ఢిల్లీ చేరుకొని ఎర్రకోటను ఆక్రమించారు. చివరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్‌ను తిరుగు బాటుకు నాయకత్వం వహించాలని ఒత్తిడి చేశారు. ఆయన మొదట వెనుకాడినా, ఆపై అంగీకరించి తిరుగుబాటు దారుల చిహ్నంగా మళ్లీ ఢిల్లీ సింహాసనం మీద ఆసీనమయ్యారు. దీంతో తిరుగుబాటుకు మరింత బలం చేకూరింది. ఢిల్లీ కేంద్రంగా తిరుగుబాటు పెను తుఫానుగా మారింది. కాన్పూర్, ఝాన్సీ, లక్నో, అలహాబాద్ వంటి నగరాల్లో తిరుగుబాటు దారులు బ్రిటిష్ అధికారులను తుడిచి. పెట్టేశారు. ఝాన్సీ రాణి లక్ష్మీబాయి, నానా సాహెబ్, తాంతియా తోపే వంటి నాయకులు యుద్ధ రంగంలో వీరత్వాన్ని ప్రదర్శించారు. కానీ ఆరంభంలో గందరగోళంగా ఉన్నా... తరువాత బ్రిటిష్ ప్రభుత్వం పకడ్బందీగా ప్రతిస్పందించింది. వారు చైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న పటాలాలను, క్రిమియన్ యుద్ధం నుండి మళ్లించిన యూరోపియన్ బలగాలను భారత్‌కు తరలించి తిరుగుబాటును అణిచి వేయడానికి కృషి చేశారు. ఈ క్రమంలో ఢిల్లీ తిరిగి ఆక్రమించుకునే యత్నాన్ని జూలై 1, 1857న బ్రిటిష్ సైన్యం ప్రారంభించింది. ప్రధాన యుద్ధం ఢిల్లీకి సమీపంలోని బద్‌కీ-సరై వద్ద జరిగింది. ఆ యుద్ధంలో తిరుగుబాటు దారులు క్రమశిక్షణతో ధీటుగా పోరాడినా, బ్రిటిష్ సైనిక బలానికి ఎదుర్కోలేక ఢిల్లీకి వెనుదిరగాల్సి వచ్చింది.



సంగనబట్ల
9440595494

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020



# జాతీయం-అంతర్జాతీయం



## త్వరలోనే నీట్ ఫలితాలు..

- 20 లక్షల మందికిపైగా అభ్యర్థులు
- 13 భాషల్లో నిర్వహణ

**న్యూఢిల్లీ, జూన్ 30 ,(ఎ.ఎం.ఎస్):** నీట్ రీఎగ్జామ్ ఫలితాలు త్వరలోనే విడుదల కానున్నాయి. ఈనెల 21న ఆ పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రకారం, భారతదేశంలోని 5,440 కేంద్రాలు, విదేశాల్లోని 14 కేంద్రాలలో జరిగిన ఈ 2026 పునఃపరీక్షకు 20 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. హిందీ, ఆంగ్లంతో సహా మొత్తం 13 భాషలలో ఈ పరీక్ష నిర్వహించారు. తాజాగా నీట్ ప్రొవిజనల్




ఆన్సర్ కీ పై అభ్యంతరాల స్వీకరణ పూర్తి అయిందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం తెలిపింది. దాదాపు 10వేలకు పైగా అభ్యంతరాలు వచ్చినట్లు తెలియజేసింది. అతి త్వరలోనే నీట్ ఫలితాలు వెల్లడి కానున్నాయని సబంధింత వర్గాలు పేర్కొన్నాయి. జూన్ 21న, దేశవ్యాప్తంగా, విదేశాల్లోని 14 కేంద్రాలలో 'నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్' 2026కు సంబంధించిన అత్యంత కీలకమైన పునఃపరీక్ష ముగిసింది. ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో దీనిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో ఆ సంస్థ ఇప్పటికే పలువురిని అరెస్టు చేసింది.

## నా ప్రాధాన్యత ఇండియాకే..

- భారత ఆర్థిక పురోగతిపై స్టీవ్ డైన్స్
- పలు కీలక విషయాలు వెల్లడి

**న్యూయార్క్, జూన్ 30:** ప్రపంచవ్యాప్తంగా మారుతున్న ఆర్థిక, భౌగోళిక రాజకీయ ముఖచిత్రంలో భారతదేశ వృద్ధి రేటు సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలోనే అమెరికాకు చెందిన సీనియర్ రిపబ్లికన్ సెనేటర్ స్టీవ్ డైన్స్ భారత్ ఆర్థిక పురోగతిపై అత్యంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ప్రపంచ దేశాలన్నీ గనుక స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయ్యే షేర్లు అయితే.. నేను నా డబ్బునంతా భారత్‌లోనే పెట్టుబడిగా పెడతాను. ప్రస్తుతం నేను కొనుగోలు చేసే ఏకైక స్టాక్ ఇండియా మాత్రమే" అని ఆయన వ్యాఖ్యానించారు. మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన భారత్‌అమెరికా ద్వైపాక్షిక సంబంధాలు, వీసాల సరళీకరణ, అంతర్జాతీయ ఇంధన భద్రతపై పలు కీలక విషయాలను పంచుకున్నారు.

యూఎస్‌ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్ (యూఎస్ఐఎస్‌పీఎఫ్) నుంచి ప్రతిష్టాత్మక 2026 పబ్లిక్ సర్వీస్ అవార్డును అందుకున్న సెనేటర్ స్టీవ్ డైన్స్.. భారత్ వృద్ధి వేగాన్ని ప్రశంసించారు. "ప్రపంచంలోని టాప్ 20 అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలలో జీడీపీ పరంగా భారత్ ప్రస్తుతం ఐదో స్థానంలో ఉంది. అతి త్వరలోనే నాలుగో స్థానానికి చేరుకోబోతోంది. కేవలం ప్రస్తుత సంవత్సరమే కాకుండా, రాబోయే ఏడాదికి కూడా అత్యధిక జీడీపీ వృద్ధి రేటును నమోదు చేయబోతున్న ఏకైక దేశం భారత్ మాత్రమే. అందుకే ఇండియా ప్రస్తుతం వేగంగా దూసుకుపోతోంది" అని విశ్లేషించారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్.. అమెరికాకు అత్యంత నమ్మకమైన భాగస్వామిగా మారిందని, ఏ బంధానికైనా నమ్మకం అనేది చాలా కీలకమని ఆయన ఉద్ఘాటించారు.

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో కలిసి ఇరు దేశాల బంధాన్ని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని స్టీవ్ డైన్స్ స్పష్టం చేశారు.

దీనివల్ల భారత మార్కెట్లలో అమెరికా కంపెనీల పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయని అన్నారు. ఎంతో కాలంగా ప్రతిపాదనలో ఉన్న భారత్‌యూఎస్ వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా ముగించాలని ఇరు దేశాల ప్రభుత్వాలను ఆయన కోరారు.



ఇరు దేశాల మధ్య ప్రతిభావంతులైన నిపుణులు, విద్యార్థుల రాకపోకలను మరింత సులభతరం చేయాలని సెనేటర్ డైన్స్ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే హెచ్ 1బీ వీసా విధానంలో సరళీకరణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. "నమ్మకమైన మిత్రదేశాల మధ్య ఉన్న అన్ని రకాల అడ్డంకులను పూర్తిగా తొలగించాలి. అమెరికాకు భారతీయ విద్యార్థులు, నిపుణుల అవసరం చాలా ఉంది. అన్నింటికంటే మానవ వనరుల మూలధనం ఎంతో విలువైంది. అమెరికా అభివృద్ధిలో భారతీయ అమెరికన్లు కీలక పాత్ర పోషిస్తున్నారు" అని కొనియాడారు. ఇదే సమయంలో భారతీయ అమెరికన్లపై జరుగుతున్న ద్వేషపూరిత దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు.



## యూపీ కాంగ్రెస్ చీఫ్ అరెస్టు..

- అయోధ్యకు వెళ్లకుండా అడ్డగింత
- వేధింపులకు గురి చేస్తున్నారు: అజయ్‌రాయ్

**లక్నో ,జూన్ 30 ,(ఎ.ఎం.ఎస్):** ఉత్తరప్రదేశ్ లో ఉద్రిక్తత నెలకొంది. ఆ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. అయోధ్య మందిర్ లో రామ దర్శనకు వెళ్తుతున్న అజయ్ రాయ్ తో పాటు ఆయన అనుచరులను హౌస్ అరెస్ట్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా వీడియో సందేశం విడుదల చేశారు. తమను బలవంతంగా అయోధ్యకు వెళ్లకుండా అడ్డుకున్నారని, దారిలో తమను అడ్డగించి నిలువరించారని ఆందోళన వ్యక్తం చేశారు. తనతో పాటు అనేక మందిని నిర్బందించారని మండిపడ్డారు.

"సోమవారం రాత్రి 11:30 గంటల సమయంలో, పోలీసులు మమ్మల్ని బలవంతంగా అరెస్టు చేసి ఆచార్య నరేంద్ర దేవ్ విశ్వవిద్యాలయ అతిథి గృహానికి తీసుకువచ్చారు. మమ్మల్ని వేధింపులకు గురిచేస్తున్నారు, ఆలయాన్ని సందర్శించకుండా అడ్డుకుంటున్నారు... మేమంతా శ్రీరాముని ఆశీస్సులు పొందేందుకు అయోధ్యను సందర్శించాలని అనుకున్నాము. కానుకలు, విరాళాల చోరీ, భూ కుంభకోణాల ద్వారా ఆర్ఎస్ఎస్, బీజేపీ ఈ పవిత్ర స్థలానికి తెచ్చిన అపఖ్యాతి గురించి కూడా మేము దేవుడికి ప్రార్థన చేయాలనుకున్నాము... నన్ను, నా సహచరులను గృహ నిర్బంధంలో ఉంచారు. ఆలయాన్ని సందర్శించే తమ హక్కును వినియోగించుకోవడానికి జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని" ఆయన స్పష్టం చేశారు. యోగి ప్రభుత్వ దౌర్జన్యాన్ని అజయ్ రాయ్ భార్య రీనా రాయ్ తీవ్రంగా ఖండించారు. బీజేపీ ప్రభుత్వం తన భర్త గొంతు నొక్కడానికి ప్రయత్నిస్తోందని, రామజన్మభూమి ఆలయంలో "కానుకల చోరీ"కి వ్యతిరేకంగా కాంగ్రెస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు.

## ఇకపై అన్నీ ఏసీ బస్సులే..

- తమిళనాడు ప్రభుత్వ కీలక నిర్ణయం
- ముఖ్యమంత్రి విజయ్ ఆదేశాలు

**చెన్నై జూన్ 30 ,(ఎ.ఎం.ఎస్):** ఇకపై తమిళనాడు ప్రభుత్వం కొనుగోలు చేసే కొత్త బస్సులన్నీ ఎయిర్ కండిషనింగ్ సౌకర్యంతోనే ఉండనున్నాయి. ఈ మేరకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు తమిళనాడు రోడ్డు రవాణా శాఖ మంత్రి విజయ్ తమిళన్ పార్థిబన్ వెల్లడించారు. ప్రజలకు మెరుగైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేలా ప్రజా రవాణా వ్యవస్థను ఆధునికీకరించడంపై టీవీకే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి పార్థిబన్ తెలిపారు. తమిళనాడులోని ప్రతి మారుమూల గ్రామానికి కూడా బస్సు సౌకర్యం చేరాలన్నది తమ సీఎం లక్ష్యమని ఆయన చెప్పారు.

కొత్తగా కొనే ప్రతి బస్సులోనూ ప్రయాణికులకు అవసరమైన సదుపాయాలు ఉండాలని, ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రయాణించే అవకాశం కల్పించాలని సీఎం సూచించినట్లు మంత్రి పార్థిబన్ వెల్లడించారు.

"తమిళనాడు ప్రజలు ఏసీ బస్సుల్లో సౌకర్యవంతంగా ప్రయాణించాలని మా ముఖ్యమంత్రి కోరుకుంటున్నారు" అని రాష్ట్రంలోని వేడి, తేమతో





*తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వ బస్సులో ప్రయాణించిన సంగతి తెలిసిందే. గతవారం మొత్తం 127.21 కోట్ల వ్యయంతో కొనుగోలుచేసిన 300 కొత్త ప్రభుత్వ బస్సులను సీఎం ప్రారంభించారు. ఇందులో 164 డీజిల్ బస్సులు కాగా.., 136 బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా రూపొందిన సీఎన్జీ బస్సులు ఉన్నాయి. "తమిళనాడు ప్రజలు ఏసీ బస్సుల్లో సౌకర్యవంతంగా ప్రయాణించాలని మా ముఖ్యమంత్రి కోరుకుంటున్నారు" అని రాష్ట్రంలోని వేడి, తేమతో కూడిన వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్థిబన్ పేర్కొన్నారు.*

కూడిన వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్థిబన్ పేర్కొన్నారు.

అన్ని ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే పథకాన్ని అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని మంత్రి విలేకరులతో అన్నారు. ఈ విషయమై ఒక సమీక్షా సమావేశం కూడా నిర్వహించారని చెప్పారు. 'త్వరలోనే ముఖ్యమంత్రి ఒక ప్రకటన చేస్తారు'' అని మంత్రి తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి తమిళనాడు ముఖ్యమంత్రిగా దళపతి జోసెఫ్ విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన రోజే ఉచిత విద్యుత్ వంటి పథకాలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేశారు. అలాగే, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, మేనమామ బంగారు ఉంగర పథకం వంటివి తీసుకొచ్చారు. కాగా, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వ బస్సులో ప్రయాణించిన సంగతి తెలిసిందే. గతవారం మొత్తం 127.21 కోట్ల వ్యయంతో కొనుగోలుచేసిన 300 కొత్త ప్రభుత్వ బస్సులను సీఎం ప్రారంభించారు. ఇందులో 164 డీజిల్ బస్సులు కాగా.., 136 బీఎస్6 ప్రమాణాలకు అనుగుణంగా రూపొందిన సీఎన్జీ బస్సులు ఉన్నాయి. రవాణా అనుసంధానాన్ని మెరుగుపరచడానికి,

ప్రయాణికుల నిరీక్షణ సమయాన్ని తగ్గించడానికి, కోయంబేడు, కిళంబాక్కం వంటి కీలక ప్రాంతాల్లో కొత్త బస్సులను మోహరించారు. తమిళనాడులోని ప్రస్తుత ప్రజా రవాణా వ్యవస్థ, సౌకర్యాలను ఆధునీకరించడం, అలాగే రాష్ట్రవ్యాప్తంగా రవాణా సౌకర్యాల అనుసంధానాన్ని మెరుగుపరచడం టీవీకే ప్రభుత్వం లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే కొత్త బస్సుల్లో ఏసీ సదుపాయాలు ఉండాలని సీఎం భావిస్తున్నట్టు తెలిపారు.




### అమెరికా, ఇంగ్లండ్‌లో
## తీవ్ర హీట్ వేవ్స్

- 38 డిగ్రీలకు చేరే అవకాశం
- ఆరోగ్య సమస్యలు వస్తాయంటూ హెచ్చరికలు

**లండన్, జూన్ 30:** పశ్చిమ దేశాల్లో భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అమెరికాలోని బోస్టన్ నగరంతో పాటు న్యూ ఇంగ్లండ్ ప్రాంతమంతా ఈ వారం తీవ్రమైన హీట్‌వేవ్స్‌ను ఎదుర్కోనుందని అక్కడి అధికారులు చెబుతున్నారు. శక్తివంతమైన హీట్ డోమ్ ప్రభావంతో ఉష్ణోగ్రతలు 100 డిగ్రీల ఫారెన్ హీట్ అంటే సుమారు 38 డిగ్రీల సెల్సియస్ వరకు చేరే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. గాలిలో తేమ కారణంగా ఆ ఉష్ణోగ్రతలు మనకు 105 నుంచి 110 డిగ్రీల ఫారెన్‌హీట్ వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం జూలై 4 వరకు కొనసాగే అవకాశం ఉందని చెబుతున్నారు. అమెరికా నేషనల్ వెదర్ సర్వీస్ ప్రకారం బుధవారం నుంచి శనివారం వరకు మసాచుసెట్స్ రాష్ట్రం, న్యూ ఇంగ్లండ్‌లోని చాలా ప్రాంతాలకు ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరికలు జారీ చేసింది. కేప్ కాడ్, బెర్క్‌షైర్స్ ప్రాంతాల్లో అంత ఎక్కువగా ఉష్ణోగ్రతలు ఉండవని చెప్పింది.

నేషనల్ ఓషనిక్ అండ్ అట్మాస్పెరిక్ అడ్మినిస్ట్రేషన్ విడుదల చేసిన హీట్ రిస్క్ అంచనాల ప్రకారం గ్రేటర్ బోస్టన్ ప్రాంతం గురువారం నాటికి ఎక్స్‌ట్రీమ్ హీట్ రిస్క్ కేటగిరిలో వెళ్లనుంది. బోస్టన్‌లో ఈ హీట్‌వేవ్ కారణంగా గత రికార్డులు బద్దలయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గురువారం ఉష్ణోగ్రతలు 102 డిగ్రీల ఫారెన్ హీట్ వరకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పట వరకు అక్కడ నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత 98 డిగ్రీల ఫారెన్ హీట్. బోస్టన్ చరిత్రలో అత్యధిక ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారెన్ హీట్.. 1911 జూలై 4న నమోదైంది. జూలై 4 వరకు కొనసాగనున్న ఈ హీట్‌వేవ్స్ ఆ తర్వాత నెమ్మదిస్తాయని.. చల్లని గాలులు ప్రవేశించి, తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అమెరికా వాతావరణ శాఖ చెబుతోంది. అయితే అప్పటి వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మధ్యాహ్న సమయంలో ఎక్కువగా బయటకు రాకూడదని సూచించారు. వృద్ధులు, చిన్నారులు, బయట పనిచేసే కార్మికులు తీవ్రమైన వేడి వల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరి

## లీకుల మీద లీకులు...

- రాజస్థాన్‌లో పారామెడికల్ పేపర్ లీక్
- నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం

**జైపూర్, జూన్ 30:** డబుల్ ఇంజన్ సర్కార్ తో విద్యార్థులకు అనేక కష్టాలు వచ్చాయి. నీట్ పరీక్ష పేపర్ లీక్, సీబీఎస్ఈ పేపర్ మూల్యాంకనంలో అవకతవకలతో మోడీ పాలనపై విద్యార్థి లోకం ఆగ్రహంతో ఉంది. ఇటీవలె మహారాష్ట్రంలో టెట్ పేపర్ లీక్ అయింది. ఈ ఘటనలు మరువక ముందే బీజేపీ పాలిత రాష్ట్రం రాజస్థాన్ లో మరో పేపర్ లీకేజ్ వెలుగు చూసింది.యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ పారామెడికల్ పరీక్షల సందర్భంగా, ఎస్ కరణ్ కళాశాల పారామెడికల్ విభాగాధిపతితో సహా నలుగురిని అరెస్టు చేశారు. పరీక్షా హాలులో మోసానికి పాల్పడేందుకు వీలుగా పర్యవేక్షకులను నియమించి, సామూహిక మోసానికి పాల్పడేలా నిందితులు పథకం పన్నారని ఆరోపణలు ఉన్నాయి.

జైపూర్ పోలీసుల ప్రకారం.. జైపూర్‌లోని ప్రభా దేవి మెమోరియల్ పీజీ కళాశాల




పరీక్షా కేంద్రంలో మోసానికి పాల్పడేందుకు వీలుగా నిందితులు సుమారు 4045 మంది అభ్యర్థుల నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. అరెస్టు అయిన వారిని ఎస్ కరణ్ కళాశాల పారామెడికల్ విభాగాధిపతి కృష్ణ కుమార్ సైని, ఎస్ కరణ్ కళాశాలలోని రేడియాలజీ విభాగంలో లెక్చరర్ అయిన శంకర్ లాల్ జాట్, ప్రభా మెమోరియల్ పీజీ కళాశాలకు చెందిన రామకృష్ణ మండివాల్, ప్రభా మెమోరియల్ పీజీ కళాశాల అడ్మినిస్ట్రేటర్ దేవకృష్ణ మండివాల్‌గా గుర్తించారు.

జూన్ 29న ప్రారంభం కానున్న పారామెడికల్ పరీక్షల సమయంలో విద్యార్థులకు సహాయం చేస్తామని వాగ్దానం చేసి ఒక ముఠా వారి నుండి డబ్బు వసూలు చేస్తోందని జూన్ 27న పోలీసులకు సమాచారం అందిందని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (జైపూర్ వెస్ట్) ప్రశాంత్ కిరణ్ తెలిపారు. మొదటి సంవత్సరంలో బ్యాక్‌లాగ్‌లు ఉన్న అభ్యర్థులను పరీక్షలో ఉత్తీర్ణులుగా చేసేందుకు నిందితులు జైపూర్ పరీక్షా కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకున్నారని ఆయన చెప్పారు. ఈ సమాచారం ఆధారంగా, ముఠా సభ్యులను పట్టుకోవడానికి ఖోరబిసల్ పోలీస్ స్టేషన్ నుండి ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

## పెట్రో ఉత్పత్తులపై ఆంక్షల ఎత్తివేత

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయం
- జులై ఒకటి నుంచి అమల్లోకి

**న్యూఢిల్లీ,జూన్ 30 ,(ఎ.ఎం.ఎస్):** పశ్చిమాసియాలో సంఘర్షణ కారణంగా ప్రపంచ సరఫరా గొలుసులకు ఏర్పడిన అంతరాయాల నేపథ్యంలో స్థానిక ఇంధన కొరతను నివారించడానికి జూన్ నెల ప్రారంభంలో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై విధించిన తాత్కాలిక ఆంక్షలను ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జులై 1 నుంచి ఇది అమల్లోకి వస్తుందని సోమవారం జారీ చేసిన ఒక ఉత్తర్వులో పేర్కొంది. పెట్రోలియం ఉత్పత్తుల ప్రస్తుత సరఫరా పరిస్థితిని సమీక్షించిన ప్రభుత్వం ఈ ఆంక్షలు 'ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఇకపై అవసరం లేదని' నిర్ధారణకు వచ్చినట్లు పేర్కొంది. ఈ ఆంక్షల వల్ల పారిశ్రామిక, వాణిజ్య, సంస్థాగత వినియోగదారులు రిటెయిల్ బంకుల నుంచి పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయడానికి వీల్లేకుండా ఉండేది. బదులుగా, వారంతా కేవలం గుర్తింపు పొందిన బల్క్ సరఫరాదారుల నుంచి మాత్రమే ఇంధనాన్ని కొనుగోలు చేయాలనే నిబంధన ఉండేది.

జూన్ 12న 'మోటార్ స్పిరిట్ అండ్ హై స్పీడ్ డీజిల్ (రిటైల్ అవుట్‌లెట్ల ద్వారా



సరఫరా తాత్కాలిక నియంత్రణ) ఉత్తర్వు, 2026' కింద ఈ తాత్కాలిక నిబంధనలను ప్రవేశపెట్టారు. ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థలు నిర్వహించే రిటైల్ బంకుల ద్వారా పెట్రోల్, డీజిల్ విక్రయాలను, పంపిణీని క్రమబద్ధీకరించడానికే ఈ ఆంక్షలు విధించినట్లు ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వం ప్రకారం.. 'మోటార్ స్పిరిట్, హై స్పీడ్ డీజిల్ సరఫరాలను కొనసాగించడానికి, వాటి సమాన పంపిణీ, సరసమైన ధరలకు లభ్యతను నిర్ధారించడానికి ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ ఆంక్షలు అవసరమైనవి, సముచితమైనవిగా పరిగణించారు. అయితే, దేశీయ ఇంధన సరఫరా పరిస్థితిని సమీక్షించిన అనంతరం.. "సదరు ఉత్తర్వులోని ఆదేశాలను కొనసాగించడం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఇకపై అవసరం లేదని కేంద్రం సంతృప్తి చెందింది'' అని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, ఇంధన రిటైలర్లు.. పెట్రోల్ బంకుల నుంచి జరిగే బల్క్ కొనుగోళ్లను గరిష్ఠంగా 90 రోజుల పాటు నియంత్రించాలని కూడా జూన్ 12 నాటి ఉత్తర్వుల్లో కేంద్రం ఆదేశించింది. 'ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలపై ప్రభావం చూపుతున్న ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఈ ఉత్తర్వులను జారీ చేశారు. ఆ పరిస్థితుల వల్లే అంతర్జాతీయ పెట్రోలియం సరఫరా గొలుసు, షిప్పింగ్ లాజిస్టిక్స్, పెట్రోలియం ఉత్పత్తుల లభ్యతకు తీవ్ర అంతరాయం కలిగింది' అని తెలిపింది. ధరలలో ఉన్న భారీ వ్యత్యాసం కారణంగా బల్క్ వినియోగదారులు తమ కొనుగోళ్లను రిటైల్ పెట్రోల్ బంకులకు మార్చడంతో.. ముఖ్యంగా డీజిల్‌కు అసాధారణమైన డిమాండ్ పెరిగింది అని కూడా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## విరిగిపడిన కొండచరియలు



*మయన్మార్‌లో రత్నాల గనిలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి చెందారు. 15 మంది గల్లంతయ్యారని ప్రభుత్వ మీడియా మంగళవారం తెలిపింది. కాచిన్ రాష్ట్రంలోని హపాకాంట్ ప్రాంతంలో ఆదివారం రాత్రి సమయంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జాడే (పచ్చ రాయి) కోసం సుమారు 20 మంది వెతుకుతున్నారు. ఆ సమయంలో వారిపై రాళ్ల కుప్ప ఒక్కసారిగా కూలిపోవడంతో ఐదుగురు మృతి చెందారు*

- మయన్మార్‌లో ఐదుగురు దుర్మరణం
- 15 మంది గల్లంతు

**హపాకాంట్, జూన్ 30:** మయన్మార్‌లో రత్నాల గనిలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి చెందారు. 15 మంది గల్లంతయ్యారని ప్రభుత్వ మీడియా మంగళవారం తెలిపింది. కాచిన్ రాష్ట్రంలోని హపాకాంట్ ప్రాంతంలో ఆదివారం రాత్రి సమయంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జాడే (పచ్చ రాయి) కోసం సుమారు 20 మంది వెతుకుతున్నారు. ఆ సమయంలో వారిపై రాళ్ల కుప్ప ఒక్కసారిగా కూలిపోవడంతో ఐదుగురు మృతి చెందారు. ఆ శిథిలాల కింద 15 మంది చిక్కుకుపోయారు అని ప్రభుత్వ మీడియా తెలిపింది. కొన్నిరోజులపాటు కురిసిన వర్షాల వల్ల అంతకుముందు తవ్విన గని వ్యర్థాల కుప్పలు కూలిపోవడంతో ఈ ఘటన చోటు చేసుకుందని 'ది గ్లోబల్ న్యూ లైట్ ఆఫ్ మయన్మార్' అని వార్తాపత్రిక పేర్కొంది.

వర్షా కాలంలో మయన్మార్ గనుల్లో ఇలాంటి ప్రాణ నష్టానికి సంబంధించిన ఘటనలు చోటు చేసుకోవడం సర్వసాధారణం. పేదలు పొట్టకూటి కోసం.. మైనింగ్ కార్యకలాపాల అనంతరం వదిలేసిన శిథిలాల నుంచి రత్నాల ముక్కలు ఏరుకుంటారు. ఇలా చిన్నాచితకా రత్నాలు ఏరుకునే పని చేస్తూనే ఎంతోమంది తమ ప్రాణాల్ని సైతం కోల్పోతున్నారని మీడియా వెల్లడించింది. కాగా, మయన్మార్‌లో భారీ స్థాయిలో నియంత్రణ లేకుండా మైనింగ్ తవ్వకంగా జరుగుతుంటుంది.

ఉత్తర కచిన్ రాష్ట్రం చైనాకు పొరుగు ఉన్న రాష్ట్రం. ప్రపంచంలోనే జేడైట్ గని అత్యధికంగా తవ్వకం ఉన్న రాష్ట్రంగా ఇది పేరుగాంచింది.

## మొజ్తాబా జాడేది..?

- తన తండ్రి అంత్యక్రియలకైనా వచ్చేనా?
- ఆయన ఆరోగ్యంపై పలు అనుమానాలు

**టెహ్రాన్, జూన్ 30:** అమెరికాఇజ్రాయిల్ దాడులలో మరణించిన తమ ప్రియతమ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు ఇరాన్ సన్నాహాలు చేస్తోంది. ఇప్పుడు అందరి దృష్టి ప్రస్తుత సుప్రీం నేత, అలీ ఖమేనీ కుమారుడు మొజ్తాబా ఖమేనీ పైనే ఉంది. ఆయన తమ ముందుకు తొలిసారిగా ఎప్పుడు వస్తారా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. అలీ ఖమేనీ మరణానంతరం సుప్రీం నేతగా నియమితుడైన మొజ్తాబా ఇప్పటి వరకూ ప్రజలకు కన్పించలేదు. దీంతో ఆయన ఆరోగ్యం, అధికారాలు, అధికార మార్పిడిపై ప్రజలలో అనుమానాలు, ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. అలీ ఖమేనీ చనిపోయి నాలుగు నెలలు దాటాయి. యుద్ధం కారణంగా ఆయన అంత్యక్రియలు వాయిదా పడుతూ వచ్చాయి. తాజాగా వచ్చే నెల 4న టెహ్రాన్‌లో అలీ ఖమేనీ అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు. ఖ్వోమ్‌లో ప్రదర్శనలు జరుపుతారు. ఇరాక్‌లోని పవిత్ర ప్రార్థనా స్థలాలలో పర్యటిస్తారు. జూలై 9న మష్హద్‌లో ఖమేనీ భౌతిక కాయాన్ని ఖననం చేస్తారు. మొజ్తాబా చేస్తున్న ప్రకటనలన్నింటినీ ప్రభుత్వ టెలి



విజన్‌లో చదివి వినిపిస్తున్నారు. ప్రభుత్వ మీడియా వెబ్‌సైట్లలో ఆ ప్రసంగ పాఠాలను పెడుతున్నారు. మార్చి నెల మధ్యలో తొలిసారిగా ప్రజలకు సందేశం ఇస్తూ శత్రువులపై ఒత్తిడి పెంచుతామని చెప్పారు. ఆ తర్వాత కూడా ఆయన ప్రకటనలన్నీ దాదాపుగా ఇదే ధోరణిలో కొనసాగుతూ అమెరికాపై ఆరోపణలు సంధించాయి. ఇటీవలి సందేశంలో... కాల్పుల విరమణ సమయంలో కూడా ప్రదర్శనలు నిర్వహించాలని, అందరూ సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## ముదురుతున్న సింధూ ఒప్పందం

- భారత్-పాక్ మధ్య తీవ్ర వివాదం
- పాకిస్తాన్ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

**ఇస్లామాబాద్, జూన్ 30:** భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న 'సింధూ నదీజలాల ఒప్పందం' వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ముఖ్యంగా దాయాది దేశానికి చెందిన ఓ మంత్రిపై భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కారు. ఇస్లామాబాద్‌లో నిర్వహించిన ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాక్ వాతావరణ మార్పుల శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్.. భారత్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సింధూ నదీ జలాల ఒప్పందం ప్రకారం తమకు దక్కాల్సిన నీటి వాటాను క్లెయిమ్ చేయడానికి భారత్ ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. "ఒకవేళ ఎవరైనా మా నీటి వాటాపై చేయి వేయాలని చూస్తే.. ఆ చేతులను నరికేస్తాం" అంటూ ఆయన తీవ్ర పదజాలంతో బెదిరింపులకు పాల్పడ్డారు. గతేడాది జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాకిస్థాన్‌కు ఉగ్రవాదులు ఘోరమైన దాడికి పాల్పడ్డారు. మీ మతం ఏంటని అడిగి మరీ.. 25 మంది అమాయక పర్యాటకుల ప్రాణాలు తీశారు. దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన ఓ స్థానికుడిని సైతం ఈ రాక్షసులు పొట్టనబెట్టుకున్నారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మౌలిక వసతుల లేమిపై మాజీ ఎమ్మెల్యే ఆందోళన



**మునగాల జూన్ 30 (వుదయం):**

మునగాల మండలం కలుకోవ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న ప్రజలకు కనీస మౌలిక వసతులు అందుబాటులో లేకపోవడంతో కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలోని పరిసరాలను పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి కొరత, సరైన విద్యుత్ సదుపాయం లేకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, రహదారులు దయనీయ స్థితిలో ఉండటం వంటి అనేక సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ, పేదల సంక్షేమం కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ తన వంతు కృషి చేస్తానని, అవసరమైతే ఉన్నతాధికారులను కలిసి సమస్యల పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తానని బొల్లం మల్లయ్య యాదవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తొగరు రమేష్, వ్యవసాయ సమితి అధ్యక్షులు సుంకర అజయ్ కుమార్, మునగాల పిఎసిఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, మునగాల గ్రామ శాఖ అధ్యక్షులు ఉడుం కృష్ణ, మరియు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే బిఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ వ్యక్తిగత విమర్శలు: పాలేరు బిఆర్ఎస్ శ్రేణుల ధ్వజం

**రైతు భరోసా, ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేకనే అధికార పక్షం దిగజారుడు రాజకీయాలు చేతనైతే 420 హామీలను అమలు చేయాలి; లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలి**

**పొంగులేటి అవినీతి అక్రమాలను సాక్ష్యాలతో సహా నిరూపించడానికి బిఆర్ఎస్ సిద్ధం**



**ఖమ్మం, వుదయం బ్యూరో జూన్ 30**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను, అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం మరియు జిల్లా నేతలపై చౌకబారు వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని పాలేరు నియోజకవర్గ బిఆర్ఎస్ ముఖ్య నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిన్న జిల్లాకు ముఖ్యమంత్రి వస్తున్న సందర్భంగా, రాష్ట్రంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై, ముఖ్యంగా రైతు సమస్యలపై బిఆర్ఎస్ జిల్లా అండ్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తాతా మధు సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే కాంగ్రెస్ నేతలు సోషల్ మీడియాలో, పత్రికా ముఖంగా దిగజారుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.ఈ మేరకు మంగళవారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల మాజీ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నేతలు సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించి కాంగ్రెస్ తీరును తీవ్రంగా ఖండించారు.లారీల వద్ద దళారీ వసూళ్లకు పాల్పడింది కాంగ్రెస్ నేతలే: బెల్లం వేణుగోపాల్బిఆర్ఎస్ ఖమ్మం రూరల్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్ మాట్లాడుతూ.. "మొన్నటి మొక్కజొన్న, వరి కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా బయటపడింది. బిఆర్ఎస్ హయాంలో అన్‌కండిషనల్‌గా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచాం. కానీ నేడు కనీసం సెంటర్స్ పెట్టడం, బస్తాలు ఇవ్వడం చేతకాని కాంగ్రెస్ నేతలు బిఆర్ఎస్ మీద విమర్శలు చేయడం సిగ్గుచేటు. గత 30 ఏళ్లుగా ఈ ప్రాంతంలో కొనుగోలు కేంద్రాలు పెట్టిన తర్వాత, లారీ డ్రైవర్ల వద్ద బస్తాకు 15 నుండి 20 రూపాయలు వసూలు చేయించిన దళారీ చరిత్ర కాంగ్రెస్‌ది. పాలేరు రైతాంగాన్ని అడిగితే ప్రతి బస్తాకు 60 రూపాయల చొప్పున, ఒక్కో లోడుకు రూ. 50,000 రైతుల నుండి అక్రమంగా వసూలు చేసిన పాపం మీకే దక్కుతుంది." అని ఆరోపించారు.రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నేతలు పది పార్టీలు మారారని, కానీ తాతా మధు గారు ఉన్నత చదువులకై అమెరికా వెళ్లి, కేసీఆర్ గారి విధానాలు నచ్చి పార్టీలో చేరి దశాబ్ద కాలంగా నిలకడగా కష్టపడి ఈ స్థాయికి వచ్చారని గుర్తు చేశారు. పొంగులేటి రాఘవరెడ్డి ఆస్తులపై, కాంగ్రెస్ నేతల భూకబ్జాలపై పిండిప్రోలు గ్రామ ప్రజలే సాక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా సవాల్: "పాలేరులో కరువును పారదోలి, మున్నేరుపై చెక్ డ్యామ్‌లు కట్టించి, తిరుమలాయపాలెం నుండి మొలకలపల్లి కోట వరకు బ్రిడ్జిలు నిర్మించిన ఘన చరిత్ర కందాల ఉపేందర్ రెడ్డి గారిది, బిఆర్ఎస్ పార్టీది. మంత్రికి, కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే ఇప్పుడే తమ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి రావాలి. 2027–28 వరకు ఆగాల్సిన అవసరం లేదు, ఇప్పుడే ఉపేందర్ రెడ్డి గారిపై పోటీ చేసి గెలవాలని సవాల్ విసురుతున్నాం. ఒకవేళ కాంగ్రెస్ గెలిస్తే మేము మా పదవులకు కుట్టు వేసుకుని తిరుగుతాం, లేదంటే పాలేరు ప్రజల సత్తా ఏంటో చూపి స్తాం."అని వేణుగోపాల్ధ్వజమెత్తారు. మహిళలను కించపరిస్తే సహించేది లేదు: భాషబోయిన వీరన్నబిఆర్ఎస్ తిరుమలాయపాలెం మాజీ మండల పార్టీ అధ్యక్షులు భాషబోయిన వీరన్న మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సభకు సంబంధించి ఎమ్మెల్సీ తాతా మధు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగడం వారి రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమన్నారు. "వందల కొద్దీ దౌర్జన్యాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లు, మైనింగ్ అక్రమ కేసులు, సొంత కుమారుడిపై వాచీల దొంగతనం కేసులు ఉన్న కాంగ్రెస్ నేతలు, అవినీతి రహితంగా పనిచేసిన తాతా మధు గారిపై మాట్లాడటం హాస్యాస్పదం. డబ్బుల కోసం నాడు రాత్రికి రాత్రే కండువాలు మార్చిన తుక్కు బ్యాచ్ అంతా నేడు అధికార అహంకారంతో విర్రవీగుతోంది."

## పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా కల్యాణ లక్ష్మి

**ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ చేతుల మీదుగా అందజేత**



**సూర్యాపేట, జూన్ 30: వుదయం ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల కుటుంబాలకు అందిస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి సూచించారు.మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూర్ (ఎస్), చివ్వెంల, పెన్‌పహాడ్, సూర్యాపేట అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 150 మంది లబ్ధిదారులకు రూ.1,50,17,400 విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మాట్లాడుతూ "కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయి. వీటిని ప్రతి ఒక్క పేదింటి మహిళ సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణు రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత, సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్



**దమ్మపేట జూన్ 30 (వుదయం ప్రతినిధి ):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మద్దులగూడెం గ్రామంలో పోలింగ్ కేంద్రాన్నిఅదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ సందర్శించి ఇట్టి సర్ ప్రక్రియ పూర్తి చేయుటకు సందేశించి దమ్మపేట మండలం చాలా అద్భుతమైన పనితీరు కనబరుచున్న బూత్ స్థాయి అధికారులను అభినందించారు . మరియు ఇదేవిధంగా ఇట్టి ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమం లో దమ్మపేట తాసిల్దార్ రామ్ నరేష్, మండల గిర్దావర్ భిక్షమయ్య, ఎలక్షన్ సూపర్వైజర్ రెడ్డి నరసింహారావు, షేక్ జలీల్ పాషా జీపీఓ పూనెం రామకృష్ణ ,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మేడారం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు, జూన్ 30 (వుదయం ప్రతినిధి) :**

మేడారం జాతర అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, పారిశుధ్య నిర్వహణ మరియు వన మహోత్సవ కార్యక్రమాలను సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, వన మహోత్సవ కార్యక్రమాలు తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మేడారం హరిత హోటల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మేడారం పరిసర ప్రాంతాల్లో వన మహోత్సవ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహించి, మొక్కలు నాటే కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని అన్నారు. జిల్లా పంచాయతీ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, కార్యనిర్వాహక అధికారులు పరస్పర సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచిం చారు. అటవీ శాఖ నర్సరీల నుంచి మొక్కలను అందుబాటులోకి తీసుకువచ్చి నాటేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.మేడారం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్, ఎం. సంపత్ రావు, జిల్లా పంచాయతీ అధికారి, పంచాయతీరాజ్ ఈఈ, మేడారం పూజారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యలో రాజీ ఉండొద్దు

**పాఠశాలల్లో ఆహార నాణ్యత, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 30 (వుదయం ప్రతినిధి)ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, పోషకాహారం, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన మౌలిక వసతులు తప్పనిసరిగా అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జూలూరుపాడు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాలతో పాటు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించిన ఆయన, కంప్యూటర్ ప్రయోగశాల, తరగతి గదులను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. వారికి అందుతున్న విద్యా సౌకర్యాలు, వసతి, భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు. కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినుల బయటకు వెళ్లే నమోదు పుస్తకాన్ని పరిశీలించిన కలెక్టర్, తల్లిదండ్రులు లేదా అధికారికంగా అనుమతి పొందిన సంరక్షకులతో మాత్రమే విద్యార్థినులను బయటకు పంపాలని సూచించారు. అనంతరం వంటశాలను పరిశీలించి విద్యార్థులకు అందించనున్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. నిల్వ గదిలో ఉన్న సరుకులను పరిశీలించి వాటి నాణ్యతపై ఆరా తీశారు.పాఠశాలలో ఏర్పాటు చేసిన శుద్ధ తాగునీటి కేంద్రం మరమ్మతులు ఆలస్యం కావడంపై వివరాలు తెలుసుకుని, వెంటనే మరమ్మతులు పూర్తి చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే నిఘా కెమెరాల పనితీరును పరిశీలించి ఉపాధ్యాయుల హాజరు నమోదును తనిఖీ చేశారు.అనంతరం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల నమోదు, హాజరు వివరాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన సందర్భంగా పప్పు పలుచగా ఉండటంతో పాటు నాణ్యత లోపించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం పరిశుభ్రంగా, పోషక విలువలతో, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. మళ్లీ ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తానని, లోపాలు పునరావృతమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందాయా అనే విషయాన్ని కూడా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తాగునీరు, పరిశుభ్రత, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలల్లో గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్ది విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు మరింత విశ్వాసం పెరిగేలా విద్యా ప్రమాణాలు, పరిశుభ్రత, మౌలిక వసతులు, పోషకాహార నాణ్యతను మరింత మెరుగుపర్చాలని సూచించారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ శ్రీనివాస్, మండల అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి, మండల విద్యాధికారి జుంకీలాల్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మానవతా దృక్పథంతో అండగా నిలిచిన జిల్లా కలెక్టర్

**అంగవైకల్యంతో బాధపడుతున్న పర్శ సాయి కుటుంబానికి జీవనోపాధి కోసం టాటా ఏసీ వాహనం మంజూరు**

**రూ. 4 లక్షల చెక్కును తల్లిదండ్రులకు అందజేసిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ, జూన్ 30 (వుదయం ప్రతినిధి) :**

అంగవైకల్యంతో బాధపడుతున్న జనగామ పట్టణానికి చెందిన పర్శ సాయి కుటుంబానికి శాశ్వత జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మానవతా దృక్పథంతో స్పందించి టాటా ఏసీ వాహనం మంజూరు చేయించారు. ఇందుకోసం రూ. 4 లక్షల విలువైన చెక్కును మంగళవారం, కలెక్టర్ కార్యాలయంలో పర్శ సాయి తల్లిదండ్రులకు జిల్లా కలెక్టర్ అందజేశారు.ఇటీవల పర్శ సాయి తల్లిదండ్రులు తమ కుటుంబ పరిస్థితిని వివరిస్తూ, జీవనోపాధి కోసం సహాయం చేయాలని జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని, అంగవైకల్యం కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న కలెక్టర్ వెంటనే స్పందించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి, టాటా ఏసీ వాహనం మంజూరుకు చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల లక్ష్యం.. నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచి వారి జీవితాల్లో స్థిరమైన మార్పు తీసుకురావడమేనని అన్నారు. అందిస్తోన్న ఈ టాటా ఏసీ వాహనాన్ని సద్వినియోగం చేసుకొని, స్వయం ఉపాధి పొందాలని, వాహనం ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్నిఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని సూచించారు. వాహనం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఇంటి ఖర్చులు, కుటుంబ అవసరాలు, పర్శ సాయి సంరక్షణ కోసం వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ అందించిన ఈ సహాయంపై పర్శ సాయి తల్లిదండ్రులుపర్శ సాయి తల్లిదండ్రులు పర్శ లక్ష్మి, పర్శ సాయి మల్లయ్య హర్షం వ్యక్తం చేస్తూ, తమ వినతికి వెంటనే స్పందించి, జీవనోపాధి కల్పించిన కలెక్టర్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు.

## పీహెచ్ డీ పట్టా పొందిన అనూషను సన్మానించిన ఎమ్మెల్యే



**హసన్ పర్తి జూన్30 (వుదయం ప్రతినిధి):**

ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇండోర్ సోషియాలజీ విభాగ పరిశోధక విద్యార్థి రేణికుంట్ల అనూష పిహెచ్ డి పట్టాను స్వీకరించారు. హనుమ కొండ జిల్లా హసన్ పర్తి మండలం జయగిరి గ్రామనికి చెందిన రేణికుంట్ల ఎలేంద్ర అశోక్ దంపతుల కూతురు అనూష యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ అంశం మీద పరిశోధన సోషియాలజీ విభాగంలో డాక్టర్ అశోక్ కుమార్ మోచెర్ల పర్యవేక్షణలో పూర్తి చేశారు. జయగిరికి చెందిన రేణిగుంట్ల అనుష యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ లో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్నారు. మంగళవారం వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ ఫలాలతో పిహెచ్ డి డాక్టరేట్ కంప్లీట్ చేసినందుకు అనూష ను అభినందించి, బీఆర్ అంబేద్కర్ ప్రతిమను అనూష కు బహుకరించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనూష తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం పట్టణంలోని అన్ని కాలనీల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరిస్తాం – సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట



**భద్రాచలం, 30 జూన్ 2026, వుదయం ప్రతినిధి**

ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, పారిశుధ్యవంతమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడం ప్రభుత్వ బాధ్యత అని, ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని భద్రాచలం సబ్ కలెక్టర్, భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి మృనాల్ శ్రేష్ట స్పష్టం చేశారు. భద్రాచలం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు, పూడుకుపోయిన డ్రైనేజీలు, పేరుకుపోయిన చెత్తాచెదారం, దోమల వ్యాప్తి వంటి సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ ద్వారా అత్యవసర ఆదేశాలు జారీ చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించేందుకు సోమవారం రాత్రి సబ్ కలెక్టర్ ఇందిరానగర్ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా బీఎల్వోలు, సూపర్వైజర్ల పనితీరును పరిశీలిస్తూ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు.స్థానిక మహిళలు, వృద్ధులు, యువకులు కాలనీలో నెలకొన్న సమస్యలను సబ్ కలెక్టర్‌కు వివరించారు. చాలా రోజులుగా డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి తీవ్ర దుర్వాసన వస్తోందని, దోమల ప్రబలంతో చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అనేక చోట్ల చెత్తాచెదారం పేరుకుపోవడంతో పరిశుభ్రమైన వాతావరణం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.కాలనీలోని విద్యుత్ తీగలు చాలా తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా వేలాడుతూ ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయంతో జీవిస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉందని, చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.ప్రజల వినతిని శ్రద్ధగా విన్న సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆలస్యం చేయకుండా విద్యుత్ శాఖ అధికారులు, గ్రామపంచాయతీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అత్యవసర చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే అంశాలపై నిర్లక్ష్యం సహించబోమని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు.ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం నుంచే విద్యుత్ శాఖ సిబ్బంది కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయడం, విద్యుత్ స్తంభాలను పరిశీలించడం, అవసరమైన మరమ్మతులు చేపట్టడం ప్రారంభించారు. గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టి డ్రైనేజీలలో పేరుకుపోయిన పూడికను తొలగించారు. కాలనీలోని చెత్తాచెదారాన్ని తరలించి రోడ్లను శుభ్రపరిచారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలు కూడా చేపట్టారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు ప్రభుత్వానికి విలువైన సమాచారమే. అధికారులు కార్యాలయాల్లో కూర్చోవడం కాకుండా ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలి. ప్రజలకు ఇబ్బందులు కలిగించే చిన్న సమస్యను కూడా నిర్లక్ష్యం చేయరాదు" అని సూచించారు.భద్రాచలం పట్టణంలోని అన్ని కాలనీల ప్రజలు తమ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, మురుగు కాలువలు, విద్యుత్ తీగలు, వీధిదీపాలు, తాగునీటి సరఫరా, రహదారులు లేదా ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలు ఉంటే సంబంధిత శాఖలకు లేదా రెవెన్యూ అధికారుల దృష్టికి వెంటనే తీసుకురావాలని ఆయన కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన, సురక్షితమైన, అభివృద్ధి చెందిన భద్రాచలాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా కళాశాలల బంద్

**30-06-2026 | నల్గొండ**



బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా వ్యాప్తంగా కళాశాలల బంద్ విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. బంద్‌కు సహకరించిన కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, ప్రజాసంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.10,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలు, కళాశాలలకు సొంత భవనాలు నిర్మించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు.జీవో నెం. 8, 9 వల్ల విద్యార్థుల్లో గందరగోళం నెలకొందని, వాటిని వెంటనే రద్దు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఫీజు బకాయిల కారణంగా కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయకుండా గత 18 సంవత్సరాలుగా అమలులో ఉన్న విధానాన్నే కొనసాగించాలని కోరారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే జూలై మొదటి వారంలో హైదరాబాద్‌లో ఐదు లక్షల మంది విద్యార్థులతో భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రజక అభివృద్ధి సంస్థ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు సతీష్, విద్యార్థి సంఘం నాయకులు కొంపల్లి రామన్న గౌడ్, అనంత నాగరాజు గౌడ్, గడగోజు విజయాచారి, నాగేష్, హరి ప్రసాద్, కృష్ణ, మహేష్, శివ, మధు, మల్లేష్, నరేష్, పృథ్వీరాజ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## పోలీసు శాఖలో విశిష్ట సేవలందించిన నలుగురు అధికారులకు ఘన వీడ్కోలు

**శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించి సాదరంగా సాగనంపిన జిల్లా ఎస్పీ**

**కామారెడ్డి, జూన్ 30 (ఉదయం ప్రతినిధి):**

పోలీసు శాఖలో మూడు దశాబ్దాలకు పైగా నిస్వార్థంగా, అంకితభావంతో ప్రజలకు సేవలందించి పదవి విరమణ పొందుతున్న అధికారుల సేవలు వెలకట్టలేనివని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర కొనియాడారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ పొందుతున్న అధికారులకు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పదవీ విరమణ పొందిన అధికారులను, వారి సతీమణులను శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల రక్షణే ధ్యేయంగా కుటుంబాలకు దూరంగా ఉంటూ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని విధులు నిర్వర్తించడం పోలీసు వృత్తిలో అత్యంత గొప్ప సేవ అని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో ఈ అధికారులు చేసిన కృషి పోలీసు శాఖకు గర్వకారణమని అన్నారు.పదవీ విరమణ పొందిన అధికారులు ఎండీ ఉస్మాన్ – ప్రస్తుతం సీసీఎస్, కామారెడ్డిలో ఎస్ఐగా 36 సంవత్సరాలు సేవలందించారు. దత్తాద్రిగౌడ్ – ప్రస్తుతం దేవన్‌పల్లి పోలీస్ స్టేషన్ లో ఎస్ఐగా 36 సంవత్సరాలు సేవలందించారు. కె. శంకర్ – ప్రస్తుతం బీర్కూర్ పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐగా 35 సంవత్సరాలు సేవలందించారు. ఎస్.కె. అహ్మద్ – ప్రస్తుతం రాజంపేట్ పోలీస్ స్టేషన్ లో



హెడ్ కానిస్టేబుల్ గా 35 సంవత్సరాలు సేవలందించి పదవీ విరమణ పొం దారు. ఈ నలుగురు అధికారులు కానిస్టేబుళ్లుగా తమ పోలీసు ప్రస్థానాన్ని ప్రారంభించి, క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ శాఖకు విశిష్ట సేవలందించారని జిల్లా ఎస్పీ ప్రశంసించారు. వారి సేవా స్ఫూర్తి, వృత్తిపట్ల నిబద్ధత, ప్రజాసేవ పట్ల అంకితభావం నేటి యువ పోలీసు సిబ్బందికి ఆదర్శం గా నిలుస్తుందని పేర్కొన్నారు.పదవీ విరమణ అనంతరం వారు కుటుంబ సభ్యులతో కలిసి సంపూర్ణ ఆరోగ్యంతో, సుఖసంతోషాలతో, ఆనందమయ జీవితాన్ని గడపాలని జిల్లా ఎస్పీ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

## ప్రభుత్వ బీమా పరిహారం అంద జేత

**మృతుడి భార్యకు రూ. 2 లక్షల చెక్కు పంపిణీ**

**బాధిత కుటుంబానికి అండగా సహకార బ్యాంక్**

**ధర్మపురి జూన్ 30(ఉదయం ప్రతినిధి):**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జీవన జ్యోతి బీమా పథకం ఒక పేద కుటుంబానికి కొండంత అండగా నిలిచింది. ఇటీవల మరణించిన పథకదారుడి కుటుంబానికి ఈ పథకం కింద మంజూరైన రూ. 2 లక్షల బీమా చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. రాయపట్నం గ్రామానికి చెందిన రాందేని. లక్ష్మణ్ ఇటీవల ఆకస్మికంగా మరణించారు. ఆయన స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ధర్మపురి శాఖలో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా పథకం కింద పేరు నమోదు చేసుకున్నారు. లక్ష్మణ్ మృతితో నిరుపేద కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడటాన్ని గమనించిన బ్యాంక్ అధికారులు, త్వరితగతిన బీమా ప్రక్రియను పూర్తి చేశారు. పథకం నిబంధనల ప్రకారం మంజూరైన రెండు లక్షల రూపాయల బీమా పరిహారాన్ని మృతుడి భార్య రాందేని.శతవ్వకు బ్యాంక్ ఉన్నతాధికారుల చేతుల మీదుగా అందజేశారు. బ్యాంక్ ఉప ప్రధాన మేనేజర్ ఎన్. సత్యప్రసాద్, ధర్మపురి శాఖాధికారి ఎం.శ్రీలక్ష్మి , క్షేత్రస్థాయి అధికారి బి.చంద్రశేఖర్ రెడ్డి, సీఈఓ అయ్యోరి. రాజేష్ కలిసి లబ్ధిదారుల కు అందజేశారు.



ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు మాట్లాడు తూ ప్రతి ఒక్కరూ బ్యాంకుల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రత బీమా పథకాలను సద్వినియోగం చేసుకో వాలని కోరారు. స్వల్ప రుసుము తో లభించే ఇటువంటి పథకాలు ఆపత్కాలంలో కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇస్తాయని పేర్కొన్నారు. లక్ష్మణ్ కుటుంబానికి సకాలంలో బీమా సొమ్ము అందడంపై స్థానికులు బ్యాంక్ అధికారుల చొరవను అభినందించారు.

## జిల్లాలో యూరియా కొరత లేదు

**రైతులు ఆందోళన చెందొద్దు.. కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల, జూన్ 30 {ఉదయం ప్రతినిధి}:**

జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఫెర్టిలైజర్ యాప్, ఎరువుల సరఫరాపై మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో 19,513 మంది రైతులు ఫెర్టిలైజర్ యాప్ ద్వారా 60,254 యూరియా సంచులను బుక్ చేసుకున్నారని తెలిపారు. ఇందులో 50,283 సంచులను రైతులు సమీప డీలర్ల నుంచి తీసుకెళ్లగా, మరో 9,830 సంచులు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 12,292 యూరియా సంచులు నిల్వ ఉన్నాయని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 20 రైతు వేదికలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఫెర్టిలైజర్ యాప్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని, నిల్వలు కనిపించకపోతే రిఫ్రెష్ చేసి పరిశీలించాలని రైతులకు సూచించారు.యూరియా సరఫరాలో ఎలాంటి సమస్యలు ఎదురైనా సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మొద్దని, పంటల అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు.ఈ సీజన్‌కు అవసరమైన ఎరువుల నిల్వలను సిద్ధంగా ఉంచాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. ఎరువులు పక్కదారి పట్టకుండా పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా పర్యవేక్షించాలని సూచించారు.ఈ సమావేశంలో డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ అధికారి హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ నేషనల్-చీఫ్ నితిన్ నబిన్‌ను కలిసిన బీజేపీ నాయకులు

**కరీంనగర్ జూన్30 (ఉదయం ప్రతినిధి):**

హైదరాబాద్ వేదికగా రోజున జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో పాల్గొన్న కరీంనగర్ బిజెపి జిల్లా అధ్యక్షుడుగంగాడి కృష్ణారెడ్డి , నగరపాలక సంస్థ మేయర్ కోలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, లు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకుని, మేయర్ పీఠాన్ని దక్కించుకున్నందుకు నితిన్ నబిన్ మేయర్ కొలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులతో పాటు జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిని ప్రత్యేకంగా అభినందించి, శాలువాతో సన్మానించారు. కరీంనగర్ నగరపాలక సంస్థకు మంచి గుర్తింపు తీసుకువచ్చేలా, ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా పనిచేయాలని మేయర్, డిప్యూటీ మేయర్లకు నితిన్ నబిన్ సూచించారు. అలాగే బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర పార్టీ ఇన్చార్జి సునీల్ బన్సల్ ను కూడా ఈసందర్భంగామర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో మొట్టమొదటిగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను కైవసం చేసుకోవడం పట్ల సునీల్ బన్సల్ సంతోషాన్ని వ్యక్తం చేసి, వారిని అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంలోబిజెపి నీ అధికారంలోకి తీసుకురావడానికి కరీంనగర్ జిల్లా బిజెపి శ్రేణులతో కలిసి తగిన కార్యాచరణతో ముందు కొనసాగుతామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడిచిపోయిందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను , ముఖ్యంగా 6 గ్యారంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై తీవ్ర ప్రజా వ్యతిరేకత మొదలైందని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎవరు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ అభివృద్ధి కేవలం బిజెపి తోనే సాధ్యమని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తుందన్నారు. అభివృద్ధి చెందాలంటే డబల్ఇంజన్సర్కారే రావాలనే ఆకాంక్ష ప్రజల్లో ఏర్పడిందన్నారు. తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## అధ్యాపకులే విద్యార్థుల విజయానికి మార్గదర్శులు

**మ్యాథ్స్ లెక్చరర్ల ఓరియంటేషన్‌లో కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, ఉదయం ప్రతినిధి:**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా ఇంటర్మీడియేట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మ్యాథ్స్ లెక్చరర్ల ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీస్తూ ఉన్నత శిఖరాలకు చేర్చే బాధ్యత అధ్యాపకులదేనని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని బోధనా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న నెల రోజుల శిక్షణలో నేర్చుకున్న ఆధునిక బోధనా విధానాలను తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేసి ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి జాదవ్ గణేష్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ టి. అరుణ్ కుమార్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీబీవీల లెక్చరర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.అవసరమైతే దీన్ని ఇంకా చిన్నదిగా లేదా మరింత ఈనాడు శైలిలో లీడ్‌తో మార్చి ఇవ్వగలను.

## ఉద్యోగ విరమణ పొందుతున్న ఎస్‌బీ డీఎస్పీ వెంకటరమణకు సన్మానం...



**జగిత్యాల జూన్ 30 (ఉదయం ప్రతినిధి)**

జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) డీఎస్పీ శ్రీ వెంకటరమణ ఉద్యోగ విరమణ సందర్భంగా జగిత్యాల పట్టణంలోని వీకేబీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ హాజరై వెంకటరమణని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో వెంకటరమణ ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావంతో నిజాయితీతో క్రమ శిక్షణతో సేవలందించారని కొనియాడారు తన విధి నిర్వహణలో సమర్థత బాధ్యతాయుతమైన వ్యవహారశైలి సహోద్యోగులతో సత్సంబంధాలు కలిగి శాఖకు మంచి గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు ఉద్యోగ విరమణ అనేది సేవా జీవితానికి ముగింపు మాత్రమేనని సమాజ సేవకు కాదని ఎస్పీ అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా సహచర అధికారులు పోలీస్ సిబ్బంది వెంకటరమణతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన సేవలను ప్రశంసించారు అనంతరం పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ డీఎస్పీ పురుషోత్తం రెడ్డి రాములు ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్ సుధాకర్ కరుణాకర్ రవి లక్ష్మీనారాయణ వేణు ఎస్ఐ లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వేములవాడ అభివృద్ధికి మరో అడుగు

**41 అజెండా అంశాలకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం**

**--వర్షాకాలంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి..**

**డ్రైనేజీలు, మొదలగు వెంటనే పరిష్కరించాలి: చైర్మన్ పుల్కం రాజు**



**వేములవాడ, జూన్ 30 {ఉదయం ప్రతినిధి} :**

వేములవాడ పట్టణ అభివృద్ధి దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన మంగళవారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన 41 అజెండా అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సుదీర్ఘ చర్చ అనంతరం సభ్యులందరూ తీర్మానాలకు మద్దతు పలికారు. సమావేశం అనంతరం చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా వేములవాడ సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో పట్టణానికి అవసరమైన నిధులను తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని, ప్రతి వార్డులో డ్రైనేజీలను నిరంతరం శుభ్రం చేసి వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు.అలాగే పట్టణంలోని వీధి దీపాల సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రస్ట్ సేవలు అభినందనీయం: ఎస్సై ఉదయ్ కిరణ్

**జన్నారం, జూన్ 30(ఉదయం విలేఖరి)**

నిరుపేద పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న "రిలయబుల్" ట్రస్ట్ సేవలు అభినందనీయమని జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ అన్నారు.మంగళవారం జన్నారం మండలంలోని రాంపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలోరాంపూర్,తిమ్మాపూర్,తపాలాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలకుచెందిన 380మంది విద్యార్థులకు రూ.2లక్షల విలువైన విద్యా, క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఉదయ్కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వ ర్యంలో విద్యా, క్రీడా సామాగ్రి అందజేయడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని చదువుల్లో, క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

## గోదావరి పుష్కర భక్తులకు వసతుల కల్పనే లక్ష్యం మంత్రి అడ్లూరి

**బాసర నుంచి భద్రాచలం వరకు వెయ్యి కోట్లతో అభివృద్ధి**

**ధర్మపురి క్షేత్రానికి రూ.117 కోట్లు కేటాయింపు**

**కన్సల్టెన్సీ ప్రతినిధులతో కలిసి గోదావరి తీరాన్ని పరిశీలించిన మంత్రి లక్ష్మణ్ కుమార్**

**ధర్మపురి, జూన్30 (ఉదయం ప్రతినిధి):**

2027లో రానున్న గోదావరి పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా,సకల సదుపాయాలు కల్పించ డమే ప్రభుత్వ ధ్యేయమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.మంగళవారం ధర్మ పురిలోని గోదావరి తీరాన్ని సందర్శిం చారు.పుష్కర ఘాట్లు,భక్తుల రద్దీ నియంత్రణ,మౌలిక వసతుల కల్పనపై ప్రైవేట్ కన్సల్టెన్సీ ప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి,పలు సూచన లు చేశారు.ఈ సందర్భంగా మం త్రి మాట్లాడుతూ రాబోయే పుష్క రాలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మ కంగా,వైభవంగా నిర్వ హించబోతోందని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచు కుని బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీర ప్రాంతాల్లోని ఆలయాల అభి వృద్ధికి, ఘాట్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.వెయ్యి కోట్లు కేటాయించిందని స్పష్టం చేశారు.దీనిలో భాగంగా పవిత్ర పుణ్యక్షేత్రమైన ధర్మపురి నియోజకవర్గానికి రూ.117 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.గత అనుభవాలతో పక్కా ప్రణా ళికలు,పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు తాగునీరు, దుస్తులు మార్చుకునే డ్రెస్సింగ్ రూమ్స్, శౌచాలయాల కొరత రాకుండా పక్కా ఏర్పాట్లు చేస్తామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం గతంలో గోదావరి, కృష్ణా పుష్కరాలకు పనిచేసిన అనుభవ జ్ఞులైన సాంకేతిక నిపు ణులు,కన్సల్టెన్సీ ప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీల న చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.గోదా వరి తీరంలో చేపట్టాల్సిన శాశ్వత, తాత్కాలిక మౌలిక సదుపాయా లపై కన్సల్టెన్సీ ప్రతినిధులు త్వర లోనే పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తారని,ఈ నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రితో మా ట్లాడి ధర్మపురి క్షేత్రానికి మరింత అదనపు నిధులు తీసుకువస్తామ న్నారు.ఈ కార్యక్ర మంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగ నభట్ల.దినేష్,నాయకులు వేముల రాజేష్,మున్సిపల్ వైస్ చైర్మన్ రామ న్న,వార్డు కౌన్సిలర్లు చీపిరి.శెట్టి రాజేష్, అయ్యోరి గోపాల్, పవన్,ప్రశాంత్, వొజ్జల లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య బోధన్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక

**కలెక్టర్ పర్యవేక్షణలో పారదర్శకంగా ఎన్నిక ప్రక్రియ**

**ఎక్స్ అఫిషియో ఓటును వినియోగించుకున్న**

**ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**

**నిజామాబాద్, జూన్ 30:**

బోధన్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియను మంగళవారం కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహించారు. బోధన్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నిక ప్రక్రియ కలెక్టర్ ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో కొనసాగింది. ఎక్స్ అఫిషియో సభ్యుని హోదాలో ప్రభుత్వ సలహాదారు, స్థానిక ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలో పాల్గొన్నారు. సరిపడా కోరంను నిర్ధారించుకున్న మీదట ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. ఎక్స్ అఫిషియోను కలుపుకుని మొత్తం 39 మందికి గాను, పూర్తి స్థాయిలో 39 మంది సభ్యులు హాజరయ్యారు. ఆయా కేటగిరీల వారీగా కో ఆప్షన్ పదవి కోసం వచ్చిన ప్రతిపాదనల మేరకు పేర్లను చదువుతూ, చేతులు ఎత్తే పద్ధతి ద్వారా నలుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నిక ప్రక్రియను ప్రిసైడింగ్ ఆఫీసర్ ప్రకటించిన తదుపరి 12 మంది ఎంఐఎం కౌన్సిలర్లు ఎన్నికను బహిస్కరిస్తున్నామని ప్రకటించి సమావేశం హాల్ నుండి బయటకు వెళ్లిపోయారు. మిగతా సభ్యులతో ఎన్నిక ప్రక్రియను కొనసాగించారు. నాలుగు కోఆప్షన్ పదవులకు గాను మొత్తం 35 దరఖాస్తులు రాగా, పేర్లను చదువుతూ, చేతులు ఎత్తే పద్ధతి ద్వారా కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు. ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా నిబంధనలను పక్కాగా పాటిస్తూ, వీడియో చిత్రీకరణ మధ్య పూర్తి పారదర్శకంగా ఈ ఎన్నిక ప్రక్రియ జరిపించారు.మెజారిటీ సభ్యుల (19 మంది) మద్దతు మేరకు దండు సంగ్రామ్, మాసుల లక్ష్మి , మహమ్మద్ ఇమ్రాన్, రఫీయా బేగంలు కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ జాదవ్ కృష్ణ ప్రకటించారు.నూతనంగా కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన వారికి నియామక ధృవీకరణ పత్రాలు అందజేశారు. కో ఆప్షన్ ఎన్నికను పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నూతనంగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యులకు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందలు తెలియజేశారు. ఈ ఎన్నిక ప్రక్రియలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి , మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ విఠల్, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.




## నిబంధనలు పాటించని ఆహార పదార్థాల తయారీదారులపై కఠినంగా వ్యవహరించాలి: జిల్లా కలెక్టర్

**నిర్మల్, ఉదయం:**

జిల్లాలోని ఆహార పదార్థాలు దుకాణదారులంతా ఖచ్చితంగా నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆహార భద్రతపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, మిఠాయి దుకాణాలు, దాబాలు, ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల నిర్వాహకులు ఆహార భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడం ప్రతి వ్యాపారి బాధ్యత అని అన్నారు. వంటల తయారీలో ఉపయోగించే నూనెలు, మసాలా దినుసులు, పాలు, పెరుగు తదితర ముడి పదార్థాలు నాణ్యమైనవే వినియోగించాలని అన్నారు. ఆహార భద్రత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ, దుకాణాల లైసెన్సులు సరి చూడాలని పేర్కొన్నారు. ముడి పదార్థాల గడువు తేదీలను, లేబుళ్లను ఎప్పటికప్పుడు చూడాలన్నారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను వినియోగించినా, ఫుడ్ కలర్లను వాడినా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, కోడిగుడ్లు, పాలు, పాల పదార్థాలు, మాంసం వంటి ఆహార పదార్థాలు తాజావే వాడుతున్నారో లేదో చూడాలని చెప్పారు. అపరిశుభ్రమైన, గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయించినా, దుకాణాల్లో నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు అమలవుతున్నాయో లేదో నిత్యం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం, ఇటీవలి ఫుడ్ సేఫ్టీ అంశం మీద శిక్షణ పొందిన పలువురు అంగన్వాడి టీచర్లకు కలెక్టర్, అధికారులు సర్టిఫికెట్లను అందించారు. ఈ సమావేశంలో జిల్లా ఆహార భద్రత అధి కారి సునీత, వైద్యారోగ్య అధికారి రాజేం దర్, డిడబ్ల్యూవో వినూత్న, డిపివో శ్రీని వాస్, డిఈఓ భోజన్న, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేల బహుమతి

**'రహవీర్' – పీఎం రహత్ పథకాలపై అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) సమీక్ష**

**కామారెడ్డి, జూన్ 30 (ఉదయం ప్రతినిధి):**

రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రహవీర్, 'పీఎం రహత్ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ పథకాల అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు స్పందించి బాధితులను సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రమాదం జరిగిన తొలి గంట (గోల్డెన్ అవర్) లోపు బాధితుడిని ఆసుపత్రికి చేర్చి ప్రాణాలను కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం తరఫున రూ.25,000 నగదు బహుమతి అందజేస్తుందని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి రూ.1.5 లక్షల వరకు ఉచిత (క్యాష్‌లెస్) వైద్యం అందించే పీఎం రహత్ పథకం అమలులో ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స, ప్రమాదం జరిగిన తేదీ నుంచి 7 రోజుల వరకు ఉచిత వైద్యం, గరిష్టంగా రూ.1.5 లక్షల వరకు వైద్య ఖర్చుల భారం ప్రభుత్వం భరిస్తుందన్నారు. జాతీయ రహదారులు మాత్రమే కాకుండా, ఏ రహదారిపై జరిగిన ప్రమాదానికైనా ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు.ఈ సందర్భంగా నిర్వహించిన అప్రిసియేషన్ కమిటీ సమావేశానికి అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ అధ్యక్షత వహించారు.



# అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం



హాసన్ పర్తి జూన్30 (వుదయం ప్రతినిధి): అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని హాసన్ పర్తి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బిగుల్ల సురేష్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 66 డివిజన్ లో ఇంటింటి సర్ సర్వే కారక్రమంలో పాల్గొన్న అయిన ఈ సందర్భంగా మాట్లాడుతూ..., అన్ ఓటు మాఫింగు దాదాపు రెం రెండు నుండి మూడు వేల వరకు ఉందని కార్యకర్తలు వారిని గుర్తించి తగిన ప్రాధాన్యత ఓటు హక్కు కల్పించి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ సర్ ప్రక్రియ పై అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణ మనందరి బాధ్యత అని, హసన్ పర్తి బూత్ లలో బిఎల్ఓ, బిఎల్ఏ లతో కలిసి ఓటర్ల వద్దకు వెళ్లి మాట్లాడరూ. ఓటరు జాబితా నవరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా అన్ ఓటు మ్యాపింగ్ కాని వారు బిఎల్ఓ కానీ బిఎల్ఏ కానీ గుర్తించి వారికి ఓటు హక్కు కల్పించాలని, ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి వారి వివరాలను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అదేవిధంగా, ఓటర్ల వివరాల్లో తప్పులు, పేర్ల తొలగింపులు లేదా ఇతర సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరి చేయించేలా కృషి చేయాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగ హక్కు అని, దానిని కాపాడటం ప్రతి కార్యకర్త ధర్మమని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని, ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కార్యకర్తలు గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు.

# మంత్రుల నివాసాలను ముట్టడించిన సిఐటీయూ మున్సిపల్ కార్మికులు.

**కనీస వేతనం ఉద్యోగ భద్రత ఇందిరమ్మ ఇండ్లతో పాటు పలు డిమాండ్ల సాధనకు ఆందోళన.**



పరకాల, జూన్ 30 (వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా పరకాల మున్సిపాలిటీ సీఐటీయూ కార్మిక సంఘం అధ్యక్షుడు మడికొండ ప్రమోద్ కుమార్ నాయకత్వంలో కార్మికులు హనుమకొండలోని రాష్ట్ర మంత్రి కొండ సురేఖ నివాసాన్ని ముట్టడించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో మంత్రుల నివాసాల వద్ద ఇదే తరహా ఆందోళనలు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ కార్మికులకు నెలకు కనీస వేతనం రూ. 26,000 అమలు చేయాలని, విధుల్లో ఉన్న కార్మికుడు మరణించిన పక్షంలో అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ. 30,000 ఆర్థిక సాయం అందించాలని కోరారు. అలాగే 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ కార్మికుల్లో అధిక శాతం మంది ఎస్సీ వర్గాలకు చెందిన నిరుపేదలేనని, సొంత ఇళ్లు లేక గుడిసెలు, తాత్కాలిక నివాసాల్లో జీవిస్తున్నందున వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కార్మికుల సమస్యలను విన్న ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, మంత్రి కొండ సురేఖతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సీఐటీయూ నాయకులు టి. ఉప్పలయ్య, బొట్ల చక్రపాణి, యాస బాబు, మహేష్‌తో పాటు పరకాల మున్సిపాలిటీ సీఐటీయూ నాయకులు బొచ్చు ఐలయ్య, పసుల సారయ్య, చెరుకు నాగరాజు, కోవెల సుమన్, మడికొండ వసంత, దుప్పటి తిరుమల, గుర్రం సరోజన, బొచ్చు సురేష్, రత్న జీవన్ కుమార్, మడికొండ సుధాకర్, మల్లికాంబ, సుమలతతో పాటు పంప్ ఆపరేటర్లు, కరెంట్ ఆపరేటర్లు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఈదులకంటి రవీందర్ రెడ్డి..




రాయపర్తి జూన్ 30 (వుదయం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుడిగా ఈదులకంటి రవీందర్ రెడ్డి నియమితులయ్యారు. తెలంగాణ ప్రాదేశిక కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ గౌడ్ , పార్టీ అధిష్ఠానం ప్రకటించిన ఈ నియామకంపై కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈదులకంటి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం, కార్యకర్తల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి కార్యకర్తను కలుపుకుని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ నియామకం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈదులకంటి రవీందర్ రెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

## గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేయుటకు మల్టీపర్పస్ వర్కర్లు కావలెను.

**ఆసక్తిగల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలి. గ్రామ సర్పంచ్ సర్పంచుల పోరం మండల ప్రధాన కార్యదర్శి రమేష్.**



ఖానాపురం, జూన్ 30 (వుదయం ప్రతినిధి):మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేయుటకు మల్టీపర్పస్ వర్కర్లు కావాలని గ్రామ సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఆసక్తిగల నిరుద్యోగ యువతీ యువకులు గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేయుటకు దరఖాస్తు చేసుకోవచ్చని గ్రామ సర్పంచ్ తెలిపారు.

# ఎంపీడీవో వేణుమాధవ్ సేవలు భావితరాలకు ఆదర్శం



పెద్దవంగర, జూన్ 30 (వుదయం ప్రతినిధి):ప్రజాసేవలో నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించిన ఎంపీడీవో బోడెపూడి వేణుమాధవ్ సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈవో పురుషోత్తం అన్నారు. పెద్దవంగర ఎంపీడీవో వేణుమాధవ్ పదవీవిరమణ సన్మాన సభను గ్రామ సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్ అధ్యక్షతన సాయి గార్డెన్ లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, డీఆర్డీఏ పీడీ మధుసూదన్ రాజు, జిల్లా హార్టికల్చర్ అధికారి మరియన్న, అడిషనల్ డీఆర్డీవో మల్లేశ్వరి తో కలిసి మాట్లాడారు. 36 ఏళ్లుగా ప్రభుత్వ సేవలో ప్రజలకు చేరువై అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, పారదర్శక పాలనకు కృషి చేశారన్నారు. బాధ్యతాయుతమైన పరిపాలన, మానవీయ దృక్పథం, సేవా తపనతో వేణుమాధవ్ ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, ప్రజాసేవ, పారదర్శక పాలనలో తనదైన ముద్ర వేసిన వేణుమాధవ్ జిల్లాలో పంచాయతీరాజ్ శాఖకు వన్నె తెచ్చిన అధికారిగా ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. ప్రభుత్వ అధికారులకు పదవీవిరమణ సహజమని, ఎక్కడ విధులు నిర్వర్తించినా ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తూ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సహచర అధికారుల ప్రశంసలు అందుకున్నారు. గ్రామాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పన, పంచాయతీల బలోపేతానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ బలభద్ర వినోద్ కుమార్, ఎస్సై చిలువేరు ప్రమోద్ కుమార్ గౌడ్, ఎంఈవో బుధారపు శ్రీనివాస్, పలువురు ఎంపీడీవో లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు సమృద్ధిగా కురువాలని నేడు గ్రామ దేవతకు గ్రామస్తులచే జలాభిషేకం.

**గ్రామ సర్పంచ్ సర్పంచుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్.**

ఖానాపురం, జూన్ 30 (వుదయం ప్రతినిధి):వర్షాలు సమృద్ధిగా కురవాలని పాడిపంటలు సమృద్ధిగా పండాలని పిల్లాపాపలు సుఖ సంతోషంగా ఉండాలని నేడు బుధవారం ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని గ్రామ దేవత (బొడ్రాయి) వద్ద గ్రామస్తుల సమక్షంలో గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి జలాభిషేకం చేయాలని గ్రామ సర్పంచ్ సర్పంచుల పోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ గ్రామ ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు ఆశాజనకంగా లేకపోవడంతో నేటి వరకు ఒక్క వర్షం కూడా పంట భూముల్లో దున్నిన దుక్కిలో నుంచి నీళ్లు బయటకు వెళ్లే వర్షాలు కురువలేదని తెలుపుతూ, గ్రామ దేవతకు జలాభిషేకం చేస్తేనైనా ఆ తల్లి కరుణించి వర్షాలు పడతాయేమోఅని ఆశతో గ్రామ దేవతకు ఈ ప్రయత్నం చేస్తున్నట్లు తెలుపుతూ, ఇంతటి పుణ్య కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా ప్రజలు రైతులు మహిళలు అన్ని కులాల అన్ని వర్గాల ప్రజలందరూ కుటుంబ సమేతంగా పాల్గొని గ్రామ దేవతకు అంగరంగ వైభవంగా జలాభిషేకం చేసే కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలకవర్గం గ్రామ ప్రజలందరూ పాల్గొనాలని పేరుపేరునా తెలుపుతున్నట్లు సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి గ్రామస్తులను కోరారు.



## సఫాయి కార్మికుల కాంట్రాక్టు విధానం రద్దు చేయాలని వినతి.

పరకాల జూన్ 30 (వుదయం ప్రతినిధి): సఫాయి కార్మికుల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి నేరుగా ప్రభుత్వ ఉద్యోగాలుగా నియమించాలని తెలంగాణ సఫాయి, ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ ప్రతినిధి బృందం జాతీయ సఫాయి కర్మచారీస్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్ హార్దీప్ సింగ్ గిల్ ఢిల్లీలోని వారి కార్యాలయంలో తెలంగాణ సఫాయీ ఆల్ ఇండియా సఫాయీ మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. సఫాయి కార్మికులకు ప్రభుత్వ వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వారి పిల్లల విద్యాభవిష్యత్తుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ బృందానికి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ పరచ నాయకత్వం వహించగా, జాతీయ కార్యదర్శి సోదా రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారం వీర్ సింగ్, హైదరాబాద్ నగర అధ్యక్షుడు దేవేందర్ సింగ్ చిండాలియా పాల్గొన్నారు.


## తొర్రూరు ఆర్టీసీ డిపోలో ఘనంగా చందసాని వీరస్వామి పదవీ విరమణ మహోత్సవం



పర్వతగిరి , జూన్ 30, ( వుదయం ప్రతినిధి ) :
వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం, వడ్లకొండ గ్రామానికి చెందిన చందసాని వీరస్వామి నేడు తొర్రూరు ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డ్రైవర్ గా పనిచేసి సుదీర్ఘ సేవల అనంతరం నేడు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా డిపోలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. చందసాని వీరయ్యను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేసి ఘనంగా అభినందించారు. వారు మాట్లాడుతూ, చందసాని వీరయ్య ఆర్టీసీ సంస్థలో నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు పాల్గొని చందసాని వీరస్వామికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా ప్రారంభమైన 'రైతు భరోసా

- శిల్పకళా వేదిక నుండి ఆన్‌లైన్‌లో నిధులు జమ చేసిన ముఖ్యమంత్రి
- పర్వతగిరి రైతు వేదికలో ప్రత్యక్ష ప్రసారం వీక్షించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ సత్య శారద
- ఎద్ద సంఖ్యలో హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు తహసీల్దార్ టి. వెంకటస్వామి , ఏ ఈ ఓ. ప్రశాంత్ కుమార్, ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ స్థానిక రైతాంగం







పర్వతగిరి , జూన్ 30.( వుదయం ప్రతినిధి ) :తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రైతు భరోసా' పెట్టుబడి సాయం పంపిణీ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక నుండి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం నిధులను విడుదల చేశారు. ముఖ్యమంత్రి పంపిణీ చేసిన ఈ కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రత్యక్ష ప్రసారం (లైవ్ స్క్రీన్) ద్వారా వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ సత్య శారద,డి పి ఆర్ ఓ ప్రేమలత,పర్వతగిరి సర్పంచ్ చీదురు శంకర్, ఉప సర్పంచ్ అనిత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ జిల్లా పార్టీ అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ అయ్యూబ్, పీన్నింటి అనిల్ రావు హాజరయ్యారు. ప్రభుత్వ అధికారులు, మండల స్థాయి సిబ్బంది అయిన తహసిల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్,ఎంపీఓ శేషాంజన్ స్వామి, మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రశాంత్ కుమార్, వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, సర్పంచ్ లు మాజీ సర్పంచ్లు, పెద్ద సంఖ్యలో రైతులు ముఖ్యమంత్రి ప్రసంగాన్ని, నిధుల విడుదలను ఆసక్తిగా వీక్షించారు. రైతుల ఖాతాల్లోకి నేరుగా పెట్టుబడి సాయం జమకావడం పట్ల స్థానిక రైతాంగం తీవ్ర హర్షం వ్యక్తం చేసింది.

## దౌలత్ నగర్ లో తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందిన గీత కార్మికుడి కుటుంబానికి పరామర్శించిన వర్ధన్నపేట మ్మెల్యే కేఆర్.నాగరాజు



పర్వతగిరి, జూన్ 30 ( వుదయం ప్రతినిధి ( :పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామానికి చెందిన దోనికేనా శ్రీనివాస్ ఇటీవల తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడి మృతి చెందగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మంగళవారం వారి నివాసానికి వెళ్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట జిల్లా,మండల,గ్రామ,ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## పిల్లలకు కూల్ డ్రింక్స్, పండ్ల రసాలను ఎక్కువగా తాగిస్తే ప్రమాదం..



చిన్నప్పటి నుంచి పిల్లలు తాగే పానీయాలు వారి భవిష్యత్తు ఆరోగ్యంపై దీర్ఘకాల ప్రభావం చూపుతాయని తాజా పరిశోధన వెల్లడించింది. ముఖ్యంగా చక్కెర ఎక్కువగా ఉండే శీతల పానీయాలు, స్పోర్ట్స్ డ్రింక్స్, ప్యాకెట్ ఫ్రూట్ జ్యూస్‌లను తరచూ తాగే పిల్లల్లో పెద్దయ్యాక అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్) వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుందని పరిశోధకులు గుర్తించారు. చిన్న వయసులోనే ఆరోగ్యకరమైన పానీయాల అలవాట్లు పెంపొందించడం గుండె ఆరోగ్యానికి ఎంతో కీలకమని వారు సూచిస్తున్నారు. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్ సర్క్యులేషన్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో 25 వేల మందికి పైగా వ్యక్తుల ఆరోగ్య సమాచారాన్ని సుమారు 25 సంవత్సరాల పాటు పరిశీలించారు. చిన్ననాటి నుంచి యుక్తవయస్సు వరకు వారు తీసుకున్న చక్కెర పానీయాలు, ఫ్రూట్ జ్యూస్, తాజా పండ్ల వినియోగాన్ని విశ్లేషించి, పెద్దయ్యాక వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. రోజుకు రెండు లేదా అంతకంటే ఎక్కువ సార్లు చక్కెర కలిగిన పానీయాలు తాగిన పిల్లకు, వారానికి మూడు సార్ల కంటే తక్కువగా తాగిన వారితో పోలిస్తే భవిష్యత్తులో రక్తపోటు వచ్చే ప్రమాదం 52 శాతం ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం వెల్లడించింది. రోజుకు ఒక్కసారి శీతల పానీయం తాగిన వారిలో కూడా ఈ ప్రమాదం 23 శాతం పెరిగింది. అలాగే స్పోర్ట్స్ డ్రింక్స్‌ను తరచూ తీసుకున్న వారిలో ఈ ప్రమాదం 36 శాతం అధికంగా నమోదైంది. చాలా మంది తల్లిదండ్రులు ఫ్రూట్ జ్యూస్‌లను శీతల పానీయాలకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా భావిస్తుంటారు. అయితే రోజుకు ఒకటిన్నర సర్వింగ్ లేదా అంతకంటే ఎక్కువ ఫ్రూట్ జ్యూస్ తాగిన పిల్లల్లో కూడా భవిష్యత్తులో రక్తపోటు వచ్చే ప్రమాదం 35 శాతం ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. వంద శాతం పండ్ల రసంలో విటమిన్లు, ఖనిజాలు ఉన్నప్పటికీ, అందులో పీచు పదార్థం ఉండదు. పీచు లేకపోవడంతో చక్కెర వేగంగా రక్తంలో కలసి రక్తనాళాల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుందని వారు వివరించారు. చక్కెర పానీయాల్లో ముఖ్యంగా ఫ్రక్టోజ్ వంటి చక్కెరలు అధికంగా ఉంటాయి. వీటిని తరచూ తీసుకోవడం వల్ల బరువు పెరగడం, ఊబకాయం, ఇన్సులిన్ నిరోధకత, శరీరంలో వాపు వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇవన్నీ గుండె, రక్తనాళాలపై అదనపు ఒత్తిడిని పెంచి అధిక రక్తపోటుకు దారితీసే అవకాశాన్ని పెంచుతాయి. అయితే మొత్తం ఫ్రక్టోజ్ పరిమాణం కంటే అది ఏ ఆహారం ద్వారా శరీరంలోకి వెళ్తుందనేదే ముఖ్యమని అధ్యయనం సూచించింది. పండ్లలో ఉండే ఫ్రక్టోజ్ మాత్రం అధిక రక్తపోటు ప్రమాదాన్ని పెంచలేదని పరిశోధకులు గుర్తించారు. దీనికి కారణం పండ్లలో ఉండే పీచు, యాంటీఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు రక్షణాత్మక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పిల్లలు ప్రతిరోజూ తాగే ఒక చక్కెర పానీయాన్ని తాజా పండ్లతో భర్తీ చేస్తే భవిష్యత్తులో రక్తపోటు వచ్చే ప్రమాదం 22 శాతం వరకు తగ్గే అవకాశం ఉంటుందని అధ్యయనం తెలిపింది. అలాగే చక్కెర పానీయాల స్థానంలో నీరు లేదా పాలు తీసుకోవడం కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని పరిశోధకులు పేర్కొన్నారు. రక్తపోటును సైలెంట్ కిల్లర్‌గా పిలుస్తారు. ఎందుకంటే చాలా సందర్భాల్లో ఇది ఎలాంటి స్పష్టమైన లక్షణాలు లేకుండానే అభివృద్ధి చెందుతుంది. నియంత్రించకపోతే గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది.

## పని చేస్తూ... వ్యాయామం చేద్దామా!

ఆఫీసులో ఒత్తిడి ఎక్కువైతే ఏం చేస్తాం? వెంటనే ఒక కప్పు టీ తాగడమో లేదా కాఫీ బ్రేక్ తీసుకోవడమో చేస్తాం. కానీ ఇప్పుడు మెట్రో నగరాల్లో పనిచేస్తున్న జెన్‌జీ ఉద్యోగులు కొత్త బాట పట్టారు. టీ, కాఫీ బ్రేక్‌లకు బదులు ‘ఎక్సర్‌సైజ్ స్నాకింగ్’ వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఇంతకీ ఏంటిది అనుకుంటున్నారా! ఆకలేసినప్పుడు పని మధ్యలో కొద్దికొద్దిగా చిరుతిండి తింటుంటాం కదా! అలాగే రోజంతా ఒకేచోట కూర్చోకుండా... మధ్యమధ్యలో చిన్నగా వ్యాయామం చేయడాన్నే ఎక్సర్‌సైజ్ స్నాకింగ్ అంటారు. దీనికోసం జిమ్‌కు వెళ్లి గంటల కొద్దీ కష్టపడి చెమట చిందించాల్సిన అవసరం లేదు. ఆఫీస్ పని వేళల్లో ఓ ఐదు నిమిషాలు చిన్నచిన్న ఎక్సర్‌సైజ్‌లు చేస్తే చాలు. ఆఫీస్‌లో ఉండి ఎలా చేస్తాం? అనేగా సందేహం. లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఎక్కడం. సీట్‌లో కూర్చుని చేతులు, కాళ్లు, మెడను కాసేపు స్ట్రెచ్ చేయడం. ఫోన్ మాట్లాడేటప్పుడు ఒకేచోట నిలబడి కాకుండా అటూ ఇటూ నడవడం. కుదిరితే సీటు పక్కనే నిలబడి ఐదారుసార్లు కూర్చుని లేవడం చేయొచ్చు. దీనివల్ల రక్తప్రసరణ బాగా జరిగి గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అదే పనిగా పనిచేయడం వల్ల వచ్చే శారీరక, మానసిక అలసట తగ్గి మెదడు చురుగ్గా ఉంటుంది. ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల వచ్చే వెన్ను, మెడ నొప్పుల నుంచి ఉపశమనం దొరుకుతుంది. మీకూ అవసరం అనుకుంటే ప్రయత్నించి చూడండి.




## మైగ్రేన్ తగ్గాలంటే..

రకరకాల కారణాల వల్ల పీడించే మైగ్రేన్ తలనొప్పి తలెత్తితే నిమిషం ఒక యుగంగా భారంగా గడిచిపోతుంది. భరించలేని నొప్పికి సత్వర ఉపశమనం కావాలని కోరుకుంటారు. ఈ చిట్కాలు పాటిస్తే కాస్తయినా ఉపశమనం పొందవచ్చు. పుదీనా: పుదీనా ఆకుల్లో ఉండే మెంథాల్, మెంథోన్ మైగ్రేన్ తగ్గించడానికి బాగా ఉపయోగపడుతుంది. కొన్ని పుదీనా ఆకులను రుబ్బి, దాని నుంచి రసం తీసి నుదురుపై పూయాలి.



అలాగే ఒక కప్పు వేడి వేడి బ్లాక్ టీ లో కొన్ని పుదీనా ఆకులు వేసి 10నిమిషాలు నానిన తర్వాత తీసుకుంటే మైగ్రేన్ నుంచి విముక్తి లభిస్తుంది. అల్లం: అల్లంలో ఉండే జింజెరోల్స్ అని పిలిచే రసాయనం మైగ్రేన్‌ను తగ్గించేందుకు బాగా ఉపయోగపడుతుంది.

అల్లం, నిమ్మ రసాలను సమాన మోతాదుల్లో కలుపుకొని, రోజుకు 2 నుంచి 3 సార్లు తాగాలి. తాజా నీటిలో అల్లం ముక్కలు లేదా అల్లం ముక్కల పొడి వేసి ఆవిరి పీలిస్తే తక్షణ ఉపశమనం లభిస్తుంది.

నిద్ర: నిద్ర లేమి వల్ల మైగ్రేన్ వస్తూ ఉంటుంది. అందువల్ల నిద్రకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి రోజూ 8 గంటల సమయం నిద్రకు కేటాయించాలి. ఇలా చేయడం వల్ల మైగ్రేన్‌ను కొంత మేరకు ఎదుర్కోవచ్చు.

## పురుషుల్లో అధిక ఒత్తిడి కారణంగా ఏర్పడే అనారోగ్య సమస్యలు ఇవే..


పురుషుల్లో సంతానలేమి సమస్య గురించి ఇప్పటికీ చాలా తక్కువగా చర్చ జరుగుతోంది. అయితే జీవనశైలిలో వచ్చిన మార్పులు, ఒత్తిడి, నిద్రలేమి, శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు పురుషుల సంతానోత్పత్తి సామర్థ్యంపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఒక్క కారణం వల్లే ఈ సమస్య రాదని, శరీర పరిస్థితులు, పర్యావరణం, రోజువారీ అలవాట్లు కలిసి దీనిపై ప్రభావం చూపుతాయని అంటున్నారు. సంతానోత్పత్తి గురించి మాట్లాడేటప్పుడు సాధారణంగా ఆహారం, వయస్సు లేదా ఇతర ఆరోగ్య సమస్యలపైనే ఎక్కువ దృష్టి పెడతారు. కానీ దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి, సరిపడా నిద్ర లేకపోవడం, గంటల తరబడి ఒకేచోట కూర్చునే అలవాటు కూడా వీర్యకణాల నాణ్యత, హార్మోన్ల సమతుల్యత, సంతానోత్పత్తి సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. నేటి ఉద్యోగ జీవనశైలిలో ఒత్తిడి దాదాపు రోజువారీ జీవితంలో భాగంగా మారిపోయింది. అప్పుడప్పుడు వచ్చే ఒత్తిడి పెద్దగా సమస్య కాకపోయినా, ఎక్కువ కాలం కొనసాగే మానసిక ఒత్తిడి వీర్యకణాల సంఖ్య తగ్గడం, వాటి కదలిక మందగించడం, ఆకృతిలో మార్పులు రావడం వంటి సమస్యలకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ సమయంలో కార్టిసాల్ అనే ఒత్తిడి హార్మోన్ పెరగడం వల్ల వీర్యకణాల ఉత్పత్తి, టెస్టోస్టెరాన్ స్థాయిలను నియంత్రించే హార్మోన్ల పనితీరు దెబ్బతినే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఒత్తిడి పెరిగే కొద్దీ నిద్ర, ఆహారపు అలవాట్లు కూడా దెబ్బతిని సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. నిద్ర కేవలం శరీరానికి విశ్రాంతి ఇచ్చే సమయం మాత్రమే కాదు. ఈ సమయంలోనే శరీరంలో అనేక హార్మోన్ల నియంత్రణ ప్రక్రియలు జరుగుతాయి. నిరంతరం నిద్రలేమితో బాధపడేవారిలో వీర్యకణాల నాణ్యత తగ్గడం, వాటి చురుకుదనం తగ్గిపోవడం, సంతానోత్పత్తి సామర్థ్యం బలహీనపడటం వంటి సమస్యలు కనిపించే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతి రాత్రి 7 నుంచి 8 గంటల నాణ్యమైన నిద్ర అవసరమని, అయితే అవసరానికి మించి ఎక్కువసేపు నిద్రపోవడం కూడా కొన్ని పరిశోధనల్లో ప్రతికూల ప్రభావాలతో సంబంధం ఉన్నట్లు గుర్తించారని పేర్కొంటున్నారు. ప్రస్తుతం చాలా మంది ఉద్యోగరీత్యా గంటల తరబడి కంప్యూటర్ ముందు లేదా వాహనం నడుపుతూ కూర్చోవాల్సి వస్తోంది. అయితే ఎక్కువసేపు ఒకేచోట కూర్చోవడం వల్ల శరీరంలో వాపు సంబంధిత మార్పులు, జీవక్రియలో లోపాలు ఏర్పడి అవి పరోక్షంగా వీర్యకణాల నాణ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. దీనికి భిన్నంగా ప్రతిరోజూ మితమైన శారీరక వ్యాయామం చేసే వారిలో వీర్యకణాల నాణ్యత, సంతానోత్పత్తి ఆరోగ్యం మెరుగ్గా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. పురుషుల్లో సంతానలేమి సమస్యకు ఒక్కటే కారణం ఉండదు. జీవశాస్త్ర సంబంధిత అంశాలు, పర్యావరణ పరిస్థితులు, రోజువారీ జీవనశైలి అన్నీ కలిసి దీనిపై ప్రభావం చూపుతాయి. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, సరిపడా నిద్రపోవడం, ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం, ప్రతిరోజూ శారీరకంగా చురుకుగా ఉండడం వంటి అలవాట్లు శరీరం తిరిగి సాధారణ స్థితికి చేరుకోవడానికి సహాయపడతాయి.





## నిద్రకోసం లవంగం

లవంగాన్ని నోటిలో ఉంచుకుని నిద్రపోవడం వల్ల.. అది శ్వాసనాళంలోకి వెళ్లే ప్రమాదం ఉన్నది. దాంతో ఊపిరి ఆడకపోవడం, ఉక్కిరిబిక్కిరి అవుతారు. ఇక చాలా ఘాటుగా ఉండే లవంగాన్ని నోటిలోనే ఎక్కువ సేపు ఉంచుకోవడం మంచిదికాదు. అలాచేస్తే.. బుగ్గ లోపలి భాగం, నాలుక కాలినట్లు అవ్వడం, నోటి పూత వచ్చే అవకాశం ఉంటుంది. లవంగం తక్కువ మోతాదులో తీసుకుంటేనే సురక్షితం. అధికంగా వాడటం వల్ల నోటిలో మంట, కడుపులో అసౌకర్యం, అలెర్జీలు కలగవచ్చు. అయితే, లవంగాలలో ఉండే కొన్ని గుణాలు పరోక్షంగా మంచి నిద్రకు సహాయపడవచ్చని చెబుతున్నారు. లవంగాలలో యాంటి ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి, లవంగం నమలడం, దాని సువాసనను పీల్చడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. ఒత్తిడి తగ్గి మంచినిద్ర రావడానికి సహాయపడవచ్చు. లవంగంలో ‘యూజినాల్’ అనే సహజ సిద్ధమైన యాంటి సెప్టిక్ లక్షణం ఉంటుంది. ఇది రాత్రి వేళల్లో నోటిలోని బ్యాక్టీరియాను నివారించి, పంటి నొప్పి, చిగుళ్ల వాపు వంటి సమస్యల్ని తగ్గిస్తుంది. నొప్పి లేకపోవడం వల్ల ప్రశాంతంగా నిద్ర పట్టే అవకాశం ఉంది. కొందరికి రాత్రిపూట గ్యాస్, అజీర్తి వల్ల నిద్ర సరిగ్గా పట్టదు. లవంగం లాలాజలాన్ని పెంచి జీర్ణక్రియకు సహాయపడుతుంది. తద్వారా కడుపు అసౌకర్యం తగ్గి నిద్ర బాగుంటుంది. కాబట్టి, లవంగం ప్రయోజనాలను పొందాలనుకుంటే.. పడుకోవడానికి ఒక అరగంట ముందు ఒక లవంగాన్ని నమిలి, ఆ రసాన్ని మింగేయాలి. ఆ తర్వాత నోటిని శుభ్రంగా కడుక్కుని పడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



## నెలసరిలోనూ ఉల్లాసంగా..!

నెలసరి సమయంలో పలు ఆరోగ్య సమస్యలు ఎదురవడం సహజం. కడుపు నొప్పి, నడుంనొప్పి, చిరాకు, ఒత్తిడి, ఆందోళన.. వంటివి అందులో కొన్ని. అయితే ఈ సమస్యల నుంచి ఉపశమనం పొంది సౌకర్యంగా, ఉల్లాసంగా ఉండాలంటే కొన్ని చిన్న చిన్న చిట్కాలు పాటించాలంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. నెలసరి సమయంలో కొంతమంది పొత్తి కడుపు నొప్పితో బాధపడుతుంటారు. ఈ నొప్పిని భరించలేక కొంతమంది పెయిన్ కిల్లర్స్ వేసుకుంటారు. కానీ వీటిని తరచూ వాడడం మంచిది కాదంటున్నారు నిపుణులు. కాబట్టి ఇలాంటి మాత్రలకు బదులు హీట్ ప్యాక్ లేదా వేడి నీళ్ల బాటిల్‌తో కాపడం పెడితే.. నొప్పిని దూరం చేసుకోవచ్చు. ఆ తర్వాత కాస్త గోరువెచ్చటి నీటితో స్నానం చేసినా మనసుకు ప్రశాంతంగా అనిపించి హాయిగా నిద్రపడుతుందంటున్నారు. నెలసరి సమయంలో వచ్చే కడుపు నొప్పి, నడుం నొప్పి, కాళ్లు లాగడం, ఇతర ఒంటి నొప్పుల నుంచి ఉపశమనం పొందడానికి అత్యవసర నూనెలు ఎంతగానో తోడ్పడతాయట. ఇందుకోసం నొప్పి వచ్చే చోట పెప్పర్‌మెంట్, రోజ్‌మేరీ, లావెండర్.. ఇలా ఏదో ఒక ఎసెన్షియల్ ఆయిల్‌తో కాస్త మర్దనా చేస్తే ఉపశమనం కలుగుతుందని చెబుతున్నారు నిపుణులు. నెలసరి సమయంలో మనం తీసుకునే ఆహారంలో కూడా కొన్ని మార్పులు చేసుకోవాలి. ఇందుకోసం క్యాల్షియం విరివిగా లభించే పాలు, పాల పదార్థాలు, పాలకూర.. వంటివి మన రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇవి నొప్పిని తగ్గించడంతో పాటు మూడ్ స్వింగ్స్, ఆహారం ఎక్కువగా తినాలన్న కోరికను అదుపు చేయడంలో తోడ్పడతాయట. అలాగే సాయంత్రం స్నాక్స్ సమయంలో నూనె పదార్థాలు కాకుండా.. విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా లభించే నట్స్, పండ్లు, కాయగూరలు తీసుకోవడం వల్ల జీవక్రియల పనితీరు మెరుగుపడుతుందంటున్నారు. అలాగే మెగ్నీషియం ఎక్కువగా ఉండే డార్క్ చాక్లెట్ తీసుకోవడం వల్ల శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలై మనసును ఉత్తేజపరుస్తాయని చెబుతున్నారు నిపుణులు. అంతేకాదు.. ఈ సమయంలో నీళ్లు ఎక్కువగా తాగాలి. గోరువెచ్చటి నీళ్లు తాగితే మరింత ఉపశమనం కలుగుతుందట. దీనివల్ల శరీరంలో నొప్పి ఉన్న కండరాలకు రక్తప్రసరణ సరిగ్గా జరిగి నొప్పి నుంచి ఉపశమనం పొందే వీలుంటుందంటున్నారు నిపుణులు. ఇక నీటి శాతం ఎక్కువగా ఉండే పుచ్చకాయ, కీరా దోస.. వంటి పండ్లు, కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

నెలసరి సమయంలో ఏ పని చేయాలన్నా శరీరం సహకరించదు. అలసట, చిరాగ్గా అనిపిస్తుంటుంది. ఈ క్రమంలో చిన్న చిన్న వ్యాయామాలు, యోగా, ధ్యానం.. వంటివి చేయడం చాలా మంచిదంటున్నారు నిపుణులు. వీటివల్ల శరీరానికి శక్తి అందడంతో పాటు పిరియడ్స్ సమయంలో ఎదురయ్యే ఒత్తిడి, మూడ్ స్వింగ్స్.. తదితర సమస్యల నుంచి ఉపశమనం పొందచ్చట. అయితే మీరు ఎంచుకునే వ్యాయామాలు పొత్తి కడుపు, నడుముపై ఒత్తిడి పడకుండా చూసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.



## గంటల తరబడి కూర్చుని పనిచేసేవారికి..

నేటి జీవనశైలిలో ఎక్కువ సేపు కుర్చీలో కూర్చునే అలవాటు దాదాపు ప్రతి ఒక్కరిలో కనిపిస్తోంది. అయితే ఎలా కూర్చుంటున్నామనే విషయాన్ని చాలామంది పట్టించుకోరు. కానీ తప్పు భంగిమలో గంటల తరబడి కూర్చోవడం వల్ల మోకాళ్లు, నడుం, తుంటి కీళ్లు, వెన్నెముకపై అదనపు ఒత్తిడి పడుతుంది. ఇది కాలక్రమేణా కీళ్ల అరుగుదల, నొప్పులు, కదలికల్లో ఇబ్బందులకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సరైన భంగిమతో కూర్చోవడం, అవసరమైన సహాయక పరికరాలను ఉపయోగించడం ద్వారా ఈ సమస్యలను చాలావరకు నివారించవచ్చని సూచిస్తున్నారు. చాలామంది కాళ్లు మడిచి కూర్చోవడం లేదా నేలపై ఎక్కువసేపు కూర్చోవడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని భావిస్తారు. అయితే ఇది అపోహ మాత్రమే. ఇలాంటి భంగిమలు మోకాళ్లు, తుంటి కీళ్లపై అధిక ఒత్తిడి కలిగించి, కాలక్రమేణా కీళ్ల అరుగుదలకు కారణమవుతాయి. ముఖ్యంగా గంటల తరబడి ఒకే భంగిమలో కూర్చోవడం వల్ల కీళ్ల కదలిక తగ్గి, నొప్పులు పెరిగే అవకాశం ఉంటుంది. కూర్చునే సమయంలో ఉపయోగించే కుర్చీ కూడా ఎంతో కీలకమని నిపుణులు చెబుతున్నారు. నడుముకు సరైన మద్దతు ఇచ్చే ఎర్గోనామిక్ కుర్చీలు వెన్నెముక సహజ వంపును కాపాడటంలో సహాయపడతాయి. ఎత్తు సర్దుబాటు, చేతులకు మద్దతు, మెత్తని సీటు వంటి సౌకర్యాలు ఉన్న కుర్చీలు శరీరాన్ని సరైన స్థితిలో ఉంచి కీళ్లపై ఒత్తిడిని తగ్గిస్తాయి. ఎక్కువ సేపు కూర్చోవాల్సిన పరిస్థితుల్లో మెమరీ ఫోమ్ లేదా జెల్ సీట్ కుషన్లు ఉపయోగించడం మంచిది. ఇవి శరీర బరువును సమానంగా పంచి మోకాళ్లు, నడుం, తుంటి భాగాలపై పడే ఒత్తిడిని తగ్గించడంతోపాటు కూర్చోవడాన్ని మరింత సౌకర్యవంతంగా మారుస్తాయి. ఇప్పటికే ఉపయోగిస్తున్న కుర్చీలో లంబార్ సపోర్ట్ పిల్లోలను అమర్చినా మంచి ప్రయోజనం ఉంటుంది. ఇవి వెన్నెముక సహజ వంపుకు మద్దతు ఇచ్చి నడుం, తుంటి భాగాలపై ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. దీని వల్ల ఎక్కువసేపు కూర్చున్నా వెన్నునొప్పి వచ్చే అవకాశాలు తగ్గుతాయి. పాదాలు నేలపై సరిగ్గా ఆనించకుండా ఉంటే ఫుట్‌రెస్ట్ ఉపయోగించడం మంచిది. దీని వల్ల పాదాలు స్థిరంగా ఉండి మోకాళ్లు, తుంటి సరైన కోణంలో ఉంటాయి. దీంతో కీళ్లపై అనవసర ఒత్తిడి తగ్గి రక్తప్రసరణ కూడా మెరుగుపడుతుంది. రోజంతా కూర్చునే ఉద్యోగాలు చేసే వారికి సిట్-స్టాండ్ డెస్క్‌లు ఉపయోగకరంగా ఉంటాయి. ఇవి అవసరానికి అనుగుణంగా కూర్చోవడం, నిలబడడం మధ్య మారేందుకు అవకాశం కల్పిస్తాయి. తరచూ భంగిమ మార్చడం వల్ల కీళ్లపై ఒత్తిడి తగ్గడంతోపాటు రక్తప్రసరణ మెరుగుపడుతుంది. మోకాళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కుర్చీ ఎత్తు కూడా సరైనదిగా ఉండాలి. కుర్చీలో కూర్చున్నప్పుడు మోకాళ్లు సుమారు 90 డిగ్రీల కోణంలో ఉండేలా చూసుకోవాలి. అలాగే రెండు పాదాలు పూర్తిగా నేలపై ఆనివుండాలి. ఈ భంగిమ మోకాళ్లపై ఒత్తిడిని తగ్గించి దీర్ఘకాలం వాటి ఆరోగ్యాన్ని కాపాడటానికి దోహదపడుతుంది. భంగిమను సరిచేసేందుకు ప్రస్తుతం మార్కెట్లో లభించే పోస్టర్ కరెక్టర్లు కూడా ఉపయోగపడతాయి. ఇవి కూర్చునేటప్పుడు లేదా నిలబడినప్పుడు శరీరాన్ని సరైన స్థితిలో ఉంచి కీళ్లపై అనవసర ఒత్తిడిని తగ్గిస్తాయి. బ్యాలెన్స్ బాల్ కుర్చీలు కూడా మరో మంచి ప్రత్యామ్నాయం. వీటిపై కూర్చోవడం వల్ల శరీరం సమతుల్యతను కాపాడేందుకు కోర్ కండరాలు ఎక్కువగా పనిచేస్తాయి. దీంతో శరీర భంగిమ మెరుగుపడటంతోపాటు కీళ్లపై ఒత్తిడి కూడా తగ్గుతుంది. ఇప్పటికే మోకాళ్ల సమస్యలు ఉన్నవారు తేలికపాటి నీ బ్రేస్‌లు లేదా మోకాళ్లకు మద్దతు ఇచ్చే సపోర్ట్‌లను ఉపయోగించవచ్చు. ఇవి కదలికలకు ఆటంకం కలిగించకుండా మోకాళ్లకు స్థిరత్వాన్ని అందిస్తాయి.



## 570 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కోల్పోయిన మైక్రోసాఫ్ట్..

ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌కు జూన్ నెల పీడకల మిగిల్చింది. 25 ఏళ్లలో అత్యంత దారుణమైన నెలగా మారింది. సంస్థ షేర్ విలువ 17 శాతం పడిపోవడంతో.. ఈ ఒక్క నెలలోనే 570 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.53 లక్షల కోట్లకు)పైగా మార్కెట్ విలువను కోల్పోయింది. 2000 డిసెంబర్ తర్వాత ఈ స్థాయిలో పడటం మళ్లీ ఇప్పుడేనని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.ప్రస్తుతం ప్రపంచమంతా ఏఐ నామస్మరణే వినిపిస్తోంది. ఆ సాంకేతికతను వేగంగా అందిపుచ్చుకునే వాటిల్లో మైక్రోసాఫ్ట్ (Microsoft) పేరు ముందువరుసలోనే ఉంది. ఏఐపై భారీగా ఖర్చు చేస్తోంది. డేటా సెంటర్లు, ఏఐ చిప్, ఏఐ ఆధారిత మౌలిక సదుపాయాలపై బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టింది.




## ఈ20 ప్రయోగాత్మకమే.. వచ్చే ఏడాది ఫలితాలు: కేంద్రం



పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం ఇంకా ప్రయగాత్మక దశలోనే ఉందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. దాని ఫలితాలు వచ్చే ఏడాదికల్లా వెల్లడి అవుతాయని తెలిపింది. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాల పనితీరు దెబ్బతింటోందని, మైలేజీ తగ్గుతోందన్న ఆందోళనలు నెలకొన్న వేళ ప్రభుత్వం నుంచి ఈ సమాధానం వెలువడడం గమనార్హం. ఈ20 వల్ల ఇంధన భద్రత, పర్యావరణానికి ప్రయోజనకరం అని కేంద్రం పేర్కొంటోంది. ఈ క్రమంలో ఓ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టులో తన వాదనను వినిపించింది. తమ వద్ద నుంచి ఇథనాల్ కొనుగోళ్లను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తగ్గించడాన్ని సవాల్ చేస్తూ..కర్ణాటక హైకోర్టును డిస్టిలరీ కంపెనీలు ఆశ్రయించాయి. దీంతో సరఫరాదారులకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై ప్రభుత్వరంగ చమురు కంపెనీ అయిన బీపీసీఎల్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి బీపీసీఎల్ తరపున వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఈ20 పెట్రోల్ ప్రక్రియ ప్రయోగాత్మకంగా జరుగుతోందని, దీని ప్రభావం వచ్చే ఏడాది కనిపిస్తుందని తెలిపారు. అయితే, కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్‌కు ఎందుకు వెళ్లలేదని సుప్రీంకోర్టు ప్రశ్నించగా.. అటార్నీ జనరల్ స్పందించారు. 2025 అక్టోబర్‌లోనే సప్లయ్ కాంట్రాక్టులు ఖరారయ్యాయని తెలిపారు. ఇదే తరహా కేసులు పలు హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఒకవేళ డివిజన్ బెంచ్‌కు వెళితే, ఇతర హైకోర్టుల నుంచి ఇదే తరహా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అటార్నీ జనరల్ సుప్రీంకోర్టుకు తెలిపారు.

## ఇవెకో కొనుగోలు సెప్టెంబరుకు పూర్తి..

ఇటలీ వాణిజ్య వాహనాల తయారీ సంస్థ ఇవెకో గ్రూప్‌ను కొనుగోలు చేసే ప్రక్రియకు సంబంధించి మెజారిటీ అనుమతులు సాధించామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (సెప్టెంబరు) నాటికి ఈ లావాదేవీ పూర్తయ్యే అవకాశం ఉందని టాటా మోటార్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ వెల్లడించారు. సోమవారం దృశ్యమాధ్యమ పద్ధతిలో జరిగిన టాటా మోటార్స్ రెండో వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో వాటాదార్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. టాటా మోటార్స్, ఇవెకో సంస్థల ఉమ్మడి ఆదాయం ప్రస్తుతం 25 బిలియన్ డాలర్లు (సుమారు రూ.2.38 లక్షల కోట్లు)గా ఉంది. రాబోయే అయిదేళ్లలో ఇది 35 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3.3 లక్షల కోట్లు)కు చేరే అవకాశం ఉందని చంద్రశేఖరన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ లావాదేవీ పూర్తయ్యాక, అంతర్జాతీయ వాణిజ్య వాహన రంగంలో ప్రపంచంలోనే అగ్రగామి–4 సంస్థల్లో ఒకటిగా నిలుస్తామని వివరించారు. ఇవెకో గ్రూప్‌నకు చెందిన రక్షణ విభాగాన్ని మినహాయించి, మిగిలిన వాణిజ్య వాహనాల వ్యాపారాన్ని 3.8 బిలియన్ యూరోలకు కొనుగోలు చేయనున్నట్లు 2025 జులైలో టాటా మోటార్స్ ప్రకటించిన సంగతి విదితమే. ఇరు సంస్థల వృద్ధికి దోహదం: ఈ లావాదేవీ వల్ల రెండు కంపెనీలకు లాభాలున్నాయని చంద్రశేఖరన్ తెలిపారు. ఐరోపాలో ఇవెకో బస్సులకు బలమైన మార్కెట్ ఉంది. దీంతో టాటా మోటార్స్‌కు కొత్త అవకాశాలు లభిస్తాయి. ఇంటర్మీడియట్, తేలికపాటి వాణిజ్య వాహన విభాగంలోనూ ఇవెకోకు మంచి పట్టు ఉంది. టాటా మోటార్స్ తన భారీ ట్రక్కులు, కొన్ని నిర్దిష్ట ప్లాట్‌ఫామ్‌లను ఇవెకో అంతర్జాతీయ పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రపంచ మార్కెట్లలోకి తీసుకెళ్లనుంది. గత రెండు ఆర్థిక సంవత్సరాలుగా ఇవెకో లాభాల్లో ఉంటూ, సానుకూల నగదు కలిగి ఉందని, ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో స్వల్ప నష్టం వచ్చినా, మొత్తంగా బలమైన వ్యాపార సంస్థ అని చంద్రశేఖరన్ వాటాదార్లకు స్పష్టం చేశారు.



## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొత్త ఛైర్మన్ రాజీవ్ కుమార్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు, తమ కొత్త ఛైర్మన్‌గా కేంద్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి రాజీవ్ కుమార్‌ను నియమించింది. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్, ఆర్థిక రంగ పునరుజ్జీవంలో కీలక పాత్ర పోషించిన రాజీవ్‌ను నాలుగేళ్ల పాటు స్వతంత్ర డైరెక్టర్‌గా నియమించడానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు ఆమోదముద్ర వేసింది. 2026 జూన్ 30 నుంచి ఇది అమల్లోకి వస్తుందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ఈ నియామకానికి, మూడేళ్ల పాటు తాత్కాలిక ఛైర్మన్ బాధ్యతలకు గాను ఆయనకిచ్చే పారితోషికానికి ఆర్‌బీఐ అనుమతులు లభించాల్సి ఉంది. ఆర్‌బీఐ ఆమోదం లభించిన వెంటనే ఛైర్మన్ బాధ్యతలను రాజీవ్ స్వీకరిస్తారు. 25వ ఎన్నికల ప్రధాన అధికారి (సీఈసీ)గా కూడా పనిచేసిన రాజీవ్.. అత్యధిక మంది ఓటర్లు పాల్గొన్న ఎన్నికలను పర్యవేక్షించినందుకు ప్రపంచ రికార్డునూ దక్కించుకున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో నైతిక విలువలపై ఆందోళన వ్యక్తం చేస్తూ రాజీనామా చేసిన అతాను చక్రవర్తి స్థానాన్ని రాజీవ్ భర్తీ చేయనున్నారు. ఆర్థిక కార్యదర్శిగా ప్రత్యేక ముద్ర: ఆర్థిక సేవల విభాగ కార్యదర్శి (2017–2020)గా రాజీవ్ తనదైన ముద్ర వేశారని బ్యాంకు వివరించింది. 'ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొండి బకాయిలు (ఎన్‌పీఏ) తీవ్ర స్థాయికి చేరి, మూలధన కొరత వేధించిన సమయంలో రాజీవ్ కార్యదర్శి బాధ్యతలు స్వీకరించారు. కొద్ది రోజుల్లోనే 3.38 లక్షల షెల్ కంపెనీల ఖాతాలను స్తంభింపజేశారు. బ్యానింగ్ ఆఫ్ అన్‌రెగ్యులేటెడ్ డిపాజిట్స్ స్కీమ్స్ యాక్ట్, 2019కి ఆమోదం లభించడంలో, పోంజీ పథకాలపై నిషేధంలో కీలక పాత్ర పోషించారు.



## అసంఘటిత రంగానికి కొత్త సూచీ

దేశ ఆర్థిక వ్యవస్థలో అసంఘటిత రంగం ఎంతో కీలకమైనా, ఇందుకు సంబంధించిన కచ్చితమైన సమాచారం అందుబాటులో ఉండటం లేదు. అత్యధికులకు ఉపాధి కల్పించే ఈ రంగ గణాంకాలు సరిగా అందుబాటులో లేక, విధానపర నిర్ణయాల్లో ప్రభావం చూపడం లేదు. అందుకే అసంఘటిత రంగ ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త సూచీ (ఇండెక్స్) తీసుకురాబోతోంది. ఇది అందుబాటులోకి వస్తే, ఆర్‌బీఐ వడ్డీ రేట్ల నిర్ణయాలు, జీడీపీ గణాంకాలు, ద్రవ్యోల్బణ నియంత్రణ, ప్రభుత్వ విధానాలు, కార్పొరేట్ సంస్థల పెట్టుబడులకూ ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు భావిస్తున్నారు. ద్రవ్యోల్బణం, పారిశ్రామిక ఉత్పత్తి, పన్ను వసూళ్లు, కార్పొరేట్ ఆదాయాల వంటి వాటిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వానికి కచ్చితమైన వ్యవస్థలు ఉన్నాయి. కానీ, భారీ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న అసంఘటిత రంగం పనితీరును త్వరగా అంచనా వేసేందుకు ఎలాంటి కొలమానం లేదు. ఈ లోపాన్ని భర్తీ చేసేందుకు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ.. కంపెనీల చట్టం కింద నమోదు కాని సంస్థల కోసం ఒక కొత్త సూచీ తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి దీని అధికారిక లక్ష్యం 2031 అయినా, అంతకంటే ముందే దీన్ని తీసుకురావాలని మంత్రిత్వ శాఖ భావిస్తోంది. చాలామంది అసంఘటిత రంగం అనగానే వీధి వ్యాపారులు, చిన్న కుటుంబ వ్యాపారాలు మాత్రమే అనుకుంటారు. కానీ, వ్యవసాయేతర, కంపెనీల చట్టం కింద నమోదు కాని వ్యాపారాలన్నీ ఈ కోవలోకే వస్తాయని మంత్రిత్వ శాఖ వివరిస్తోంది. కిరాణా దుకాణాలు, రిటెయిలర్లు, రెస్టారెంట్లు, రవాణాదారులు, మరమ్మతు దుకాణాలు, చిన్న తయారీ కేంద్రాలు, బ్యూటీ సెలూన్లు ఇవన్నీ ఇందులో భాగమే. ఇవి వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) లేదా ఉద్యమ్ కింద నమోదైనా, వీటిని కంపెనీలుగా పరిగణించడం లేదు. దేశంలో శ్రామిక శక్తిలో 80% మందికి అసంఘటిత రంగమే ఉపాధి కల్పిస్తోంది. ఉత్పాదకతలో దాదాపు 50% వాటా దీనిదే. మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన 2024–25 వార్షిక సర్వే ప్రకారం, దేశంలో 2023–24లో 7.34 కోట్లుగా ఉన్న అసంఘటిత సంస్థల సంఖ్య, 2025 నాటికి 7.92 కోట్లకు పెరిగింది. ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 12.06 కోట్ల నుంచి 12.81 కోట్లకు చేరింది. 2025–26 ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసిక అంచనాల ప్రకారం దేశవ్యాప్తంగా 9.17 కోట్ల అసంఘటిత సంస్థలు 15.17 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థలో మరే ఇతర రంగం ఇంత భారీ స్థాయిలో ఉపాధి కల్పించడం లేదు. మనదేశంలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ), ద్రవ్యోల్బణ సూచీ (సీపీఐ), జీఎస్‌టీ, పీఎంఐ వంటి ఎన్నో సూచీలు ఉన్నాయి. ఇవన్నీ వ్యవస్థీకృత రంగాన్నే ప్రతిబింబిస్తున్నాయి. కోట్ల సంఖ్యలోని చిన్న దుకాణదారులు, రవాణాదారులు నష్టాలను ఎదుర్కొన్నా, వార్షిక సర్వేలు వచ్చే వరకు ఈ వివరాలు వెల్లడికావడం లేదు. ఈ సమాచార లోపాన్ని కొత్త సూచీ భర్తీ చేయనుంది. ద్రవ్యోల్బణం పెరిగితే అది గిరాకీ వల్లా? లేక వస్తువుల కొరత వల్లా? అనేది ఆర్‌బీఐ అంచనా వేస్తోంది. అసంఘటిత రంగంలో అమ్మకాలు పడిపోయినట్లు ఈ సూచీ ద్వారా తెలిస్తే, అందుకు తగ్గ నిర్ణయాలనూ ఆర్‌బీఐ తీసుకునే వీలుంటుంది.








## ఏపీఎల్ ఫైనల్లో వైజాగ్

ఆంధ్ర ప్రిమియర్ లీగ్ ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. ట్రోఫీ కోసం మంగళవారం భీమవరం బుల్స్‌తో సింహాద్రి వైజాగ్ లయన్స్ తలపడనుంది. సోమవారం జరిగిన క్వాలిఫయర్–2లో వైజాగ్ 57 పరుగుల తేడాతో అమరావతి రాయల్స్‌ను ఓడించింది. మొదట వైజాగ్ 5 వికెట్లకు 243 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ నిమ్మల హిమకర్ (115; 53 బంతుల్లో 13×4, 6×6) విధ్వంసక శతకం సాధించాడు. రికీ భుయ్ (45), హనీశ్ రెడ్డి (44) రాణించారు. అమరావతి బౌలర్లలో బండారు అయ్యప్ప (4/59) ఆకట్టుకున్నాడు. ఛేదనలో అమరావతి 19.1 ఓవర్లలో 186 పరుగులకే ఆలౌటైంది. వెంకట రాహుల్ (48), కరణ్ షిండే (46) మాత్రమే పోరాడారు. గిరినాథ్ రెడ్డి (4/36), శ్రీకాంత్ (4/34), కమారుద్దీన్ (2/5) ప్రత్యర్థి పతనాన్ని శాసించారు.

## లోకం చూడకుండానే బిడ్డ మరణం.. పుట్టెడు దుఃఖంలోనూ ప్రపంచకప్‌లో గోల్

ఆటగాళ్లు మైదానంలో ఉన్నారంటే.. వాళ్లు ఎలా ఆడుతున్నారు? ఏ తప్పులు చేశారు? అనే మాట్లాడుకుంటాం..! కానీ, గుండెలు పగిలే బాధను పంటి బిగువన అదిమిపెట్టి దేశం కోసం ఆడే క్రీడాకారులు ఎందరో. తాజాగా నెదర్లాండ్స్ ఫుట్‌బాలర్ కూడీ హాక్పో (Cody Gakpo) అలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నాడు. లోకం చూడకుండానే తన బిడ్డ మరణించినా.. పుట్టెడు దుఃఖంలోనూ ప్రపంచకప్‌లో గోల్ చేశాడు. ఫిఫా ప్రపంచకప్ 2026 (FIFA World Cup 2026) నాకౌట్ (32 జట్ల రౌండ్)లో భాగంగా మంగళవారం ఉదయం నెదర్లాండ్స్–మొరాకో మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో తొలి 70 నిమిషాల పాటు మొరాకో ఆధిపత్యం చలాయించింది. 72వ నిమిషంలో డచ్ ఆటగాడు కూడీ హాక్పో ఎలాంటి తప్పిదం చేయకుండా బంతిని నెట్స్‌లోకి పంపించడంతో నెదర్లాండ్స్ 1–1తో స్కోరు సమం చేయగలిగింది. సాధారణంగా ఇలాంటి గోల్ చేసినప్పుడు స్ట్రైకర్‌తో పాటు జట్టు సభ్యులంతా సంబరాల్లో మునిగితేలుతారు. కానీ, ఈ మ్యాచ్‌లో మాత్రం అలాంటివేమీ కన్పించలేదు. అందుకు భిన్నంగా నిశ్శబ్దం ఆవరించింది. హాక్పో గోల్ కొట్టగానే అతడు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. మోకాళ్లపై వంగి కన్నీళ్లు పెట్టుకున్నాడు. తోటి ఆటగాళ్లంతా అతడిని చుట్టుముట్టి ఓదార్చారు. అతడికి అండగా నిలిచారు. గ్యాలరీలో మ్యాచ్‌ను వీక్షిస్తున్న అభిమానులు కూడా ఒకింత ఉద్విగ్నభరితంగా మారారు. కారణం.. ఈ మ్యాచ్‌కు సరిగ్గా మూడు రోజుల ముందే హాక్పో తన బిడ్డను కోల్పోయాడు. అతడి సహజీవన భాగస్వామి నోవా వాన్ డెర్ బిజ్ గత శనివారం ఈ విషాదకర విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ భూమ్మీద పడకుండానే తమ బిడ్డను కోల్పోయామని పేర్కొన్నారు. కూడీ హాక్పో, అతడి భాగస్వామి నోవా 2025లో తొలి బిడ్డకు జన్మనిచ్చారు. ఫిఫా వరల్డ్‌కప్ టోర్నీకి కొన్ని వారాల ముందు తమకు రెండో బిడ్డ పుట్టబోతున్నట్లు ప్రకటించారు. దురదృష్టవశాత్తూ ఈ బిడ్డను వీరు కోల్పోవాల్సి వచ్చింది.ఈ దుఃఖ సమయంలో హాక్పో తన కుటుంబంతో ఉండేందుకు వీలుగా నెదర్లాండ్స్ యాజమాన్యం అతడికి సెలవు కల్పించింది. కానీ, ఫిఫా ప్రపంచకప్ టోర్నీలో అత్యంత కీలకమైన నాకౌట్ దశ జరుగుతున్న వేళ.. జట్టును వీడేందుకు అతడి మనసు అంగీకరించలేదు. అందుకే, బాధను మనసులోనే దాచుకుని మ్యాచ్ ఆడాడు. అయితే, అతడి పోరాటం వృథా అయ్యింది. స్కోర్లు సమమవడంతో షూటౌట్ నిర్వహించారు. ఇందులో నెదర్లాండ్స్‌ను మొరాకో ఓడించడంతో డచ్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది.



## ప్రపంచకప్ జట్టులో రోహిత్‌కు చోటు ఖాయం.. : రాయుడు

పసికూన ఐర్లాండ్ చేతిలో అత్యంత అవమానకర రీతిలో వైట్‌వాష్‌కు గురైన టీమ్‌ఇండియా.. ఇంగ్లాండ్‌తో వైట్ బాల్ సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఈ సిరీస్‌లో మూడు వన్డేలు కూడా ఉండటంతో.. ఇప్పుడు అందరి దృష్టి సీనియర్లైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల పైనే ఉంది. వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ ఆడాలనే లక్ష్యంతో వీరిద్దరూ ఉన్నారు. ఈ నేపథ్యంలో రోహిత్ శర్మకు మాజీ ఆటగాడు అంబటి రాయుడి నుంచి మద్దతు లభించింది. ప్రపంచకప్ జట్టులో హిట్‌మ్యాన్‌కు చోటు కల్పించాలని కోరాడు. అందుకోసం రాబోయే మ్యాచ్‌ల్లో రోహిత్ అద్భుత ప్రదర్శన చేస్తాడని పేర్కొన్నాడు. ''రోహిత్ శర్మ అనుభవం అమూల్యమైనది. అతడు జట్టులో ఉండటం చాలా అవసరం. ఎందుకంటే అతడు మైదానంలోనే కాకుండా.. డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా మంచి వాతావరణాన్ని నెలకొల్పే నాయకుడిగా వ్యవహరిస్తాడు. ప్రపంచకప్‌లాంటి మెగాటోర్నీకి వెళ్లే ముందు జట్టులో ఇది ఎంతో కీలకం. జట్టు క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు, ప్రపంచకప్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి, టీమ్‌ను సిద్ధం చేయడానికి ఆ అనుభవం ఎంతో ఉపయోగపడుతుంది''. ''ప్రపంచకప్ ప్రణాళికల్లో అతడు కచ్చితంగా ఉన్నాడని నా నమ్మకం. అందుకే అతడిని జట్టులో కొనసాగిస్తున్నారని భావిస్తున్నాను. పైగా అతడి బ్యాటింగ్ అద్భుతంగా ఉంటుంది. అయితే చాలా ఏళ్లుగా జట్టుకు ఆడుతున్నప్పుడు.. ఒక్కోసారి ఆశించిన స్థాయిలో రాణించకపోవచ్చు. కానీ కీలకమైన ఇంగ్లాండ్‌లాంటి సిరీస్‌లో అతడు కచ్చితంగా అద్భుతంగా ఆడతాడనే నమ్మకముంది'' అని రాయుడు మద్దతుగా నిలిచాడు. రోహిత్‌తోపాటు జైస్వాల్ కూడా ప్రపంచకప్ ఆడేందుకు అర్హుడేనని రాయుడు తెలిపాడు.





## ఆసియా గేమ్స్‌కు భారత మహిళల జట్టు ఇదే..

ఈ ఏడాది ఆసియా గేమ్స్‌కు భారత మహిళల జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఈ జట్టుకు హర్మన్‌ప్రీత్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా.. స్మృతి మంధానను వైస్ కెప్టెన్‌గా నియమించింది. ఇటీవల మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీ నుంచి మన జట్టు ఫైనల్‌కు చేరకుండానే నిష్క్రమించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ హర్మన్‌పై మేనేజ్ మెంట్ నమ్మకం ఉంచి.. ఆసియా క్రీడల కు సారథ్య బాధ్యతలను అప్పగించింది. ప్రపంచకప్‌లో బరిలోకి దిగిన జట్టులోని మిగతా సభ్యుల్లోనూ పెద్దగా మార్పులు చేయలేదు. వికెట్‌కీపర్ బ్యాటర్ యస్తికా భాటియాను మాత్రమే తప్పించి.. ఆమె స్థానంలో జి. కమిలినిని బీసీసీఐ ఎంపిక చేసింది. ప్రపంచకప్ టోర్నీ సమయంలో గాయపడిన శ్రేయాంక పాటిల్‌కు ఆసియా క్రీడల్లోనూ స్థానం కల్పించారు. అయితే, టోర్నీకి ముందు ఆమె ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంటుంది.ఒలింపిక్స్‌కు భారత మహిళల క్రికెట్ జట్టు అర్హత జపాన్ వేదికగా సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 4 వరకు ఆసియా క్రీడలు జరగనున్నాయి. 2023లో చైనా వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో టీమ్‌ఇండియా మహిళల జట్టు స్వర్ణం గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది మన అమ్మాయిలు డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా టోర్నీలో దిగనున్నారు. హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా గోష్, జి.కమిలిని, భారతి ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, నందిని శర్మ.



## వంద శాతం ఫిట్‌గా ఉన్న ప్లేయర్లే ఆడారా..?: సునీల్ గావస్కర్

మహిళల టీ20 ప్రపంచకప్ 2026 నుంచి భారత్ లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టడంపై టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ స్పందించాడు. టోర్నీలో వంద శాతం ఫిట్‌గా ఉన్న ప్లేయర్లను భారత్ ఆడించిందా? అని సందేహం వ్యక్తం చేశాడు. ఆస్ట్రేలియాతో చావోరేవో లాంటి మ్యాచ్‌లో ఓటమిపాలైన భారత్ సెమీస్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. ''ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓడిపోవడం పెద్ద ఆశ్చర్యమేమీ కాదు. కానీ, అంతకు ముందు జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాను టీమ్‌ఇండియా ఓడించాల్సింది. ఆ మ్యాచ్‌లో మంచి స్థితిలో ఉండి కూడా పేలవమైన ఫీల్డింగ్‌తో ఓటమిపాలయ్యారు. ఆ మ్యాచ్‌తోనే భారత్ దాదాపు టోర్నీ నుంచి నిష్క్రమించింది. చాలామంది క్రికెట్ అభిమానులు అడిగే ప్రశ్న ఏంటంటే.. మనం ఫిట్‌గా ఉన్న ప్లేయర్లను టోర్నీలో ఆడించామా?ఒక ప్లేయర్ పూర్తిగా ఫిట్‌గా లేకపోయినా రాణించగల ప్రతిభావంతులైతే వారిని ఆడించడం అర్థం చేసుకోదగినదే. గాయపడిన ప్లేయర్ స్థానాన్ని భర్తీ చేయడానికి రిజర్వ్‌లో ఉన్నవారు సరిపోరని భావించినప్పుడు కూడా ఇలా చేయొచ్చు. అయితే.. టీమ్‌ఇండియా విషయంలో ఇలా జరిగి ఉంటుందని నేను అనుకోవడం లేదు.



